ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం fb.com/vaartha
PUBLISHED FROM KHAMMAM, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
25-2-2023 శనివారం సంపుటి : 29 సంచిక : 25, పేజీలు :8+16 వెల : 6.50

రాష్ట్రంలో క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు 3లో

మార్చి 12న రాష్ట్రానికి హోంమంత్రి అమిత్‌షా 7లో

## చెలరేగిపోతున్న వీధికుక్కలు



### హైదరాబాద్‌లో రెండు రోజుల్లోనే 30 మందికి గాయాలు

### రాష్ట్రంలో 10 లక్షలు పైగా వీధికుక్కలు

### దొరకని రాబిస్ నివారణ వ్యాక్సిన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వీధి కుక్కల దాడులు ఆయా ప్రాంతాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వారం రోజుల క్రితం నగరంలోని అంబర్‌పేట్‌లో వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడు మరణించిన ఘటన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా రంగారెడ్డి, కరీంనగర్ సహా పలుచోట్ల కుక్కల దాడులు పెరిగిపోవడం గమనార్హం. అంబర్‌పేట్ ఘటనపై హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించి సర్కారును నివేదిక కోరడం తెలిసిందే. ఈ ఘటనపై సర్కారీ విభాగాల వైఫల్యాలను హైకోర్టు ఎండగట్టడంవిదితమే. హైకోర్టు మొట్టికాయల తరువాత కుక్కల దాడులను నివారిస్తామని సర్కారీ విభాగాలు చెప్పినా క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు దీనికి భిన్నంగా వుండడం విశేషం. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా పల్లెలు మొదలుకొని పట్టణాల వరకు శునకాల బెడద రోజురోజుకు ఎక్కువవుతోంది. కుక్కల దాడిలో గాయపడుతూ ఆసుపత్రుల పాలవుతున్న వారి సంఖ్య నిత్యం వందల్లో వుంటోందంటే వాటి బెడద ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. ఇక కుక్కల దాడిలో గాయపడ్డ వారికి రాబిస్ వ్యాధి సోకకుండా వుండేందుకు ఇచ్చే వ్యాక్సిన్‌లు అందుబాటులో లేకపో ≫2

# లైఫ్‌సైన్స్ కేంద్రంగా తెలంగాణ



శుక్రవారం బయో ఆసియా సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి కెటిఆర్

### 2030నాటికి ఈ రంగం విలువ 100 బిలియన్ డాలర్లు

### ఆసియా బయో సదస్సులో మంత్రి కెటిఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ప్రపంచంలోనే అత్యుత్తమ లైఫ్ సైన్సెన్ కేంద్రంగా వెలుగొందుతున్నామని, అలాగనీ ఇక్కడ మేము ఆగిపోవాలనుకోవడంలేదని ఐటి, పరిశ్రమల మంత్రి కె.తారకరామారావు అన్నారు. శుక్రవారం ఆసియాలో అతిపెద్ద లైఫ్‌సైన్సెస్, ఆరోగ్య సంరక్షణ సదస్సు 20వ ఎడిషన్ బయో ఆసియా ప్రారంభమైంది. హైదరాబాద్ ఈ సదస్సు జాతీయ, అంతర్జాతీయ ఉద్దండుల సమక్షంలో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈసదస్సు తొలిరోజు ప్రభుత్వం అధికారులు, బిజినెస్ ఎగ్జిక్యూటీవ్, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అంతర్జాతీయ ఖ్యాతిగడించిన వ్యక్తులు పాల్గొన్నారు. అడ్వాన్సింగ్ ఫర్ ఓన్: షేపింగ్ నెక్ట్ జనరేషన్ ఆఫ్ హ్యూమనైజ్డ్ హెల్త్‌కేర్ నేపథ్యంలోన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం అత్యంతప్రతిష్టాత్మకంగా నిర్వహి ≫2

## వివేకా హత్యకేసు

# అవినాష్‌ను ప్రశ్నించిన సిబిఐ


శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న అవినాష్

### అన్ని కోణాలనుంచి 4 గంటలుపైగా ప్రశ్నల వర్షం

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపి దివంగత సిఎం వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరుడు వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో హైదరాబాద్ కేంద్రంగా సిబిఐ విచారణ రెండవసారి జరిగింది. ఈ కేసులో అనుమానితుడుగా చెబుతున్న కడప ఎంపి అవినాష్ రెడ్డి అవినాష్ రెడ్డిని గత నెల 28వ తేదీన నాలుగున్నర గంటల పాటు విచారించిన సిబిఐ శుక్రవారం నాడు రెండవసారి కూడా నాలుగున్నర గంటల పాటు భిన్న అంశాలపై ప్రశ్నించింది. ఇప్పటి వరకు ఎపి కేంద్రంగా సాగిన ఈ కేసు విచారణ సుప్రీం కోర్టు ≫7

## ప్రీతి ఆత్మహత్యాయత్నం కేసు

# సైఫ్ అరెస్టు

### ఖమ్మం జైలుకు తరలింపు



**వరంగల్ క్రైం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** మెడికో సీనియర్ విద్యార్థి సైఫ్ కావాలనే ప్రీతిని వేధించినట్లు తమ విచారణలో వెల్లడైందని వరంగల్ సిపి ఎవి రంగనాథ్ అన్నారు.ఈ విషయమై ఎందుకు తనను వేదిస్తున్నావంటూ ప్రీతి సైఫ్‌కు వాట్సాప్ ద్వారా మెసేజ్‌లు కూడా చేసిందని ఆయన వివరించారు. వరంగల్ మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యయత్నానికి దారి తీసిన పరిస్థితులను శుక్రవారం పోలీస్ కమీషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి రంగనాథ్ వెల్లడించారు. సైఫ్ కావాలనే ప్రీతిని వేధించినట్లు వాట్సప్ చాట్ ద్వారాతెలిసిందని తన ఫ్రెండ్‌తోకూడా ఈ విషయంపై పలుసార్లు ప్రస్థావించినట్లు తమవిచారణలో తేలిందన్నారు. తనను ఎందుకు ≫2


పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి

## మార్చి 3 నుంచి ఎంసెట్ దరఖాస్తులు

### ఈ 28న నోటిఫికేషన్

### మే 7 నుంచి 9 దాకా ఇంజినీరింగ్ పరీక్షలు

### మే 10, 11న ఫార్మసీ, అగ్రికల్చర్

### మే 29 నుంచి జూన్ 1దాకా పిజిఇసెట్ పరీక్షలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం నిర్వహించే ఎంసెట్-2023కి సంబంధించిన దరఖాస్తులను మార్చి 3నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 28న జారీ చేయనున్నారు. పరీక్షలను మే 7 నుంచి 11 వరకు నిర్వహించనున్నారు. దీంతోపాటు పిజిఇసెట్-2023కి సంబంధించిన దరఖాస్తులను సైతం మార్చి 3 నుంచి స్వీకరించనున్నారు. పరీక్షలను మే 29 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నారు. ఈ రెండు ప్రవేశ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్‌లను ఈ నెల 28న జారీ చేయనున్నారు. ఎంసెట్-2023, పిజిఇసెట్-2023కి సంబంధించిన ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని జెఎన్‌టియూలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత ≫2



E-book today at www.marutisuzuki.com or visit your nearest Maruti Suzuki dealership | All Maruti Suzuki vehicles now available under CSD & CPC | For bulk orders, mail at: soupayan.kar@maruti.co.in

AUTHORISED DEALERS: TELANGANA STATE: ADARSHA: (KARIMNAGAR) CALL: 9133308022, (WARANGAL) CALL: 7799790501. VARUN: (NIZAMBAD) CALL: 8462236236, (KARIMNAGAR) CALL: 0878- 2950555. PAVAN: (NALGONDA) CALL: 8790902131. SRI JAYARAMA: (MEHABUBNAGAR) CALL: 8096998841. WIN MOTORS: (WARANGAL) CALL: 8688828002. E-OUTLETS: ADARSHA: (MANCHERIAL) CALL: 8886006633, (NIRMAL) CALL: 9133307720, (JAGITYAL) CALL: 8886776633, (GODAVARIKHANI) CALL: 8886556633, (ADILABAD) CALL: 7799784536, (JANGAON) CALL: 8886256633, (SIDDIPET) CALL: 9581656633. VARUN: (KAMAREDDY) CALL: 9966111132, (ARMUR) CALL: 9052022990, (KOTTAGUDEM) CALL: 9885260333. PAVAN: (MIRYALAGUDA) CALL: 8790902154, (KODADA) CALL: 8790902135. SRI JAYARAMA: (SHADNAGAR) CALL: 8096998841, (WANAPARTHY) CALL: 8096998841. MITHRA AUTO: (KHAMMAM) CALL: 8886063524. SAI SERVICE: (ZAHEERABAD) CALL: 7331168888. HYDERABAD: ADARSHA: (ATTAPUR) CALL: 8897973366, (KARMANGHAT) CALL: 8297576633. KALYANI MOTORS: (NACHARAM) CALL: 9100102157, (LB NAGAR) CALL: 9100102157. GEM MOTORS: (KONDAPUR) CALL: 9272506060. ACER: (TIRUMALGIRI) CALL: 9154073240. AUTOFIN: (BOWENPALLY) CALL: 040-67292222. JAYABHERI: (GACHIBOWLI) CALL: 8100823456. PAVAN: (SERILINGAMPALLY) CALL: 7093711199. VARUN: (BEGUMPET) CALL: 040-44607676, (BANJARA HILLS) CALL: 040-44887676, (KUKATPALLY) CALL: 040-44587676, (VANASTHALIPURAM) CALL: 040-24029979, (GACHIBOWLI) CALL: 040-49497676. RKS: (SOMAJIGUDA) CALL: 9848898488, (MALAKPET) CALL: 9848898488, (SECUNDERABAD) CALL: 9848898488, (KUSHAIGUDA) CALL: 9848898488. MITHRA: (HIMAYATHNAGAR) CALL: 040-27634444, (MEHDIPATNAM) CALL: 7799884949. SAI SERVICE: (ERRAGADDA) CALL: 7331168888, (MIYAPUR) CALL: 7331168888. E-OUTLETS: SAI SERVICE: (SANGAREDDY) CALL: 7331168888. ADARSHA: (SIDDIPET) CALL: 9581656633. VARUN: (MEDAK) CALL: 9703656111. AUTOFIN: (MEDCHAL) CALL: 8885040034. PAVAN: (IBRAHIMPATNAM) CALL: 7093711199.

*Offer includes consumer offer, retail support, exchange bonus and ISL/ Corporate offer (wherever applicable) on select models/variants. *Terms and conditions apply. Terms and conditions apply. Creative Visualization. The terms and conditions are subject to change without any prior notice. All offers are brought to you by Maruti Suzuki dealers only. Offers may vary from variant to variant. All offers shown are valid for limited period & for limited stock only. **Fuel efficiency as certified by test agency under Rule 115 of CMVR 1989. For details on functioning of safety features, including air bag, kindly refer to the Owner's Manual. For more details, please contact your nearest ARENA dealership. Accessories and features shown in the pictures may not be a part of the standard equipment and may vary according to the variant. Black glass on the mirror is due to lightening effect. Colors shown may vary from actual body colors due to printing on paper. Images used are for illustration purposes only. Maruti Suzuki India Limited reserves the right to discontinue offers without notice. Above offers are valid till 28th February 2023.

# కెఎంసి పిజి వైద్య విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటన

## హోంమంత్రి మహమూద్ అలీపై జాతీయ మానవ హక్కుల సంఘంలో ఫిర్యాదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన వరంగల్ కెఎంసి పిజి వైద్యవిద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనలో హోంమంత్రి మహమూద్‌అలీపై జాతీయ మానవ హక్కుల సంఘంలో ఫిర్యాదు నమోదయ్యింది. కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ హోంమంత్రిపై ఫిర్యాదు చేశారు. వైద్యవిద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనలో నిందితుడుగా వున్న సైఫ్ హోంమంత్రి మహమూద్ అలీకి బంధువని, ఈ కారణంగానే అతని అరెస్టు ఆలస్యం అయ్యిందని ఆయన తన ఫిర్యాదులో తెలిపారు. ఈ కేసులో సైఫ్‌ను రక్షించే ప్రయత్నం జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ విషయంలో తాము ప్రీతికి మద్దతుగా పోరాటం చేస్తామని, ఆమెకు న్యాయం జరిగే వరకు ఇది కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. మెదక్ జిల్లాలో ఖదీర్‌ఖాన్ అనే చిరువ్యాపారిని పోలీసులు చిత్రహింసలకు గురిచేయడం వల్ల చనిపోతే హోం మంత్రి మహమూద్ అలీ కనీసం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఖదీర్‌ఖాన్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని జడ్సన్ తెలిపారు.

# టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 21 నామినేషన్లు చెల్లుబాటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** హైదరాబాద్ లోకల్ అథారిటీ ఎమ్మెల్సీ మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు వేసిన నామినేషన్ల పరిశీలను శుక్రవారం జరిగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రియాంక ఆలా పరిశీలన చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా మహ్మద్ రహీంఖాన్ దాఖలుచేసిన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ఆ నామినేషన్ పత్రాలలో పది మంది బలపరిచిన వారు ఓటర్లు కానందున తిరస్కరించినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి 21 మంది నామినేషన్లలో ఏ ఒక్కటి తిరస్కరించబడలేదని రిటర్నింగ్ అధికారి స్పష్టం చేశారు.

# పెద్ద దొరను ఎందుకు సిఎంను చేయాలో చెప్పండి?

## వైఎస్సార్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** పెద్ద దొరను సిఎం ఎందుకు చేయాలో జర చెప్పు చిన్న దొర అంటూ వైఎస్సాఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సిఎం కెసిఆర్‌పై విమర్శలు కురిపించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు.

రాష్ట్రాన్ని అధోగతి పాలుజేసినందుకా? స్కీములు పేరిట స్కాములు చేసినందుకా? కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు దోచుకుతిన్నందుకా? పాలమూరును కట్టకుండా దక్షిణ తెలంగాణ యేడారి చేసినందుకా? రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని రూ.4.80 లక్షల కోట్లు అప్పులు చేసినందుకా అంటూ ప్రశ్నించారు.

అదేవిధంగా వడ్డీ లేని రుణాలు, కార్పొరేషన్ లోన్లు ఇస్తామని, దగా చేసినందుకా? రుణమాఫీ, నిరుద్యోగ భృతి అంటూ మోసం చేసినందుకా? దళిత సిఎం, దళితులకు మూడు ఎకరాలు భూమి అంటూ నిండా ముంచినందుకా? డబుల్ బెడ్ రూం ఇండ్లు, పోడు పట్టాలు ఇస్తామని కుచ్చుటోపి పెట్టినందుకా? డిస్కంలను దివాళా తీసి, ఆర్‌టిసిని ఆగం చేసి ప్రభుత్వం భూములను కొల్లగొట్టినందుకా? అంటూ ప్రశ్నించారు.

# ప్రభుత్వ లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలి

## జిల్లా కలెక్టర్‌లతో సిఎస్ శాంతికుమారి విడియో కాన్ఫరెన్సు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను జిల్లా కలెక్టర్లు సకాలంలో పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు, పట్టణ ప్రాంతాలలో రెండు పడక గదులు నిర్మాణం, ప్రభుత్వ జిఓ.58, 59,76ల ప్రకారం క్రమబద్ధీరణ, జిల్లాలలో ఆయిల్ ఫాం సాగుపై జిల్లా కలెక్టర్‌లతో విడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు కృషి చేసినందుకు జిల్లా కలెక్టర్‌లను అభినందించారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 25 పని దినాలలో 51.86 లక్షల మంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, 9 లక్షల మందికి రీడింగ్ గ్లాసెస్‌ను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులకు అందించే ప్రిస్కిప్షన్ ఆధారంగా ఇచ్చే కంటి అద్దాలను పంపిణీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

కంటి వెలుగు శిబిరాలను జిల్లా కలెక్టర్‌లు, జిల్లా అధికారులు సందర్శించాలన్నారు. ప్రిస్కిప్షన్ ఆధారంగా అద్దాల పంపిణీలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా 2023-24 సంవత్సరంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు వెంటనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్‌లను ఆదేశించారు. మొక్కల సంరక్షణ కోసం నీటి వినియోగం సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఆయిల్ ఫాం సాగు లక్ష్యాలను సాధనకు జిల్లా కలెక్టర్లు కృషి చేయాలన్నారు. జిల్లాల్లో సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లోకి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను తరలించే ప్రక్రియను పూర్తిచేయాలన్నారు.

జిఓనెంబరు. 58కి సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వేపూర్తిచేసి లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్‌ను సిఎస్ ఆదేశించారు. జిఓనెంబరు.58,59,76 కింద పట్టాల పంపిణీ ప్రారంభించి మార్చి చివరి వరకు పూర్తిచేయాలన్నారు. రాష్ట్రంలో నిరుపేదలకు భూమి పట్టాలకు ప్రధానం చేయడానికి కార్యాచరణ రూపొందించాలని స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు కృషి చేయాలని సిఎస్ ఆదేశించారు.

ఈ విడియో కాన్ఫరెన్సులో పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్‌రాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి శ్రీదేవీ, జిహెచ్ఎంసి కమిషనర్ లోకేషకుమార్, మున్సిపల్ శాఖ కమిషనర్ సత్యగనారయణ, వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ శ్వేతామహంతి, పిసిసిఎఫ్ డోబ్రియాల్, హార్టికల్చర్ డైరక్టర్ హనుమంతరావు, సిసిఎల్‌ఏ ప్రత్యేక అధికారి సత్యశారదలు పాల్గొన్నారు.



# యాసంగి సాగు రికార్డు బ్రేక్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రస్తుత యాసంగి సీజనులో సాగు రికార్డు బ్రేక్ చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని పంటలూ కలిపి 144.68 శాతం మేర 63 లక్షల 23 వేల 673 ఎకరాల్లో సాగయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి కేవలం 48 లక్షల 56 వేల 136 ఎకరాల్లో మాత్రమే పంటలు వేయడం జరిగింది. రాష్ట్రంలోని నల్లగొండ, సూర్యాపేట్, నిజామాబాద్ జిల్లాల్లో యాసంగి పంటలు అత్యధికంగా సాగుచేశారు. దీనికి సంబంధించి తాజా నివేదికను వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి సమర్పించింది. ఇక ఈ యాసంగిలో ప్రధానంగా వరి పంట విషయానికి వస్తే 160.15 శాతం చొప్పున 53 లక్షల 71 వేల 143 ఎకరాల్లో నాట్లు పడి ఆల్ టైం రికార్డు నమోదు చేసింది. గత ఏడాది ఇదే సమయానికి 33 లక్షల 12 వేల 905 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. భూగర్భ జలాలు పెరిగి చెరువులు, బావుల్లో నీరు ఉండటంతో వరి సాగు ఈ సారి భారీగా పెరిగింది. ఈ యాసంగిలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 40 లక్షల ఎకరాల వరకూ వరి నాట్లు వేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఈ ఏడాది వరి సాగుపై ఎటువంటి ఆంక్షలూ లేకపోవడంతో రైతులందరూ వరి సాగు చేసేందుకే మొగ్గు చూపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 5 లక్షల 43 వేల 739 ఎకరాల్లోను, సూర్యాపేట్ జిల్లాలో 4 లక్షల 74 వేల 904 ఎకరాల్లో, నిజామాబాద్ జిల్లాలో 3 లక్షల 93 వేల 280 ఎకరాల్లో, సిద్దిపేట్ జిల్లాలో 3 లక్షల 31 వేల 392 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. వరి తర్వా మరో ప్రధాన పంట మొక్కజొన్న 134.97 శాతం చొప్పున 6 లక్షల 25 వేల 722 ఎకరాల్లో సాగైంది. మొత్తంగా వరి, జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, మినుము తదితర ఆహార ధాన్యాల సాగు 151.42 శాతం మేర 65 లక్షల 56 వేల 343 ఎకరాల్లో వేయడం జరిగింది. ఇక వ్యవసాయ అధికారుల ప్రోత్సాహం కరువు కావడంతో అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉన్న నూనె పంటల సాగు మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. రాష్ట్రంలో ప్రస్తుత యాసంగి సీజనులో సన్‌ఫ్లవర్, వేరుశెనగ తదితర ఆయిల్ పంటల సాగుకు సంబంధించి 79.22 శాతంగా 3 లక్షల 10 వేల 477 ఎకరాల్లో సాగు చేశారు. వీటిలో ముఖ్యంగా వేరుశెనగ 2 లక్షల 41 వేల 752 ఎకరాల్లో వేశారు. రాష్ట్రంలోనే ఆయిల్ పంటల సాగు అత్యధికంగా నాగర్‌కర్నూలు జిల్లాలో 1 లక్షల 20 వేల 654 ఎకరాల్లో వేశారు. అలాగే నిజామాబాద్, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో ఆయిల్ పంటల సాగు 20 నుండి 25 ఎకరాల్లో వేశారు. కాగా ఈ సారి తెలంగాణలో రైతులు అక్కడక్కడా పొగాకు పంటను వేశారు. రాష్ట్రంలో 7 వేల 237 ఎకరాల్లో పొగాకును సాగు చేశారు.

> 69.23 లక్షల ఎకరాల్లో పంటలు
> ఆల్ టైమ్ రికార్డుగా వరి నాట్లు
> ఆయిల్ పంటల సాగు అంతంత మాత్రమే

# కరెంటు కొనుగోలు మరింత భారం!

## ఇక ఎనర్జీ ఎక్ఛేంజీలో యూనిట్ రూ. 50

## విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు భారీ ఉపశమనం

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** విద్యుత్ ఉత్పత్తి సంస్థలు (జెన్‌కో)కు భారీ ఉపశమనం కలిగిస్తూ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (సిఇఆర్సీ) నిర్ణయం తీసుకుంది. ఎనర్జీ ఎక్ఛేంజీలో యూనిట్ 50 రూపాయల ధరకు కరెంటును విక్రయించేందుకు మూడు కేటగిరీల విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యుత్ కొనుగోలుకు సంబంధించి హై ప్రైస్ డే అహెడ్ మార్కెట్ (హెచ్‌పి-డిఏఎం) విధానాన్ని ప్రవేశపెట్టాలనే జన్‌కోల పిటీషన్‌పై సిఇఆర్సీ విచారించింది. ఈ నేపథ్యంలో పిటీషనర్ల ప్రతిపాదనకు కమిషన్ ఆమోదించింది. ప్రస్తుతం ఎనర్జీ ఎక్ఛేంజీలో యూనిట్ ధర 12 రూపాయలు ఉండగా, ఇంధన ఉత్పత్తి నిమిత్తం అయ్యే ఖర్చులు, ఇతర చార్జీల కారణంగా అధిక వేరియబుల్ (తరచూ పెరుగుతున్న, మారుతున్న) ఖర్చులను భరించే పవర్ జనరేటింగ్ సంస్థలకు అయ్యే భారాన్ని దృష్టిలో ఉంచుకుని దాన్ని 50 రూపాయలకు పెంచే నిర్ణయానికి తాజాగా ఆమోదం తెలిపింది. కొత్త రేట్లను ప్రవేశపెట్టాలని కోరుతూ ఇండియన్ ఎనర్జీ ఎక్ఛేంజ్ (ఐఈఎక్స్) దాఖలు చేసిన పిటీషన్లపై గురువారం ఈ ఉత్తర్వులను సిఇఆర్సీ వెలువరించింది. దిగుమతి చేసుకున్న గ్యాస్ ధరలు, జాతీయ విద్యుత్ గ్రిడ్ ఆపరేటర్ వద్ద తాజా సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని హెచ్‌పి డీఏఎం యొక్క గరిష్ట ధర పరిమితిని కిలో వాట్ పర్ హవర్ 50 రూపాయల వద్ద అనుమతించాలని తాము నిర్ణయం తీసుకున్నట్లు సిఇఆర్సీ వెల్లడించింది. ఇతర మార్కెట్లపై హెచ్‌పి డీఏఎం ప్రభావంతో సహా అత్యధిక ఉత్పత్తి వ్యయం, ఇతర సంబంధిత అంతర్జాతీయ, దేశీయ అంశాల ఆధారంగా ఈ ఎగువ ధర పరిమితిని కాలానుగుణంగా సమీక్షించనున్నట్లు రెగ్యులేటర్ తెలిపింది. ముఖ్యంగా ఖరీదైన సహజ వాయువు (ఆర్ఎల్ఎన్‌జి), దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత కేంద్రాలు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బిఇఎస్ఎస్) ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న జెన్‌కోలకు ఈ వేసవి కాలంలో యూనిట్ 50 రూపాయలకు విక్రయించునే వెసులు బాటు కలగనుంది. తరచూ పెరుగుతు, మారుతున్న విద్యుత్ ఉత్పత్తి వ్యయాల దృష్ట్యా ఎనర్జీ ఎక్ఛేంజీలలో కరెంటును విక్రయించేందుకు వివిధ సంస్థలు ఆసక్తి కనపరచడం లేదు. దీంతో ఈ వేసవి కాలంలో భారీగా పెరిగే విద్యుత్ డిమాండ్‌ను అధికమించేందుకు రాష్ట్రాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఎనర్జీ ఎక్ఛేంజీలో కరెంటును అమ్ముకునే అవకాశాన్ని కల్పించేందుకుగాను జెన్‌కోలకు అనుకూలమైన నిర్ణయం తీసుకోవడం తప్పనిసరి అయింది. ఇందువల్ల విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు భారీగా ఊరట కలుగనుండగా, కరెంటును కొనుగోలు చేసే పంపిణీ సంస్థలు (డిస్కంలు)కు మాత్రం భారీగా ఆర్థిక భారం పడనుంది.

ఇప్పటికే ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తుండగా, వాటికయ్యే సొమ్మును విడుదల చేయకపోవడం, ప్రభుత్వ సంస్థల నుండి పెద్ద మొత్తంలో బాకాయిలు చెల్లించని నేపథ్యంలో ఆర్థిక నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న డిస్కంలకు యూనిట్ ధరను పెద్ద మొత్తంలో పెంచడం మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఏర్పడింది.

# ప్రయాణికులకు వేసవి సౌకర్యాలు

## ఆర్టీసి ఎండి సజ్జనార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఈ వేసవి కాలంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు తదితర సౌకర్యాలు అందించాలని ఆర్టీసీ ఎండి సజ్జనర్ సూచించారు. హైదరాబాద్ బస్ భవన్ నుండి శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ఫ్యాన్లు, కూలర్లు, బెంచ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రయాణీకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ప్రజా రవాణా వ్యవస్థ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సంస్థ ఆర్థిక పుష్టికి పాటుపడాలన్నారు. ఇదే సమయంలో మార్చి నెలలో వివాహ, శుభకార్యాలు ఎక్కువగా ఉన్నాయని, అందుకు అనుగుణంగా బస్సులను అందుబాటులో ఏర్పాటు చేయాలని వివరించారు. అద్దె బస్సులపై 10 శాతం రాయితీ కల్పిస్తోన్న విషయాన్ని తెలియచేయాలన్నారు. 31 నుండి 45 రోజుల ముందు రిజర్వేషన్లకు 5 శాతం, 46 నుండి 60 రోజుల ముందు 10 శాతం రాయితీ కల్పిస్తున్నామని వెల్లడించారు.

## భానుడి భగభగలు మొదలు...

# మార్చి 15 తర్వాత పెరగనున్న ఉష్ణోగ్రతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగింది. తెలంగాణలో సాధారణం కన్నా రెండు డిగ్రీలు అధికంగా ఎండ తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. గత ఏడాది ఇదే సమయంతో పోల్చితే ఎండలు తీవ్రంగా ఉన్నాయని వాతావరణ శాఖ డైరెక్టర్ డాక్టరన నాగరత్న తెలిపారు. మార్చి 15 తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని,ఏప్రిల్ తర్వాత వడగాల్పులు తీవ్రత అధికంగా ఉంటుందని ఆమె వివరించారు. ప్రస్తుతం 37 డిగ్రీల వరకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని చెప్పారు. దక్షిణ,పశ్చిమ తెలంగాణలో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉందన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవి ప్రారంభం కావడంతో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రాత్రి సమయంలో మంచు కురిచి ఉదయాన్నే ఎండ తీవ్రంగా కాస్తోంది. దీంతో వాతావరణంలో కొన్ని మార్పులు జరిగి కొంత మందికి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల పిల్లలు,వృద్దులు చాలా జాగ్రత్తగా ఉండాలి.

# పిజి వైద్య విద్యార్థినిపై ర్యాగింగ్‌కు పాల్పడిన వారిని శిక్షించాలి

- కెఎంసి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి
- ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలోన పీజీ చదువుతున్న ప్రీతి అనే విద్యార్థినిపై వేధింపులకు పాల్పడిన సీనియర్‌పై చర్యలు తీసుకోవాలని అఃల భారత విద్యార్థి పెడరేషన్(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మెడికల్ పీజీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని సీనియర్ విద్యార్థి ర్యాగింగ్, లైగింక వేధింపులను భరించలేకనే ఎంజీఎం ఆసుపత్రిలో ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించిందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తలెఇపారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులపై కూడా ర్యాగింగ్ జరగడం బాధకరమన్నారు. సీనియర్ విద్యార్థి ర్యాగింగ్ చేస్తున్నాడని.. మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని ప్రిన్సిపాల్‌కి పలుమార్లు చెప్పినా ప్రిన్సిపాల్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహారించడం మూలంగానే.. విద్యార్థిని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా కెఎంసీలో జూనియర్లను సీని యర్లు ర్యాగింగ్ చేసినా అధికారులు చర్యలు తీసుకోవకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. రోజు రోజుకు రాష్ట్రంలో ర్యాగింగ్ సంఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహారించిన కెఎంసీ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# సింగరేణి ప్రైవేటీకరణ అంటూ అబద్ధపు ప్రచారం

- కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల లాభాలెవరికి?
- హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న బిఆర్ఎస్
- బిజెపి చీఫ్ బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి:** సింగరేణీ ప్రయివేటీకరణ అంటూ బిఆర్ఎస్ ప్రభుత్వం విషపూరిత ప్రచారం చేస్తున్నారని బిజెపి స్టేట్ చీఫ్ బండి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం కాటారం మండలకేంద్రంలోని ఎల్‌జి గార్డెన్‌లో కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహదేవపూర్, మహముత్తారం, పలిమెల, మల్హర్ రావు మండలాల్లో బిజెపి రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర మొదటి విడత ముగింపు సందర్భంగా, మంథని నియోజకరవర్గ బూత్ కమిటీ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. సింగరేణీలో రాష్ట్రానికి 51శాతం ఉన్న బిఆర్ఎస్ ప్రయివేటీకరణ చేస్తుందా, కేవలం కేంద్రానికి 49శాతం వాట ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరణ చేస్తుందా అని అన్నారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు మాత్రమే బిఆర్ఎస్ నాయకులు పూనుకున్నారని విమర్శించారు. ఇప్పటికే బిజెపి రాష్ట్రంలో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. ప్రజలకు ఏసమస్యలు వచ్చినా వెంటనే అక్కడ బిజెపి ఉంటుందని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, మంథని గడ్డపై కాషాయ జెండా ఎగుర వేయడం ఖాయమన్నారు. ఇప్పటికే ఆదిశగా ముందుకు సాగడం జరుగుతుందని అన్నారు. ప్రయివేటు కంపెనీలకు సింగరేణీని అప్పజెప్పి ఇప్పటికే 20వేల కోట్ల స్కాం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలోని 56నియోజకవర్గాల్లో ఇప్పటికే ప్రజా సంగ్రామయాత్ర చేపట్టి విజయవంతం చేసుకున్నట్లు తెలిపారు. మంథని ప్రాంతం చాలా పవర్ ఫుల్ అని, వేద మంత్రాలకు నిలయం, కవులు, కళాకారులకు పుట్టినిల్లు మంథని ప్రాంతం అని అన్నారు. ఒకప్పుడు మొత్తం పచ్చని చెట్లతో కళకళలాడే అటవీ ప్రాంతం అని కానీ ప్రస్తుతం వీరప్పన్‌లు ఎక్కువై అడవులు కనబడకుండా పోతున్నాయని అన్నారు. ఈప్రాంతంలో ఎప్పటి నుండో ఎంతమంది బెదిరించినా అప్పటి నుండి బిజెపి కార్యకర్తలు యుద్ధం చేస్తునే ఉన్నారని అన్నారు. మంథని గడ్డమీద కాషాయపు జెండా రెపరెపలాడే సన్నివేశాన్ని చూపడం ఖాయమన్నారు. నాకు, మాకు వెన్నంటి ఉన్న మంథనికి చెందిన నాయకుడు వెంకట నారాయణ రెడ్డిదని అన్నారు. అలాంటి పవర్ ఫుల్ గడ్డపై మాట్లాడడం సంబరంగా ఉందన్నారు. గతంలో ఈప్రాంతంలో ఎంతోమంది ఎన్నో రకాల ఇబ్బందులు పెట్టిన కానీ విద్యాసాగర్ రావు సస్యశ్యామల యాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ప్రజలు కావాలని అనుకున్నారు కాబట్టే సస్యశ్యామల యాత్ర పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట ఏర్పాటు చేసి ఈప్రాంత ప్రజలకు ఏంచేశారో సమాధానం చెప్పాలన్నారు. కేసిఆర్ అల్లునికి మాత్రం పెట్రోల్ దొరుకుతుంది కానీ అగ్గిపుల్ల దొరకలేదని ఎద్దేవా చేశారు. దీనిపై సిబిఐ విచారణ చేపడితే బాగుంటేదేమోనని అన్నారు. ఏప్రాంతానికి పోయినా కానీ కాళేశ్వరం నీళ్లు ఇక్కడ ముద్దాడినంకనే పోతాయని ఆప్రాంత వాసులకు మాయమాటలు చెబుతూ మోసం చేస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కేవలం కేసిఆర్ కుటుంబమే బాగుపడిందని అన్నారు. ఈప్రాంతంలో సుమారు వేల ఎకరాల పంటలు మునిగి పోతున్నాయి కానీ నష్టపరిహారం మాత్రం రావడం లేదన్నారు. ప్రాజెక్టు వల్ల జాగలు, ఇండ్లు, భూములు అన్ని కోల్పోయారని అన్నారు. ప్రాజెక్టు కడితే అందరి బతుకులు బాగుపడుతాయని సహకరిస్తే ఇలాంటి పరిస్థితి ఎదురైందని అన్నారు. కాళేశ్వరం పేరుతో ముంచడమే కాకుండా ప్రస్తుతం సింగరేణీ గూర్చి మాట్లాడుతున్నారని అన్నారు. ఇప్పటికే తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ గనులను ప్రయివేటు పరం చేసి కోట్లకుకోట్లు దోచుకుంటున్నారని అన్నారు. ప్రస్తుతం సింగరేణీకి సంబంధించిన పైసలు కేసిఆర్ కుటుంబానికి ఒక ఏటియంలాగా మారిందన్నారు. ప్రజల సమస్యలు క్షేత్ర స్థాయిలో తెలుసుకోవడానికే పాదయాత్రలు చేపట్టినట్లు తెలిపారు. టిఆర్ఎస్ వాళ్ల ప్రజలకోసం అసలు రారని కేవలం ఎన్నికలు వస్తున్నాయంటేనే వస్తారని అన్నారు. సాధ్యం కానీ హామీలతో దొగం వేషాలతో మారు వేషాలతో హామీలు ఇస్తారన్నారు. ఇలా మోసం చేసి ఓట్లు దండుకునేందుకే టిఆర్ఎస్, కాంగ్రెస్ వాళ్ల వస్తుంటారని కానీ ప్రజలు గమనించాలని గుర్తు చేశారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వచ్చే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీనే అని అన్నారు.

ముఖ్యమంత్రి కేసిఆర్, వారి కుటుంబం రాష్ట్రాన్ని ఏవిధంగా దోచుకుంటుందో ఆలోచన చేయాలన్నారు. ఇటీవల జిల్లాకేంద్రానికి టిట్టర్ టిల్లు వచ్చాడట అని ఎద్దేవా చేశారు. మాపై కోర్టు ఆర్డర్ కూడా తెచ్చారని అందుకే తాము పేరు తీయడం లేదన్నారు. నాపేరు తీయద్దొని కోర్టు నుండి ఆర్డర్ తీసుకువచ్చిన పిరికిపంద కేసిఆర్ కొడుకు అని అన్నారు. తండ్రి పేరు చెప్పుకొనే రాజకీయాల్లో వచ్చిన ఘనత కేసిఆర్ కొడుకుదని అన్నారు. కేసిఆర్ అనే పేరును పక్కకు పెడితే ఎవరెవరూ ఎక్కడ ఉంటారో ఆలోచన చేసుకోవాలని హితవు పలికారు. బండి సంజయ్ అనే వ్యక్తి మోసపూరితంగా నాయకుడు కాలేదన్నారు. కష్టపడి ప్రజల కోసం పని చేసి నాయకులం అయ్యామని అన్నారు. కొంతమంది మతతత్వ వాదులు నన్ను, నాకుఉటంబాన్ని చంపుతా అని బెదిరించినప్పుడు కూడా కాషాయపు జెండాను వదలకుండా జై శ్రీరామ్ అని పార్టీ కోసం హిందూ ధర్మం కోసం, హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం కోసం కష్టపడి పని చేసిన వ్యక్తి బండి సంజయ్ గనుకనే బిజెపి రాష్ట్ర అధ్యక్షున్ని చేసిందన్నారు. అదే టిఆర్ఎస్‌లో ఎవరిని చేశారని ప్రశ్నించారు. దళితులను మోసం చేస్తున్న కుటుంబం కేసిఆర్ కుటుంబం కాదా అని అన్నారు.

టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా బడుగు బలహీన వర్గాలకు ఇస్తారా అని సవాల్ విసిరారు. కేసిఆర్ కుటుంబానికి తప్పా రాష్ట్రంలో ఎవరికి కేసిఆర్ అధికారం ఇవ్వడని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంతో అంతో క్షేమంగా ఉన్నారు అంటే అవి మోడీ ఇచ్చిన నిధులే అని అన్నారు. ప్రజలను అరిగోస పుచ్చుకుంటున్న పార్టీలు టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలన్నారు. సర్పంచ్‌లకు నిధులు మంజూరు చేసి ఖాతాల్లో వేస్తే కేసిఆర్ రాత్రికిరాత్రే నిధులను దారి మళ్లింపు చేశారని అన్నారు.

ఈ సమావేశంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, పెద్దపల్లి మాజీ ఎంపి గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, వెన్నంపల్లి పాపయ్య, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్‌లు ఉదయ్ ప్రతాప్, రావుల రాంనాథ్, అనిల్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వలస గుత్తికోయలు అడవులు నరికివేయకుండా కరిదిట్టమైన నిఘా

## నాలుగు రాష్ట్రాల అటవీ శాఖ అధికారుల సమీక్షా సమావేశం

**భద్రాచలం, ప్రభాతవార్త :** అక్రమ కలప రవాణా నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు, అంతర్‌రాష్ట్రాల అటవీ సరిహద్దుల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం



సమావేశంలో మాట్లాడుతున్న నాలుగు రాష్ట్రాల ఫారెస్టు అధికారులు

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం డివిజనల్ ఫారెస్టు అధికారి కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ అధికారి లక్ష్మణ్‌రంజిత్ నాయక్ అధ్యక్షతన ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల (నాలుగు రాష్ట్రాల) ఫారెస్టు అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. అటవీ ఉత్పత్తుల సేకరణలో నాణ్యత పాటించుట, అక్రమ పోడు వ్యవసాయంపై నివారణ చర్యలు చేపడుతున్నామని, వలస గుత్తికోయలు అక్రమ మార్గాన అడవులలో చొరబాడి అడవులను నరికివేస్తున్నందున, వారు అడవులలోకి ప్రవేశించకుండా ప్రత్యేక కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా మరికొందరు అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా అడవులలో గంజాయి సాగుకు సైతం తెగబడుతున్నారని, వారిని కట్టడి చేయడానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని, కొందరు స్మగ్లర్‌లు అడవి జంతువుల వేట, పులి చర్మం, ఏనుగు దంతాల కోసం అడవిలోకి తుపాకీలు తీసుకువచ్చి వాటిని హతమారుస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజనీర్, మిషన్ భగీరథ, సర్కిల్-భువనగిరి కార్యాలయం
టెండరు ప్రకటన నం.09/T2/MB సర్కిల్ భువనగిరి/2022-23 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేదీ:22.02.2023
పనిపేరు: "జనగామ వద్ద ఇంజినీర్‌ల స్టాఫ్ క్వార్టర్స్ పైన ప్రాజెక్టు మోనిటరింగ్ కాంప్లెక్స్ (PMC) నిర్మాణం". ప్రాజెక్ట్ క్రింద వరంగల్ జిల్లాలో 11మండలాలు మరియు నల్గొండ జిల్లాలో 1 మండలంకు HMWSSB(మెట్రో). సుమారు అంచనా మొత్తం (రూ.లక్షలలో): 50.00. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌లో టెండరు డాక్యుమెంట్ల లభ్యత: 28.02.2023 నుండి 13.03.2023 మ.3.00గం.ల వరకు. టెండర్లు అంగీకరించు తేదీలు: 28.02.2023 నుండి 13.03.2023 మ.3.00గం.ల వరకు. టెండరు తెరచుతేదీ: 13.03.2023 సా.4.00గం.లు. సంప్రదించు నం.SE 9100120084 సెగ్మెంట్ అంచనా ధర రూ.50.00 లక్షలలో. తదుపరి వివరాలు: https://tender.telangana.gov.in వద్ద.
DIPR.No.3608-DP/CL/Advt/1/2022-23 తేదీ: 24.02.2023 సం/-.సూపరింటెండింగ్ ఇంజనీర్, MB సర్కిల్- భువనగిరి.

వార్త

మనసు నిశ్చలంగా ఉన్నవానికి విరోధులే ఉండరు.

-లా ఎస్ట్రేంజ్

-కబీర్

# విషసంస్కృతుల వలయంలో యువజనం!


ఆటపాటల్లో వైద్యవిద్యతోపాటు సాంకేతికంగా అన్నిరంగాల్లోనూ దేశయువత ఎంతో కీర్తిప్రతిష్టలు సంపాదించి దేశాన్ని అగ్రస్థానంలో ఉంచుతున్నదని ఒకపక్క సంతోషిస్తుంటే మరొకపక్క అనైతిక కార్యక్రమాలకు దేశాన్ని అడ్డాగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం అవు తున్నది. ఇటీవల కాలంలో దేశంలో వివిధరాష్ట్రాల్లో బయటపడుతున్న మాదకద్రవ్యాల విక్రయాలు, వ్యభిచార రాకెట్‌లు దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నాయి. అందులోనూ ఈ అనైతిక కార్యక్రమాల్లో విద్యావంతులైన యువతీయువకులు పాలుపంచుకోవడం ఆందోళనకరంగా ఉంది. మాదకద్రవ్యాలు రవాణా చేస్తూ ఇంజినీరింగ్ విద్యార్థులే పట్టుబడుతున్న సంఘటనలు కలవరపరుస్తున్నాయి. వ్యభిచారం కంటే తీవ్రమైన మాదకద్రవ్యాల వ్యాపారం దేశంలో అనేక రాష్ట్రాల్లో చాపకిందనీరులా విస్తరిస్తున్నది. ఐదేళ్లక్రితం వరకు 270 జిల్లాలకే పరిమి తమైన ఈ మాదకద్రవ్యాల వ్యాపారం ఇప్పుడు 450 జిల్లాలకుపైగా చేరుకున్నట్లు అధికార లెక్కలే వెల్లడిస్తున్నాయి. ఇకపోతే గంజాయిసాగు తెలుగురాష్ట్రాల్లో అంతకంతకు పెరిగిపోతున్నది. మొత్తం దేశానికేకాక ఇతర దేశాలకు కూడా ఎగుమతులు చేస్తున్నట్టు సమాచారం. గతంలో కొకైన్, బ్రౌన్ షుగర్ వంటి మాదకద్రవ్యాల వినియోగం పరిమితంగా ఉండేది. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో సందుగొందుల్లో ఎంతో రహస్యంగా ఈ వ్యాపారం జరిగేది. మాదకద్రవ్యాలు విక్రయించేవారు కానీ, వినియోగించేవారు కానీ పోలీసులంటే హడలెత్తి పోయేవారు. పట్టుబడితే జైళ్లల్లోనే మగ్గిపోవాల్సి ఒందిగా భయపడేవారు. రానురాను పోలీసులంటే భయభక్తులు సన్నగిల్లడం, చట్టంలో ఉన్న లొసుగులతో తప్పించు కోవడం సులభమనే భావన పెరిగిపోవడంతో క్రమేణా ఒక వ్యూహం ప్రకారం వాడకందార్లను పెంచుకొని వ్యాపారాన్ని లాభసాటిగా మార్చుకుంటున్నారు. ఇక మాదకద్రవ్యాల విషయంలో కనీసం నియంత్రించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు కన్పించినా మద్యాన్ని మాత్రం పెంచిపోషిస్తున్నారు. సమాజం ఏమైనా, ప్రజల ఆరోగ్యం ఏమైనా తనకేమిటన్నట్లు ఆదాయమే లక్ష్యంగా దిగజారి పోయారు. మద్యంవ్యాపారుల మధ్యపోటీపెట్టి రుసుం పెంచుకుంటున్నారు. కొన్ని రాష్ట్రాలకు మద్యం ఆదా యమే ప్రధానవనరుగా ఎదిగిపోయింది. కొందరు మద్యం వ్యాపారులు నక్షత్రహోటళ్లు, క్లబ్‌లు, పబ్ యజమానులు వినియోగదారులను ఆకర్షించేందుకు రకరకాల పద్ధతులు అవలంబిస్తున్నారు. అందులో భాగంగా ఎక్కువ కిక్ ఇచ్చేందుకు మద్యంలో, సిగరెట్లలో మాదకద్రవ్యాలను నింపి అందిస్తున్నారు. దీనికితోడు ఫామ్‌హౌస్‌ల పేరుతో రకరకాల అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఢిల్లీ, ముంబయి తదితర నగరాల నుండేకాక రష్యా, ఉజ్బికిస్థాన్ తదితర దేశాల నుండి అందమైన యువతులను తీసుకువచ్చి నాట్యం పేరుతో అర్ధనగ్నంగా చిందులు వేయిస్తున్నారు. మాదకద్రవ్యాల మత్తులో యువతీయువకులు వారు ఏం చేస్తున్నారో వారికే తెలియకుండాపోతున్నది. గతవారంలో కూడా ఫామ్‌హౌస్ మీద దాడిచేసి పోలీసులు కొందరు యువతీయువకులను అదుపులోకి తీసుకున్నారు. కొందరు మధ్యతరగతికి చెందిన యువకులు ఈ పబ్‌లకు మత్తులకు అలవాటుపడి డబ్బులేక దొంగతనాలవైపు కూడా మొగ్గుచూపుతున్నారు. ఇంజినీరింగ్, పోస్టుగ్రాడ్యుయేట్ చదువుకున్న కొందరు విద్యార్థులు దొంగతనాల్లో పట్టుబడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ పబ్‌లకు వెళ్లడం నక్షత్ర హోటళ్లలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. అదే నాగరికత అని భావించి అందులో మునిగి తేలుతున్నారు. పండగలకు, పబ్బాలకు ప్రత్యేక కార్యక్రమాల పేరుతో క్లబ్బుల్లో, పబ్బుల్లో నృత్యాల పేరుతో చేసే వెకిలిచేష్టల విష సంస్కృతికి పరాకాష్ఠగా చెప్పొచ్చు. ఈ ఆనందకేళిలో విహరిస్తూ వాహనాలు నడుపుతూప్రాణాలు తీసిన సంఘటనలేకాదు తమ ప్రాణాలుపోగొట్టుకుంటున్న సందర్భాలు కూడాఉన్నాయి. అదే మన గొప్ప సంస్కృతిగా భావించే దురదృష్టపు రోజులు దాపురించాయి. నగరాల్లోనే కాదు పట్టణాలు దాటుకొని జిల్లా, మండల కేంద్రాలకు కూడా ఈ పాశ్చాత్య సంస్కృతి ప్రభావం క్రమేణీ విస్తరిస్తున్నది. గ్రామీణ జనజీవన స్రవంతిలో విలీనమై భాసిల్లుతున్న మన సంస్కృతి సంప్రదాయాలు క్రమేపీ బెల్ట్‌షాపుల ఆవిర్భావంతో ప్రవేశించిన పాశ్చాత్య నాగరికత వెల్లువలో కొట్టుకుపోతున్నాయి. ఒకనాడు మనం చేసుకునే ప్రతి పండగల్లోనూ, అడుగులోనూ మన సంస్కృతినాగరికత విశిష్టతా పరిమళాలు గుబాళిస్తుండేవి. మన కదలికలోనూ, మాటల్లోనూ సభ్యతాసంస్కారాలు వినయగౌరవభావాలు తొణికిసలాడుతుండేవి. వాటి స్థానంలో ఇప్పుడు డిస్కో, కేబరీ, క్లబ్ డ్యాన్సులు ప్రత్యక్షమవుతున్నాయి. ఇందులో మాదకద్రవ్యాలు చోటు చేసుకోవడంతో యువత బలైపోతున్నది. ఈ క్లబ్‌లను, పబ్‌లను పాలకులే పెంచిపోషిస్తున్నారని చెప్పొచ్చు. ఆదాయం పెరుగుతుండవచ్చునేమోకానీ జరుగుతున్న అనర్థాలు అన్నీఇన్నీకావు. సమాజంపై విపరీత ధోరణులు చూపుతున్న ఈ విషసంస్కృతికి చరమగీతం పాడేందుకు రాజకీయాలకు అతీతంగా పాలకులే నడుం బిగించాలి. క్లబ్బుల్లో అంగాంగప్రదర్శనలు, ఈ మత్తు వినియోగం తదితర అనైతిక వ్యాపారాలపై ఉక్కుపాదం మోపాలి. మాదకద్రవ్యాల వ్యాపారంలో భాగస్వాములైన వారిలో పాత్రధారులనేకాకుండా వెనుక ఉన్న సూత్రధారులను కూడా బయటపెట్టాలి. ఎంతటి పెద్దవారు ఇందులో భాగస్వాములైనా తిరుగులేని సాక్ష్యాలతో కోర్టు ముందు నిలబెట్టి శిక్షలు వేయిస్తేనే ఈ విషసంస్కృతులకు కొంతమేరకైనా అడ్డుకట్టవేయగలుగుతాం.

ఎలా పొందాలో తెలుసుకుంటే అనంతమైన శక్తి మనిషి అందుబాటులో ఉంది.



ఆడమ్స్ బెక్

పాలు విరిగితే ఎంత చిలికినా వెన్నరాదు. అలానే మనసు విరిగిన మిత్రులతో ప్రేమ జనించదు.



రహీమ్ ఖాన్

# ప్రజావాక్కు

## పెరుగుతున్న అసమానతలు

వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2023లో విడుదల చేసిన సర్వైవల్ ఆఫ్ ఆది రిచెస్ట్ ది ఇండియా సప్లిమెంట్ అనబడే నివేదికలో మనదేశంలో నానాటికీ పెరుగుతున్న ఆర్థిక అసమానతలపై పలు ఆసక్తికర, ఆశ్చర్యకర విషయాలువెల్లడయ్యాయి. అత్యంత సంపన్నులు, కడుపేదలమధ్య పెరుగుతున్న అగాధాలతో ప్రపంచ జనాభాలో అధికశాతం ఆకలి చావుల అంచున నిలబడ్డారని తేల్చింది. 2021ఆర్థికసంవత్సరం అంతానికి భారతదేశంలోని ఒక శాతం సంపన్నుల వద్ద 40.5 శాతం సంపద మూలుగుతుండగా, 50 శాతం పేదల వద్ద మూడు శాతం సంపద మాత్రమే ఉందని తెలుస్తున్నది. దేశంలోని 10 శాతం అత్యధిక ధనవంతుల నుంచి జిఎస్టీ పన్ను కేవలం మూడు శాతం వసూలవుతుండగా, 50శాతం దిగువ వర్గాల బడుగుల నుంచి 64శాతం వసూలుఅవుతున్నట్లు సదరు నివేదిక వెల్లడించింది. దేశంలోఉన్న బిలియనీర్ల నుంచి 20 శాతం పన్నులు వసూలు చేయగలిగితే ఆ డబ్బుతో 50లక్షల పాఠశాల ఉపాధ్యాయులకు ఒక యేడాది వేతనాలు ఇవ్వవచ్చని అంచనా వేశారు.

**-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం**

## సమగ్ర భూసర్వే ఎప్పుడు?

**హైదరాబాద్** సంస్థానంలో నిజాం కాలంలో జరిగిన భూ సర్వే 80 సంవత్సరాలు దాటినప్పటికీ ఇంతవరకు నవీకరణకు నోచుకోకపోవడంతో అనేక భూ సమస్యలు తలెత్తుతున్నాయి. భూమి రికార్డులకు, క్షేత్రస్థాయిలో ఉన్న భూ పరిస్థితికి తేడాలు ఉండడంతో పంచాయతీలు, అన్నదమ్ముల మధ్య, కుటుంబ సభ్యుల మధ్యవివాదాలు తలెత్తి మొత్తంగా సామాజిక అశాంతి ప్రబలుతుంది. పోలీసుస్టేషన్‌లు, కలెక్టర్ గ్రీవెన్స్‌కు వచ్చే ఎన్నో ఆర్జీలుభూమిసమస్యలకు సంబంధించినవేకావడం గమనార్హం. ఇదే అదనుగా అనేక రౌడి మూకలు సంఘ విద్రోహకశక్తులు చట్టాన్ని తమచేతుల్లోకి తీసుకొని చట్టవ్యతిరేక సెటిల్‌మెంట్‌లకు, భూదందాలకు పాల్పడుతున్నారు. ముఖ్యమంత్రి సమగ్ర సర్వే జరుపుతామని శాసనసభలో, బయటఎన్నోసార్లు ప్రకటించారు. కానీ ఇంతవరకు భూ సర్వే జరగనే లేదు.

**-శాగ శ్రీనివాస్, చిన్న పెండ్యాల, జనగాం జిల్లా**

## పశువులతో ప్రమాదం

**కుక్కల** దాడిలో పనిబాలుడు ప్రాణం కోల్పోవడంతో రాష్ట్ర హైకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అదే తరహాలో రాష్ట్రంలో పందులు గ్రామాలలో అపరిశుభ్రతను సృష్టిస్తున్నాయి. కోతులు కూడా రైతుల పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. ఇలాంటి సమస్యలను స్థానికంగా అధికారులు వెంటనే పరిష్కరించాలి.

**-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా**

## ఎడతెగని యుద్ధానికి యేడాది పూర్తి

ఉక్రెయిన్‌పై రష్యా సైనికచర్యగా మొదలైన తగాదా పూర్తిస్థాయి యుద్ధంగా రూపు సంతరించుకొని నేటికి అంటే మార్చి 24కి యేడాది పూర్తి చేసుకుంది. కనుచూపు మేరలో ఆగే సూచనలు కాదు కదా తగ్గే సూచనలు కూడా లేవు. ప్రపంచ ఆర్థిక స్థితికి అపారనష్టం కొనసాగుతోంది. ఉక్రెయిన్‌వెనుక అమెరికా, నాటో దేశాలు బహిరంగంగానే నిలుచున్నాయి. ఉక్రెయిన్ యుద్ధభూమిలోకి సాక్షాత్తూ అమెరికా అధ్యక్షుడే ప్రత్యక్షమై రష్యాకు వ్యతిరేకంగా తన పూర్తి మద్దతు తెలియచేశాడు. రష్యా ఒంటరిగా కనబడుతున్నా దాని వెనుకచైనా, ఇరాన్, ఉత్తర కొరియా తాము న్నామంటూ స్పష్టంగానే తెలియచేస్తున్నాయి. అటుతిరిగీ, ఇటు తిరిగిదెబ్బ మాత్రంప్రపంచ దేశాలన్నింటికీ గట్టిగానేతగులుతోంది. ముఖ్యంగా ఆహార పదార్థాలు, ఇంధనం రూపంలో కొరతననుభవిస్తున్నాయి. రష్యా చుట్టుపక్కలదేశాల్లో వ్యాపిస్తూ నాటో కూటమి ఆ దేశాన్ని అభద్రాభావంలోకి నెట్టింది.

**-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం**

## బయో ఏషియా చక్కని వేదిక

**ఫార్మా,** లైఫ్‌సైన్స్ రంగాలలో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రపంచదేశాలకు చాటేందుకు, ఔషధ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు బయో ఏషియా సదస్సు చక్కటి వేదిక కానుంది. హైదరాబాద్ వేదికగా మూడు రోజులపాటు సాగనున్న ఈ సదస్సులో 50దేశాలనుంచి మూడువేల మందికిపైగా ప్రతినిధులు పాల్గొననున్నారు. కరోనా తర్వాతప్రపంచ దేశాలన్నీ ఫార్మా లైఫ్ సైన్సెస్ రంగాల్లో భారత ప్రాముఖ్యతను గుర్తించాయి. ప్రపంచ టీకా రంగానికి హైదరాబాద్ ఉత్పత్తి కేంద్రంగా మారిపోయింది. ఇక్కడ పెట్టుబడులను పెట్టేందుకు ఔషధ సంస్థలు ఆసక్తి కనపరుస్తున్నాయి. ఈ సదస్సుతో ఔషధ రంగం కొత్త ఊపుతో మరింత బలోపేతం కానుంది. ఔషధ రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉన్నందున ఎందరో విద్యార్థులు ఫార్మా విద్య అభ్యసించేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు.

**-చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా**

## బోర్లకు మీటర్ల బిగింపు

**ఇప్పటికే** కేంద్రప్రభుత్వం పెట్టినషరతులతోరాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ బోర్లకుమీటర్లు బిగించే ప్రయత్నం పట్ల రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నా ఈ ప్రక్రియలో ముందుకువెళ్తూనేఉంది. ఈప్రాజెక్టు విజయవంతం అయితే, వచ్చే రెండేళ్లలో రాష్ట్రమంతటా ఈ మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తవుతుందని, ఇంటి యజమానులకు చెప్పకుండా, వారి అనుమతి లేకుండా ఏకపక్షంగా నీటి మీటర్ల బిగింపు ప్రక్రియ పట్ల తీవ్ర స్థాయిలో వ్యతిరేకత ఎదురవుతుది.

**-కె.నారాయణ, విజయవాడ**

# అదుపు తప్పిన ర్యాగింగ్.. అడ్రసు లేని చట్టం

*తెలుగు రాష్ట్రాల్లో చట్టమైతే చేశారుకానీ దాన్ని త్రికరణశుద్ధిగా అమలుచేసే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లోపిస్తున్నది. సంఘటనలు వెలుగు చూస్తున్నప్పుడు వారం, పదిరోజుల పాటు హడావుడి చేయడం, హెచ్చరికలు చేయడం, ఆ తర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారిపోయింది. అన్నింటికంటే ముఖ్యంగా ర్యాగింగ్ చేసేటప్పుడు సాధారణ ప్రత్యక్ష సాక్షులుఉండే అవకాశంలేదు. ఒకవేళ ఉన్నా వారు కోర్టుకు వచ్చి సాక్ష్యాలు చెప్పడానికి ఇష్టపడరు. అందుకే కోర్టులో రుజువుకాదనే ధైర్యంతో కొందరు ఇలా వ్యవహరిస్తున్నారు. నిర్దిష్టమైన, పటిష్టమైన చర్యలు తీసుకోగలిగితే ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతాం. ఆ రకమైన దృఢసంకల్పం లోపించినప్పుడు ఈ చట్టాలు, చర్చలు అన్ని నిష్ప్రయోజనమే. పాలకుల ఉదాసీనతకు, చేతకానితనానికి ఇలా అమాయక విద్యార్థులు బలైపోతూ ఉంటారు.*

**దామెర్ల సాయిబాబ**

ర్యాగింగ్‌ని నిరోధించడానికి చట్టాలు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని పాలక పెద్దలు చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమైపోతున్నాయి. ఈ విషసంస్కృతి విశ్వవిద్యాలయాలు, ప్రొఫెషనల్ కాలేజీలు దాటి ఇంటర్మీడియేట్ స్థాయిలోకి కూడా చేరుకుంటున్నది. కొత్తగా అడుగుపెట్టిన వారికి బెరకు, భయం, జంకు పోగొట్టేందుకు చేపట్టిన పరిచయవినోద కార్యక్రమం కేవలం కొందరి విద్యార్థుల కారణంగా ప్రాణాంతక వికృతకేళిగా మారిపోయింది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సెకండరీ విద్యను పూర్తి చేసుకొని ఉజ్వల భవిష్యత్తును ఊహించుకుంటూ కాలేజీ అడుగుపెట్టే విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో ఎదురయ్యే అవమానాలు భరించలేక కొందరు తమలో తాము కుమిలిపోతుండగా, మరికొందరు అర్థాంతరంగా ప్రాణత్యాగాలు చేస్తున్నారు. అశ్లీల సాహిత్యం, నీలిచిత్రాలు, మత్తుపదార్థాలు, ఇతర బలహీనతలు ఈసంస్కృతిని మరింత రెచ్చగొడుతున్నాయి. పాశ్చాత్య సంస్కృతి విషవలయంలో చిక్కుకొని ఆలోచనారహితంగా వీరు చేస్తున్న ర్యాగింగ్ అనండి, లేక వేధింపులు అనండి సున్నిత మనస్కులు తట్టుకోలేకపోతున్నారు. తాజాగా వరంగల్‌లో కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్, వేధింపులతో పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థి ప్రీతి ఆత్మహత్యకు ప్రయత్నించడం చర్చకు తెరలేపింది. తన సీనియర్ వేధింపులకు గురి చేస్తున్నాడని బుధవారం ఉదయం ఒక ఇంజెక్షన్ తీసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సీనియర్ విద్యార్థి వేధింపులే కారణమని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై నలుగురు సభ్యులతో కమిటీని వేసినట్లు తెలంగాణ రాష్ట్ర వైద్యవిద్యా సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి వెల్లడించారు. ఆ నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని, అయితే ర్యాగింగ్ జరగలేదని ఆయన అంటున్నారు. ఆరోపణలకు గురైన సీనియర్ విద్యార్థిని శుక్రవారం అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీసు కమిషనర్ రంగనాథ్ చెప్పారు. అవమానకరంగా మాట్లాడడం కూడా ర్యాగింగ్ కిందకు వస్తుందని వాట్సాప్‌లో చాటింగ్‌లు అన్నీ చూసిన తర్వాత నిర్ధారణకు వచ్చామని సిపి వెల్లడించారు. ర్యాగింగా, వేధింపులా ఏదైనా అంత ఉన్నత విద్యను అభ్యసిస్తున్న యువతి ప్రాణాలు తీసుకునే స్థాయికి చేరిందంటే పరిస్థితులను అర్థం చేసుకోవాలి. సాధారణంగా పీజీ స్థాయిలో ర్యాగింగ్ చేసే సంప్రదాయం లేదనే వాదన వాస్తవమే కావచ్చు. పీజీలో ర్యాగింగ్ లేక పోయినా వేధింపులకు మాత్రం కొరత ఉండదు. గతంలో కూడా ప్రధానంగా వైద్యవిద్యలో ఉన్నత స్థాయిలో వేధింపుల విషయంలో ఎన్నోసార్లు ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుత సంఘటనలో బాధితురాలు తన సీనియర్ వేధిస్తున్నాడని తన తండ్రికి ఎప్పటికప్పుడు చెప్పుకొంటూనే ఉంది. ఒక దశలో తట్టుకోలేక ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసింది. ఇద్దరిని పిలిపించి కౌన్సిలింగ్ చేసి, వేరు వేరు చోట డ్యూటీ వేసి ప్రిన్సిపాల్ పంపారట. ఆమెకు టెన్షన్ మరింతగా పెరిగిపోయిందని సమాచారం. ఆమె భవిష్యత్తుపై భయాందోళనకు గురైనట్టు చెప్తున్నారు. ప్రస్తుతం ఆమె నిమ్స్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నది. గతంలో వరంగల్‌లో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు ర్యాగింగ్‌కు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. హైదరాబాద్ గాంధీ వైద్యశాలలో మరొక విద్యార్థి ఆత్మహత్య కూడా ఈ కోవకు చెందిందే. ర్యాగింగ్‌కు, వేధింపులకు వెరసికొందరు ఏకంగా విద్యాభ్యాసానికే స్వస్తి చెబుతున్నారు. అప్పట్లోనే దేశవ్యాప్తంగా ఈ ర్యాగింగ్ శృతిమించడంతో ఉన్నతస్థాయిలో చర్చలు జరిగాయి. దీనిని ఆపకపోతే ఉజ్వలభవిష్యత్ ఉన్న మరిన్ని ప్రాణాలుబలయ్యే ప్రమాదం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. ఈ దశలో కేంద్రం మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కల్పించుకొని ర్యాగింగ్ నిరోధానికి చర్యలు చేపట్టాల్సిందిగా వివిధ రాష్ట్రప్రభుత్వాలను, దేశంలోని విశ్వవిద్యాలయాలకు, ప్రొఫెషనల్ విద్యాసంస్థలకు లేఖలురాసింది. అప్పట్లోనే ఆరురాష్ట్రాలు ఈ విష సంస్కృతికి అడ్డుకట్ట వేసేందుకుచట్టాన్ని తీసుకువచ్చాయి. 1997లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్రమైన చట్టమే తీసుకువచ్చింది. శిక్షలు కూడా కఠినంగానే ఉన్నాయి. అయినా ఇది ఆగడంలేదు. ర్యాగింగ్ పేరుతో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో తమతోటి విద్యార్థినిపై తొమ్మిది మంది సీనియర్లు పైశాచికంగా ప్రవర్తించిన తీరు ఇప్పటికీ విద్యార్థిలోకం మరిచి

**ఒక్క మాట**

పోలేకపోతున్నది. ఉత్తర భారతదేశంలో కూడా ఈ రాక్షసక్రీడ అనేక ప్రొఫెషనల్ కాలేజీల్లో కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు కళాశాలల ఆవరణలుదాటి బస్సుల్లో, రైళ్లల్లో, హోటళ్లలో తదితర పబ్లిక్ ప్రదేశాల్లో కూడా ప్రవేశిస్తున్నట్లు వార్తలు అందుతున్నాయి. ఈ వికృత చేష్టల పట్ల ప్రజల్లో అసహ్యం ఏర్పడుతున్నా అవేమీ పట్టించుకోవడం లేదు. ఇది ఎంతవరకు వెళ్లిందంటే తమ కాలేజీకి చెందిన జూనియర్ కాకపోయినా, ఏ కాలేజీలో చదువుతున్నా తమకు ర్యాగింగ్ చేసే హక్కు ఉన్నట్లుగా కొందరు యువకులు వ్యవహరిస్తున్నారు. గతంలో ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి కాలేజీకి వెళ్లివస్తుండగా ఇబ్రహీం బాగ్ వద్ద మరొక కాలే జీకి చెందిన విద్యార్థులు ఆపి ర్యాగింగ్ చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుల్లో నలుగురిని పోలీసులు అరెస్టు చేసికేసులు పెట్టారు. ర్యాగింగ్ రోడ్ల మీదకు వచ్చిందన డానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. ఇక ఈ జాడ్యం కొన్ని ప్రాం తాల్లో ఇంటర్మీడియేట్ విద్యార్థుల్లో కూడా ప్రవేశించింది. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో ఇంటర్మీడియేట్ విద్యార్థిని ఈ ర్యాగింగ్ వేధింపులను భరించలేక, బయటకు చెప్పుకోలేక పురుగు మందులు తాగి ఆత్మహత్యాయత్నం చేస్తే ఆగమేఘాలపై ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఇలా ఎన్ని ఆదేశాలు ఇచ్చినా, ఎంతటి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్తున్నా ఇది ఆగడం లేదు. ప్రాణసమానంగా పెంచుకున్న తమ బిడ్డలు తమ కళ్లముందే చదువు, సంస్కారం ఉందనుకున్న కొందరి వింతపశువుల వికృత చేష్టలకు బలైపోతే ఆ గర్భశోకం వర్ణనాతీతం. రకరకాల మనస్తత్వంగల మనుషులుంటారు. కొందరు ఒంటరిగా ఉండడా నికి ఇష్టపడతారు. మరికొందరు నలుగురితో కలివిడిగా పోవాలను కుంటారు. అంతేకాదు ఎలాంటి అవమాన పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొంటారు. కానీ సున్నిత హృదయులు ఏ చిన్న అవమా నాన్ని తట్టుకోలేరు. తల్లడిల్లిపోతారు. ఇవన్నీ ఆయా మనస్తత్వాల తోపాటు పెరిగిన వాతావరణాన్ని బట్టి కూడా ఉంటుంది. కొందరు సీనియర్ల వికృత చేష్టలకు విభిన్న రకాల్లో స్పందన ఉంటుంది. అందుకే ఒకరిని ర్యాగింగ్ చేశాం కదా అని అదేపద్ధతిలో మరో కరిపై కూడా ర్యాగింగ్ ప్రయోగం చేయడంతో స్వాభిమానంతో ఆత్మహత్యలులాంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ విషయం సీనియర్లు గ్రహించలేకపోతున్నారు. ఏదిఏమైనా యుక్తవయసులో ఉన్నసున్నిత మనస్తత్వంగల కొందరు యువతీ యువకులు ఈ రాక్షసక్రీడను భరించలేకపోతున్నారనేది వాస్తవం. గతంలో తమిళ నాడులోని రాజాముత్తయ్య మెడికల్ కాలేజీలో జరిగిన సంఘట నపై ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు కొంత ఫలితాలను ఇచ్చాయనే చెప్పొచ్చు. మద్రాస్ యూనివర్సిటీ మాజీ వైస్‌ఛాన్స లర్ కుమారుడినే ర్యాగింగ్ చేస్తూ సీనియర్ విద్యార్థి ఏకంగా హత్యచేశాడు. ఈ కేసు పరిశీలిస్తే చిన్నవిషయమైనా పట్టుదలకు పోతే ఎలాంటి విపత్కర పరిణామాలకు దారి తీస్తుందో అవగత మవుతుంది. 1996 నవంబరు ఆరో తేదీన జాన్ డేవిడ్ అనే విద్యార్థి తన జూనియర్ అయిన వైస్‌ఛాన్సలర్ కుమారుడిని తన రూమ్‌కు తీసుకువెళ్లి ర్యాగింగ్‌లో భాగంగా తన రికార్డుబుక్ రాయమని ఆదేశించాడు. తాను వైస్‌ఛాన్సలర్ కుమారుడిని అయినందున తనను ఏమీచేయలేడనే ధైర్యంతో రికార్డు బుక్ రాసేందుకు నిరాకరించాడు. దీంతో తానుసీనియర్‌గా చెప్తున్నా ఆదేశాలను పాటించలేదనే పట్టుదల, అహం డేవిడ్‌లోపెరిగిఆగ్రహం అవధులు దాటి హత్యకు దారితీసింది. తిరుగులేని సాక్ష్యాలతో అక్కడిపోలీసు యంత్రాగం నిందితుడిని న్యాయస్థానం ముందు నిలబెట్టింది. గొప్ప వైద్యుడై పేరుప్రతిష్టలు సంపాదించి పెడతాడని ఆశలుపెంచుకున్న తల్లిదండ్రులను దృష్టిలోఉంచుకొని మరణశిక్షను వేయడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానిస్తూ 28 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష విధించారు. ఇది ఆనాడు తమిళనాడులో సంచలనం కలిగించడంతోపాటు విద్యార్థిలోకంలో భయాన్ని సృష్టించింది. ర్యాగింగులు తగ్గుముఖం పట్టాయి. తెలుగు రాష్ట్రాల్లో చట్టమైతే చేశారుకానీ దాన్ని త్రికరణశుద్ధిగా అమలుచేసే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లోపిస్తున్నది. సంఘటనలు వెలుగు చూస్తున్నప్పుడు వారం, పదిరోజుల పాటు హడావుడి చేయడం, హెచ్చరికలు చేయడం, ఆ తర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారిపోయింది. అన్నింటికంటే ముఖ్యంగా ర్యాగింగ్ చేసేటప్పుడు సాధారణప్రత్యక్ష సాక్షులుండే అవకాశం లేదు. ఒకవేళ ఉన్నా వారు కోర్టుకు వచ్చి సాక్ష్యాలు చెప్పడానికి ఇష్టపడరు. అందుకే కోర్టులో రుజువు కాదనే ధైర్యంతో కొందరు ఇలా వ్యవహరిస్తున్నారు. నిర్దిష్టమైన, పటిష్టమైన చర్యలు తీసుకో గలిగితే ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతాం. ఆ రకమైన దృఢసంకల్పం లోపించినప్పుడు ఈ చట్టాలు, చర్చలు అన్ని నిష్ప్రయోజనమే. పాలకుల ఉదాసీనతకు, చేతకానితనానికి ఇలా అమాయక విద్యార్థులు బలైపోతూ ఉంటారు. ●

# పోలీసు, ఉద్యోగ వ్యవస్థలు మారితేనే అసలైన ప్రజాస్వామ్యం

**తిరుమలశెట్టి సాంబశివరావు**

మనకు స్వాతంత్య్రం లభించి 75 సంవత్సరాలు గడిచినా ప్రజాస్వామ్యంలో అవసరమైన స్వతంత్ర భావాలు మన సమాజంలో ఇంకా ఏర్పడలేదు. ప్రజలేమో నాయకుడు తమ వాడైతే ఎన్ని తప్పుడు పనులు చేసినా గుడ్డిగా సమర్థించడం, ప్రజలు పూర్తి మెజార్టీ ఇచ్చారు గనుక ఏ పని చేయడానికి అయినా లైసెన్స్ ఇచ్చినట్లు అధికార పక్షం విర్రవీగటం, అధికారులేమో పాలక పార్టీకి వత్తాసు పలకడం, వారికి తెలియని సమాచారం కూడా అందించడం ఎక్కువైంది. ముఖ్యంగా సమాజంలో శాంతిభద్రతలు కాపాడవలసిన పోలీసుశాఖ నిర్వీర్యమైపోతుంది. తాజాగా గన్నవరంలో పోలీసులపై విధ్వంసకారుల దాడి. పిల్లి గుడ్డిదైతే ఎలుక ఎకసెక్కాలు ఆడిందన్న సామెతలా అక్కడ పోలీసులే నేరస్తులను బతిమాలటం, వారి చేతిలో రాళ్లదెబ్బలు తినే దుస్థితి ఎందుకు వచ్చింది? గన్నవరంలో ఆ రోజు ఉదయం నుండే పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్న స్థితిలో టిడిపి ఆఫీసుపై దాడి సమాచారంతో, తగిన సిబ్బందితో వెళ్లి విధ్వంసాలు, దాడికి పాల్పడుతున్నవారు ఏ పార్టీ అయినా టియర్‌గ్యాస్, లాఠీచార్జీ వంటి కఠిన చర్యలు తీసుకొని వుంటే ఇలా బరితెగించే సాహసం చేయరు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరస్తులని ఫ్రెండ్స్‌లా బుజ్జగించడం కాదు, బాధితులకి, నిర్దోషులకి ఫ్రెండ్స్‌గా నిలవడం. వీడియో సాక్షిగా కనిపిస్తున్నా దోషులను అరెస్ట్ చేయకుండా బాధితులపైనే కేసులు పెట్టడం మరో జోకు. అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లు పైవారి ఒత్తిడితో ప్రతిపక్ష నేతలు, అమాయకుల మీద



లాఠీలు ఝుళిపించడం కాదు. అసలు నేరస్తులపై చూపాలి. ఐఎఎస్, ఐపిఎస్ వంటి ఉన్నత విద్యలతో ప్రజలకి మార్గదర్శకంగా ఉండవలసిన వారు కులపిచ్చితోనో, ప్రమోషన్లకోసమో, మరో కారణంతోనో పదవిపోతే ఎందుకూ చెల్లని, ఏ అర్హతలేని పాలక పెద్దల అక్రమ చర్యలని సమర్థిస్తున్నందువల్లే. సైనికుల వలె, పోలీసులూ నిత్యం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నా ప్రజల్లో తగిన గుర్తింపు లేదు. ఈ రాజకీయ నేతల వైభోగం ఐదు సంవత్సరాలే. అక్రమాలకి పాల్పడే వారి జాతకాలు ప్రభుత్వ యంత్రాంగం చేతిలోనే ఉంటాయి. పైగా పాలక పెద్దలు ఏదైనా అక్రమ చర్యలకు పాల్పడితే కట్టడి చేయడానికి న్యాయస్థానాలు ఉన్నాయి. మహా అయితే బదలీ చేస్తారు. పాముకి పాలు పోసినట్లు, రౌడీలు, నేరస్తులకు ఇలా ఊతమిస్తే భస్మాసుర హస్తంలా భవిష్యత్తులో సమాజానికి, వారికి వారి కుటుంబాల భద్రతకూ ముప్పేనని గ్రహించాలి. కనుక ఉద్యోగ సంఘాలు జీతభత్యాలే గాక, ఇటువంటి సమస్యలపై చర్చించుకొని ప్రభుత్వ పెద్దల అక్రమాలకు తమ పరిధిలో తోడ్పడకుంటే చాలు. అమెరికా, బ్రిటన్, యూరప్ వంటి ప్రజాస్వామ్య దేశాల్లో ప్రభుత్వ యంత్రాంగం స్వతంత్రంగా, ఎంతో బాధ్యతగా చట్టప్రకారం నడుచుకుంటుంది. అమెరికా అధ్యక్షుడికి ప్రపంచ పోలీసు అని పిలిచేటంత సర్వాధికారాలున్నాయి. అటువంటి అధ్యక్షుని కూతురికి కూడా ఒకసారి రోడ్డు రూల్స్ పాటించ లేదని పోలీసులు జరిమానా విధించారట. అక్కడచట్టం ముందు అందరూ సమానమే. (రూల్ ఈజ్ ఫర్ ఆల్. ఇక్కడేమో రూల్స్ ఆర్ ఫర్ ఫూల్స్ అంటారు) కనుక ఇకనైనా ఉద్యోగ, పోలీసు వ్యవస్థలు చట్టప్రకారంగా, సక్రమంగా వ్యవహరిస్తేనే మనది నిజమైన ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతుంది. ●

# చిన్నారుల బతుకులు కుక్కలు చింపిన విస్తరేనా?



**పూసాల సత్యనారాయణ**

ఇందు గలడు అందు లేదని సందేహం వలదు ఎందెందు వెతికినా అందందే గలడు' సుమీ' జర భద్రం బిడ్డో! అన్న చందంగా ఉంది భాగ్యనరంలో రోడ్లపై విచ్చలవిడిగా విహరించే వీధి కుక్కలు మూకుమ్మడిగా విజృంభించి చిన్నారులపై పడి విచక్షణారహితంగా పిక్కలు తీస్తుంటే వారు చేసే ఆర్తనాదాలు అరణ్యరోదనలే అయ్యాయి. హృదయ విదారక దృశ్యాలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడం అందరికీ ఆందోళన కలిగించింది. విశాఖ పట్నంలో ఒకఇంటి ముందు ఉన్న ఒకటిన్నర సంవత్సరం శిశువును వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి ముఖం నుండి కాలి గోటి వరకు దాదాపు రెండు వందల యాభై గాట్లతో బీభత్సం సృష్టించాయి. శరీరాన్ని ముక్కలు ముక్కలుగా కొరడంతో చిన్నారి పొట్ట నుంచి పేగులు కూడా బయట పడ్డాయి. ఇలా పసి ప్రాణాలను బలి తీసుకుంటున్న వీధి కుక్కల నివారణ చర్యలు తీసుకున్న దాఖలాలు ఉంటే ఒట్టు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విషాదకరమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఎవరు ఏమిచ్చినా ఓదార్పు మాటలు చెప్పినా ప్రాణాలు తిరిగి రావు కదా! తల్లిదండ్రుల గర్భశోకాన్ని కూడా తీర్చలేవు. వైద్యశాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో గత యేడాది జనవరి నుండి నవంబరు వరకు 1,68,367 మంది కుక్కకాటుకు గురయ్యారని తెలుస్తుంది. కేవలం హైదరాబాద్ నగరంలో 6.5 లక్షల కుక్కలు ఉన్నాయి. అవి రోజుకు సుమారు 400 మందిని కాటు వేస్తున్నాట్లు తెలుస్తుంది. అలాంటి బాధితులు యాంటీ రేబిస్ సూదిమందు కోసం వస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో గమనించాలి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపిఎం) గణాంకాల ద్వారా తెలుస్తుంది. మొత్తం మీద అత్యధిక కుక్కకాటు కేసులు హైదరాబాద్‌లోనే 17,361 నమోదు కాగా, వాటిలో పెంపుడు కుక్కల కాటు కారణంగా 29 శాతం మంది గాయపడుతున్నారు. ఇంతలా జరుగుతుంటే మునిసిపాలిటీ సంబంధిత సిబ్బంది, అధికారులు తమాషా చూస్తున్నారా? గ్రామ పంచాయతీ పరిధిలో కుక్కల నుండి రక్షణ కల్పించిన చర్యలు మచ్చుకైనా కానరావు. 71 శాతం మంది వీధికుక్కల కాటుతో బాధపడుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఎందుకు ఉంటున్నారు? పరిపాలన యంత్రాంగం అవినీతి మత్తులో తేలి



యాడుతూ ఉందా! ఎందుకు చలనం లేదు? పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడా? ఎంకి పెళ్లి సుబ్బిచావు కొచ్చినట్లు కుక్కలను పట్టుకున్నవాళ్లు జంతుప్రియులు ఇచ్చిన డబ్బులకు ఆశపడి పక్కగల్లీలో ఒదిలిపెడుతున్నట్లు వార్తలు మార్మోగుతున్నాయి. ఇది సిబ్బంది చేసేనిర్వాకం. జంతువులను ప్రేమించే వారు తోటి మానవుడు ఆపదలో ఉన్నప్పుడు ఆదుకుంటే మానవత్వం పరిమళించదా! అదే ప్రేమ అనాథలపై చూపితే మానవీయ విలువలు చిగురులు తొడుగునా! నడిరోడ్డుపై మనుష లను వెంటాడి నరుకుతుంటే రక్తం వరదలై పారుతుంటే రక్షించే బదులు వీడియో తీస్తారా! ఇది మనుషులు చేసే పనేనా! ఇంకెప్పుడు మారేది మనిషి? వీధి కుక్కల సంఖ్య గణనీయంగా తగ్గిస్తే భారీ ఎత్తున మందులు సమకూర్చే అవసరం ఏముంది? కుక్క కాటుతో వచ్చే రేబిస్ వ్యాధితో సంభవిస్తున్న మరణాలు అధికశాతంగా భారత దేశంలోనే ఉన్నాయని పాలకులకు తెలియదా! ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎన్నోసార్లు హెచ్చరించినప్పటికీ వ్యాధి నిరోధక టీకాలను అందుబాటులోకి తెచ్చారా? అదీ లేదు. తెలంగాణలోనే 25 లక్షల వరకు వీధి కుక్కలు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే ఐదు లక్షల 75వేల వరకు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు చెప్పడమే సరిపోయింది. వీటిని నియంత్రించేందుకు స్టెరిలైజేషన్ కార్యక్రమం చేస్తున్నట్లు రికార్డులు చెప్తున్నా అదివాస్తవానికి ఎంతోదూరం. కుక్కల పునరుత్పత్తి ప్రక్రియకు కళ్లెం వేయడానికి స్టెరిలైజేషన్ కార్యక్రమానికి ఈ ఐదేళ్లలో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టినప్పటికినీ బూడిదలో పోసిన పన్నీరే ఎందుకు అయింది! మందుల కొనుగోలులో అవినీతి చోటు చేసుకొని బాధితులకు అందుబాటులోకి రావడం లేదు. ప్రసార మాధ్యమాలలో కుక్కల బెడద సంచలనం సృష్టించినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి హంగామా చేస్తారు. ఆ తర్వాత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంటుంది. ఇదీ మన సర్కారీ తీరు. మున్సిపాలిటీలు పంచాయతీలు త్రికరణశుద్ధిగా పనిచేస్తే వీధి కుక్కల బెడద ఉండేనా! అవినీతి, లంచగొండితనం, స్వార్థం, దురాశ ప్రభుత్వ ఉద్యోగులలో కరడుగట్టి ఉన్నది అది సోషల్ మీడియా ద్వారా ప్రజలందరూ వీక్షించుతూనే ఉన్నారు. అంకితభావం నిజాయితీ పాలకుల మాటల్లో తప్ప ప్రభుత్వ చేతల్లో మాత్రం అగుపడదు. ఎన్ని చట్టాలు ఉన్నా అమలు చేయకుంటే అన్నీ సున్నా. ఒక దిక్కు ప్రభుత్వసంక్షేమ పథకాలు పత్తాలేకుండాపోతుంటే సందట్లో సడేమియాలా ఈవీధి కుక్కల బౌభౌలు ఒకటి. మనుషుల పుట్టుక కన్న మా సంఖ్యనే ఎక్కువని రోడ్లపై సైనికుల్లా పరేడ్ చేస్తూ రుజువు చేస్తున్నాయి. కరోనాను తరిమి కొట్టిన ప్రభుత్వం కుక్కల బెడద నుండి ప్రజలను రక్షించలేదా? పాలకులు ఈ సమస్యపై దృష్టి పెట్టి ఛాలెంజ్‌గా తీసుకొని కుక్కలు చేసే ఆగడాల నుండి ప్రజలకు రక్షణ కల్పిస్తారని ఆశిద్దాం. ●

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# పాక్ అఫ్ఘాన్ తోర్ఖామ్ సరిహద్దుమూసివేత

## వందలాదిగా నిలిచిపోయిన రవాణా ట్రక్కులు



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 24:** పాకిస్థాన్ అఫ్ఘనిస్తాన్ దేశాలమధ్య పరిహద్దుగా ఉన్న తోర్ఖామ్ చెక్‌పోస్టును గడచిన ఐదు రోజులుగా మూసివేయడంతో ఎగుమతిదారులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. సరిహద్దు వివాదాల ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ గడచిన ఐదురోజులుగా ఈ చెక్‌పోస్టును మూసివేసింది. దీనితో సుమారు ఏడువేలకుపైగా ట్రక్కులు అఫ్ఘన్‌సరిహద్దు మీదుగా వెళ్లలేక నిలిచిపోయాయి. ఫలితంగా కోడిగుడ్లు, ఇతర పౌల్ట్రీ ఉత్పత్తులతోపాటు పండ్ల రసాలు, కూరగాయలు, పండ్లు వంటివి మొత్తం ట్రక్కుల్లోనే నిలిచిపోవడంతో ఇవన్నీ కూడా చెడిపోయే ప్రమాదం ఉందని ఎగుమతిదారుల సమాఖ్య ఆరోపిస్తోంది. పాకిస్థాన్‌ప్రభుత్వం సరిహద్దు క్రాస్‌పాయింట్‌ను మూసివేయడంవల్లనే ఉత్పత్తుల రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడిందని వాణిజ్య వర్తకసంఘాలు ఆరోపించాయి. ఒపక్క అఫ్ఘన్ వైపున ఉన్న సరిహద్దు పాయింట్‌ను ప్రారంభించినా పాకిస్థాన్ అధికారులు మాత్రం తమవైపు క్రాస్‌పాయింట్‌ను ప్రారంభిం చలేదని వర్తకలు ఆరోపిస్తున్నారు. రెండుదేశాలమధ్య ఒకపర్యాయం చర్చలు జరిగిన తర్వాతమాత్రమే ప్రారం భించ నున్నట్లు అదికారులు చెపుతు న్నారు. ఇస్లాద్ మమంద్ మాట్లా డుతూ అఫ్ఘన్‌వైపునుంచి మాకు ఎలాంటి సమాచారం లేదని, వారివైపు సరిహద్దును ఎందుకు మూసివేసారన్నది చెప్పడంలేదని అన్నారు. ఆదివారం మూసివేసిన చెక్‌పోస్టు మళ్లీ ఎందుకు తిరిగి తెరిచారు వీటివెనుక కారణాలను కూడా తెలియేయాల్సి ఉంద న్నారు. సరిహద్దుప్రోటోకాల్ ప్రకారం రెండువైపులా సమావేశం జరిగిన తర్వాత మాత్రమే ఎలాంటి చర్యలయినా చేపట్టాల్సి ఉంది. అయితే ఏకపక్షంగా అఫ్ఘన్ తమ సరిహద్దుమూసివేసి మళ్లీ తెరుస్తున్నారని పాక్ ఆరోపిస్తోంది. భవిష్యత్తులోకూడా పరస్పరం ఆమో దయోగ్యమైన ఒక నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. తోర్ఖాం సరిహద్దును ప్రారంబి స్తున్నారన్న సమాచారంతో వందలాదిమంది అఫ్ఘన్ జాతీయులు మహిళలు చిన్నపిల్లలతో భారీ సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. కానీ తీరా తెరవడం లేదని తెలిసి ఎంతో నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్‌లో ఆహార కొరతను ఎదుర్కొంటున్నారు. గోదాముల్లోనే తాత్కాలిక వసతులు ఏర్పాటుచేసుకుంటున్నారు. బ్రిటిష్ కాలం నాటి రైల్వే సొరంగాల్లో మరికొందరు తలదాచుకుంటున్నారు. ఎలాంటి వసతులు లేవు. స్థానిక స్వఛ్ఛంద సంస్థ వారికి ఆహారం, దుస్తులు, మందులు ఇస్తోంది. ఇలాంటి వాతావరణంలో మహిళలు పూర్తి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుదీర్ఘ కాలంపాటు అత్యంత రద్దీ అయిన ఈ సరిహద్దును మూసివేయడంవల్ల ద్వైపాక్షిక వాణిజ్యానికి గండిపడుతోంది. వందలాదిగా లోడ్ అయిన ట్రక్కులు రెండువైపులా నిలిచిపోయాయి. చికెన్; చేపల డీలర్లు మాట్లాడుతూ తమ లారీలను తాము వెనక్కి పెషావర్‌కు తీసుకుపోయామని, ఈ జాప్యం వల్ల అవిచెడిపోయేప్రమాదం ఉందన్నారు. కూరగాయలు, తాజా పండ్లు, బియ్యం, చక్కెర ఇతర ఉత్పత్తులు ఉన్న ట్రక్కులు రోడ్ పక్కనే నిలిపివేసారు. షాగాయ్ సరిహద్దు పాయింట్‌నుంచి 20 కిలోమీటర్లమేర ట్రక్కులునిలిచిపోయాయని చెపుతున్నారు. అఫ్ఘన్ రాజధాని కాబూల్‌కు డెలివరీ చేయాల్సిన ఉత్పత్తులు రవాణా ఆటంకంతో విపరీత జాప్యం జరిగిన తమకు ఎంతో నష్టం వాటిల్లుతున్నదని ట్రక్కు యజమానులు చెపుతున్నారు. కొందరయితే ట్రక్కుల్లోని ఉత్పత్తులను దోపిడీచేసుకుని తరలించుకు పోతున్నారని, తామేమీ చేయలేకపోతున్నట్లు వాపోయారు. గడచిన ఐదురోజులుగా నిలిచిపోవడంవల్ల, సరిహద్దును మూసివేయడంవల్ల రెండువైపులా వ్యాపారులకు సుమారు ఐదొందల కోట్లు నష్టం వచ్చి ఉంటుందని కస్టమ్స్ ఏజెంట్, కోల్ డీలర్ ఇబ్లాన్ ఆలీ చెప్పారు. ఇలాంటి సమస్యలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని దెబ్బ తీస్తాయని ఆయన అన్నారు.

# ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా

# భారతీయుడు



## మాస్టర్‌కార్డ్ అజయ్‌బంగా నియామకం

## నామినేట్ చేసిన అమెరికా అధ్యక్షుడు జోబైడెన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** భారతీయుల ఖ్యాతి ఖండాంతరాలు దాటింది. ప్రపంచంలోనే మేటి సంస్థలకు పలువురు భారతీయులు సారథ్యం వహిస్తున్నారు. తాజాగా, మరో భారతీయుడు ప్రతిష్టాత్మక పదవికి అడుగు దూరంలో ఉన్నాడు. భారత సంతతికి చెందిన వ్యాపారవేత్త అజయ్ బంగాను ప్రపంచబ్యాంకు అధ్యక్ష పదవికి నామినేట్ చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ప్రకటించారు. బంగా నామినేషన్‌కు ప్రపంచ బ్యాంకు డైరెక్టర్లబోర్డు ఆమోద ముద్ర వేయడం తరువాయి. అన్నీ అనుకున్నట్లు సాగితే ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవిని చేపట్టిన తొలి భారతీయ అమెరికన్‌గా సిక్కు అమెరికన్‌గా బంగా చరిత్ర సృష్టిస్తారు. 63 ఏళ్ల బంగా ప్రస్తుతం జనరల్ అట్లాంటిక్ కంపెనీ వైస్ చైర్మన్‌గా ఉన్నారు. గతంలో మాస్టర్‌కార్డ్ అధ్యక్షుడిగా, సిఇఒగా విధులు నిర్వర్తించారు. 2016లో భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

అత్యంత కీలకమైన ప్రస్తుత తరుణంలో ప్రపంచ బ్యాంకును ముందుండి నడిపించగల సామర్థ్యం బంగాకు ఉందని బైడెన్ విశ్వాసం వ్యక్తం చేయడం గమనార్హం. మూడు దశాబ్దాల పాటు పలు అంతర్జాతీయ సంస్థలను విజయవంతంగా నడిపించిన అనుభవం ఆయన సొంతమని ఆమెరికా అధ్యక్షుడు తన ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణ మార్పుల అంశం సహా ప్రపంచం ముందున్న ప్రస్తుత అన్ని సవాళ్లను బంగా సమర్థంగా ఎదుర్కోగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌తో ఆయన గతంలో సన్నిహితంగా పనిచేశారు. తాను పదవి నుంచి త్వరలోనే తప్పుకుంటానని ప్రపంచ బ్యాంకు ప్రస్తుత అధ్యక్షుడు డేవిడ్ మాల్పస్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి 2024 చివరకు ఆయన పదవీకాలం ఉండగా దాదాపు రెండేళ్ల ముందు తప్పుకుంటున్నారు. దీంతో కొత్త అధ్యక్షుడి ఎంపిక అనివార్యమయింది. అధ్యక్ష పదవికి నామినేషన్ ప్రక్రియ మార్చి 29 వరకు కొనసాగుతోంది. అనంతరం బోర్డులోని డైరెక్టర్లు ఎవరివైపు మొగ్గుచూపితే వారే అధ్యక్షుడవుతారు.

సాధారణంగా ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అమెరికన్, ఐఎంఎఫ్ చీఫ్‌గా యూరోపియన్లే కొనసాగుతారు. అయితే మొదటిసారి అమెరికాయేతర వ్యక్తి నామినేట్ కావడం విశేషం. ప్రపంచ బ్యాంకులో అమెరికా అధిక వాటాలను కలిగి ఉంది. బైడెన్ యంత్రాంగంలోని ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ మాస్టర్ కార్డు, జనరల్ అట్లాంటిక్ సంస్థలో వాతావరణ మార్పులను ఎదుర్కోవడం, హరిత పరివర్తననుశక్తివంతం చేయడంలో సహకరించేలా ప్రైవేట్ మూలధనాన్ని సమీకరించడానికి అజయ్‌ప్రాధాన్యతనిచ్చాడు. ఇవి ప్రపంచ బ్యాంకులో రాబోయే సంవత్సరాల్లో అతని సామర్థ్యాన్ని నడిపించే అనుభవాలు, ప్రాధాన్యతలు అని వ్యాఖ్యానించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## 11 మంది మృతి

## 10 మందికిపైగా గాయాలు

**రాయ్‌పూర్, ఫిబ్రవరి 24:** ఛత్తీస్‌గఢ్ బలోదా బజార్ జిల్లా ఖమారియా గ్రామం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రక్కు, పికప్ వాహనం ఢీకొన్న ఘటనలో 11 మంది చనిపోయారు. మరో 10 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో నలుగురు చిన్నారులు కూడా ఉన్నారు. స్థానికుల సాయంతో వీరిని ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. వైద్యుల సిఫార్సు మేరకు క్షతగాత్రుల్లో కొందరిని రాయ్‌పూర్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇది భటపరా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి లారీ, పికప్ వాహనం ఢీకొన్నాయి. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. పికప్ వాహనంలో ఉన్నవాంతా ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ సిఎం భూపేశ్ బఘేల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించాలని సూచించారు. రెండు వారాల క్రితం కంకేర్ జిల్లాలో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. స్కూల్ పిల్లలతో వెళ్తున్న ఆటోను ట్రక్కు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరొక చిన్నారితో పాటు ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి.



## ఈశాన్య భారత్‌ను కాంగ్రెస్ ఏటిఎంలా వాడుకొంది ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** ఈశాన్య భారత్‌లోని రాష్ట్రాలను కాంగ్రెస్ పార్టీ ఏటిఎంలా వాడుకొందని, అదే బిజెపి మాత్రం అక్కడి 8 రాష్ట్రాలను అష్టలక్ష్మిలా చూస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. తాము ఆ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఆయన నాగాలాండ్‌లోని దిమాపూర్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో శాంతి కోసం బిజెపి చేసిన కృషి ఫలితంగానే ఇప్పుడు రాష్ట్రంలో 1958 ఆర్మ్‌డు ఫోర్సెస్ చట్టాన్ని తొలగించామని వెల్లడించారు. మీ ప్రజలను మీరు నమ్మకపోతే దేశాన్ని పాలించలేరు. వారి సమస్యలను గౌరవించి పరిష్కరించాలి. మొదట్లో ఈశాన్య భారతంలో వేర్పాటు రాజకీయాలు జరిగేవి. మేము వాటిని పాలన ఆధారంగా జరిగేలా నిర్ణయించాం. బిజెపి మతం లేదా ప్రాంతం ఆధారంగా ప్రజలపై వివక్ష చూపదు అని ప్రధాని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో కేవలం రాజకీయ అస్థిరత్వం మాత్రమే నాగాలాండ్‌లో ఉండేదని ప్రధాని అన్నారు. ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా ఈశాన్య భారత్‌ను పాలించేవారని ఎద్దేవా చేశారు. ఈ ప్రాంతం అభివృద్ధికి కేటాయించిన నిధులను కాంగ్రెస్ హయాంలో మళ్లించేవారని విమర్శించారు. ఢిల్లీ నుంచి దిమాపూర్ వరకు వారసత్వ రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చేవారని, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మాత్రం ఈ రాష్ట్రానికి శాంతి, పురోగతి, శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తోందని మోడీ వెల్లడించారు. సాంకేతికతను వినియోగించుకుని బిజెపి ప్రభుత్వం అవినీతికి కళ్లెం వేసిందన్నారు. దీనిలో భాగంనే ఢిల్లీ నుంచి వచ్చే సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ అవుతుందన్నారు.

## ఫిలడెల్ఫియా స్కూలువద్ద కాల్పులు ఏడుగురికి తీవ్ర గాయాలు

**ఫిలడెల్ఫియా, ఫిబ్రవరి 24:** ఫిలడెల్ఫియా స్కూలులో జరిగిన కాల్పుల్లో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో రెండేళ్ల చిన్నారి కూడా ఉంది. మరో ఐదుగురు పిన్నవయస్కులే ఉన్నట్లు తేలింది. సాయంత్రం ఆరుగంటల తర్వాత స్ట్రాబెర్రి మాన్సన్ పరిసరాల్లోనే ఈ కాల్పుల శబ్దం వినిపించిందని పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారిలో రెండేళ్లచిన్నారిపరిస్థితి స్థిరంగా ఉందని చెపుతున్నారు. ఐదుగురు బాలురు కూడా తీవ్రంగా గాయపడ్డారు. వారందరినీ ఆసుపత్రిలోచేర్చారు. 31 ఏళ్ల మహిళ కూడా వీరిలో ఉందని పోలీసులు తెలిపారు. కాల్పులుజరపడానికి గల కారణాలు మాత్రం తెలియడంలేదు. ఫిలడెల్ఫియా స్కూలుబోర్డు అధ్యక్షుడు రెగినాల్డ్ స్ట్రీటర్ మాట్లాడుతూ స్కూలు బయట కాల్పులుజరిగాయని, ఎలిమెంటరీ స్కూలు సమీపంలో ఈసంఘటన జరిగిందని స్కూలు పూర్తయిన తర్వాతనే కాల్పులుజరిగాయని ఆయన వివరణ ఇచ్చారు.

## ఇండోనేసియా రేవులో తొలిసారి సబ్‌మెరైన్ నిలిపిన భారత్!



**జకర్తా, ఫిబ్రవరి 24:** దక్షిణ చైనా సముద్రంపై పెత్తనం కోసం ప్రపంచ దేశాలతో చైనా వివాదం ముదురుతున్న సమయంలో కీలక పరిణామాలు చోటు చేసుకొన్నాయి. ఆసియా దేశాలతో సంబంధాలను భారత్ బలోపేతం చేసుకుంటోంది. భారత్‌కు చెందిన ఓ సబ్‌మెరైన్ తొలిసారి ఇండోనేషియాలోని రేవులో లంగరేసింది. దాదాపు 3వేల టన్నుల బరువైన 'ఐఎన్ఎస్ సింధుకేసరి' సుందా జలసంధి మీదుగా జకర్తా చేరుకొంది. భారత యుద్ధ నౌకలు, ఇండోనేషియా, ఇతర ఆసియా దేశాలను తరచూ సందర్శిస్తుంటాయి. కానీ ఒక సబ్‌మెరైన్‌ను భారత జల సరిహద్దులకు దూరంగా మోహరించడం ఇదే మొదటిసారని నౌకాదళ సీనియర్ అధికారులు వెల్లడించారు. భారతన-ఇండోనేషియా యేటా రెండు సార్లు సంయుక్తంగా గస్తీ నిర్వహిస్తాయి. గతేడాది డిసెంబర్‌లో కూడా వీటిని నిర్వహించాయి. ఇరు దేశాలు వ్యూహాత్మక, రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకొంటున్నాయి. ఈ క్రమంలోనే 2018లో రక్షణ సహకార ఒప్పందంపై సంతకాలు చేశాయి. 2018లో ఐఎన్ఎస్ సింధు కేసరికి రూ.1,197 కోట్లు వెచ్చించి రష్యాలో పలు అత్యాధునిక సౌకర్యాలను కల్పించి జీవితకాలం పొడిగించేందుకు చర్యలు తీసుకొన్నారు. దీంతో పాటు మరో నాలుగు సింధుఘోష్ శ్రేణి, హెచ్‌డి డబ్ల్యూ శ్రేణి సబ్‌మెరైన్లలో కూడా ఇటువంటి చర్యలు చేపట్టారు. చైనా వేధింపులకు ప్రధాన బాధిత దేశాల్లో ఫిలిప్పీన్స్ కూడా ఒకటి. ఈ దేశానికి చెందిన 21 మంది సైనిక సిబ్బందికి ఇటీవలే నాగ్‌పూర్‌లో బ్రహ్మోస్ తయారీపై భారత్ శిక్షణ ఇచ్చింది. సముద్ర తీరాల్లో మోహరించే యాంటీషిప్ శ్రేణి బ్రహ్మోస్‌ను త్వరలోనే ఫిలిప్పీన్స్‌కు భారత్ సరఫరా చేయనుంది.

## తొలిమహిళా రాష్ట్రపతి ప్రతిభాసింగ్ భర్త కన్నుమూత

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** భారత తొలి మహిళా రాష్ట్రపతి ప్రతిభా పాటిల్‌భర్త దేవీసింగ్ షెకావత్‌కన్నుమైసారు. ఆయన వయసు 89 సంవత్సరాలు, రెండురోజులక్రితం ఆయన గుండెపోటుకు గురయ్యారు. దీనితో ఆయనను పూణె లోని కెఇఎం ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రిలోచికిత్స పొందుతూ ఆయన ఈ ఉదయం 9.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఈ రోజు సాయంత్రం ఆరు గంటలకు పూణెలో ఆయన అంత్యక్రియలను నిర్వహించ నున్నారు.



దేవీసింగ్ షెకావత్ ఎమ్మెల్యేగా కూడా చేసారు. అమ్రావతి నియోజకవర్గంనుంచి 1985లో ఎమల్యేగా గెలిచారు. ఆయన గొప్ప విద్యావేత్తకూడా. 1972లో ముంబయి యూనివర్సిటీనుంచి ఆయన పిహెచ్‌డిచేసారు. అమ్రావతి తొలిమేయర్‌గాకూడా ఆయన పనిచేసారు. భారత దేశ తొలి జెంటిల్మన్(మహిళా రాష్ట్రపతి భర్త)గా ఆయన రికార్డుల్లోకి వచ్చారు. ఆయన మృతిపట్ల రాజకీయ ప్రముఖులు సంతాపాన్ని ప్రకటిస్తున్నారు.

## జోయలుక్కాస్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** కేరళ కేంద్రంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో బంగారు ఆభరణాల వ్యాపారం నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ జోయలుక్కాస్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అదికారులు దాడులునిర్వహించారు. పశ్చిమాసియా దేశాలు, భారత్‌లలో అనేక బంగారు ఆభరణాల షోరూమ్‌లను నిర్వహిస్తున్న ఈ సంస్థ ఇటీవలే జారీచేసిన 2300 కోట్ల ఐపిఒనును ఉపసంహరించుకుంటున్నట్లుప్రకటించింది. కేరళ త్రిశూర్‌కేంద్రంగా ఉన్న ఈ చైన్‌షోరూమ్‌లలో అనేక చోట్ల సోదాలునిర్వమించింది. విదేశీ కరెన్సీ నిర్వహణ చట్టం ఉల్లంఘనకు పాల్పడిందన్న ఆరోపణలపైనే ఈ దాడులుజరిగాయి. అంతేకాకుండా దుబాయికి హవాలా సాయంతో నిధులు బదలీచేసిందని అభియోగాలున్నాయి. ఈ జ్యుయెలరీ మార్ట్ ఉన్న ఐదు ప్రాంతాల్లో దాడులునిర్వహించింది. వాటిలో కంపెనీ సిఎండి 50వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో శోభా సిటీలో ఉన్న నివాసాన్ని కూడా సోదాచేసారు. మొత్తం 300 కోట్లకుపైబడిన హవాలా లావాదేవీలను గుర్తించినట్లు తేలింది. ఇందుకుసంబంధించి 305 కోట్ల విలువైన ఆస్తులు ఇతరపత్రాలను జప్తు చేసింది. డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్, కంప్యూటర్ ఫరికరాలు మొత్తం స్వాధీనంచేసుకున్నారు. అంతేకాకుండా సేకరించిన ఆధారాలను ఇంటరాగేషన్‌కు ముందు పరిశీలనచేసినట్లు తేలింది. ఈవారంలోనే జోయాలుక్కాస్ తన 2300 కోట్ల ఐపిఒను విత్‌డ్రాచేసుకుంది. సెబీ వెబ్‌సైట్‌లో ఇందుకు సంబంధించిన వివరాలుకూడా వచ్చాయి. తన ఆర్థికఫలితాలను ప్రకటించేముందు కొన్ని సవరణలు, మార్పులు, పునఃపరిశీనలలుచేయాల్సి ఉందని స్టాక్‌మార్కెట్‌లో లిస్టింగ్‌కు ముందు సమగ్రపరిశీలన అవసరమని జోయాలుక్కాస్ సిఇఒ బేబీజార్జ్ చెప్పారు. ఐపిఒకు మళ్లీ దరఖాస్తుచేయాలనే ముందు ఉపసంహరించామని తెలిపారు. మార్కెట్ స్థితిగతులకు అనుగుణంగా ముందుకుపోతామని సిఇఒ చెప్పారు. 2022లో కంపెనీ తన డిఆర్‌హెచ్‌పిని దాఖలుచేసింది. పబ్లిక్ ఇష్యూద్వారా నిధులుసేకరించనున్నట్లు వాటిలో పొందుపరిచింది. 2022 మార్చి ముసాయిదా వివరాలప్రకారం కంపెనీ ఐపిఒ కొన్ని రుణాలను చెల్లించడంతోపాటు కొత్తస్టోర్లను తెరిచేందుకు వినియోగిస్తారు. దేశంలో మొత్తం 68 నగరాల్లో 85 షోరూంలు నిర్వహిస్తున్న ఇపుడు ఇడి నజర్‌పడింది.

## ప్రపంచదేశాల్లో పెరుగుతున్న కరోనా మరణాలు

### 68 లక్షలకు చేరువగా వైరస్ మృతులు

### 67.93 కోట్లకుపెరిగిన కరోనా బాధితులు

జెనీవా, ఫిబ్రవరి 24: ప్రపంచదేశాల్లో కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. చిన్నదేశాల్లో ఈకొత్తకేసులతో మరింత కలవరం వ్యక్తం అవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా శుక్రవారం నాటికి మొత్తం 67.93 కోట్లమందికికరోనాసోకి 67.96 లక్షలమంది చనిపోయారు. మరో 40,447 మందిపరిస్థితి విషమంగా ఉంది. రికవరీలు 65.21కోట్లవరకూ రికవరీలుంటే మరో 2.04 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 24.60 కోట్లమందికి కరోనాసోకి వారిలో 20.15 లక్షలమంది చనిపోయారు. మరో 6492 మంది పరిస్థితి విషమించింది. రికవరీలు 24.17 కోట్లకుపైగా నమోదుకాగా 23.88 లక్షలమంది ఇప్పటికీ ఆసుపత్రుల్కోలనే కొనసాగుతున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో మొత్తం 12.44 కోట్లమందికి కరోనాసోకి వారిలో 16.09 లక్షలమందిచనిపోయారు. మరో 7591 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 11.96కోట్లకుపైగా నమోదుకాగా మరో 31.80 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం కరోనా బాధితులు 21.41 కోట్లకుపైగా నమోదుకాగా వారిలో 15.35 లక్షలమందిచనిపోయారు. మరో 15,557 మందిపరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రికవరీలు 19.87కోట్లకుపైగా ఉన్నాయి. వీరుకాకుండా మరో 1.38 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో 6.79 కోట్లమందికి కరోనాసోకి వారిలో 13.50 లక్షలమందిచనిపోయారు. మరో 10,196 మందిపరిస్థితి ఆందోలనగా ఉంది. రికవరీలు 6.62 కోట్లమందికి కరోనాసోకి వారిలో 4.02 లక్షలమంది ఇప్పటికీ ప్రాణాలపై ఆశతో ఆసుపత్రుల్లోనే కొనసాగుతున్నారు. ఆఫ్రికా దేశాల్లో మొత్తం 1.279 కోట్లమందికికరోనాసోకి 2,58,576 మందిచనిపోయారు. రికవరీలు 1.20 కోట్లకుపైగా ఉన్నాయి. మరో 4,57,754మందిపరిస్థితి ఆందోళనకరంగా ఉంది. 19 ద్వీపకల్పదేశాల్లో మొత్తం 1.40 కోట్లమందికి కరోనాసోకి వారిలో 26,.076 మందిచనిపోయారు. రికవరీలు 1.38 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1,34,831 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

## ఉక్రెయిన్, రష్యా వార్ భారత్, చైనా ఓటింగ్‌కు గైర్హాజర్

**మాస్కో, ఫిబ్రవరి 24:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తన వైఖరిని మరోసారి చాటుకుంది. శాంతికి దౌత్యం మాత్రమే ఆచరణీయమైన మార్గమని పేర్కొంది. ఉక్రెయిన్‌లో శత్రుత్వానికి ముగింపు పలకాలని, తన బలగాలను ఉపసంహరించుకోవాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ (యుఎన్‌జిఎ)లో తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ఈ తీర్మాన ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది. కాగా చారిత్రక ఓటింగ్‌లో, తీర్మానానికి అనుకూలంగా 141 మంది ఓటు వేశారు. భారత్, చైనా సహా 32 దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. ఏడు దేశాలు తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశాయి. ఉక్రెయిన్‌లో సమగ్రమైన, న్యాయమైన, శాశ్వతమైన శాంతిని చేరుకోవాలని అసెంబ్లీ మాస్కోను కోరింది. 193 మంది సభ్యుల జనరలన అసెంబ్లీ ఉక్రెయిన్, దాని మద్దతు దేశాలు ఈ ముసాయిదా తీర్మానాన్ని తీసుకొచ్చాయి. భారత్ బహుపాక్షికతకు స్థిరంగా కట్టుబడి ఉంది. యుఎన్ చార్టర్ యొక్క సూత్రాలను సమర్థిస్తుంది. మేము ఎల్లప్పుడూ చర్చలు, దౌత్యం మాత్రమే ఆచరణీయమైన మార్గంగా భావిస్తాం. ఈ రోజు తీర్మానం పేర్కొన్న లక్ష్యాన్ని మేము గమనించాము. అయితే మన లక్ష్యాన్ని చేరుకోవడంలో దాని స్వాభావిక పరిమితులను పరిగణనలోకి తీసుకుంటాము. శాశ్వత శాంతిని సాధించాలనే లక్ష్యంతో మేము దూరంగా ఉండవలసి ఉంటుంది అని భారత ప్రతినిధి కాంబోజ్ చెప్పారు. 'మానవుల ప్రాణాలను పణంగా పెట్టి ఎటువంటి పరిష్కారమూ రాదని మేము నిరంతరం వాదిస్తున్నాము. ఈ నేపథ్యంలో ఇది యుద్ధ యుగం కాదన్న మన ప్రధాని ప్రకటన పునరుద్ఘాటిస్తుంది. శత్రుత్వం, హింసను పెంచడం ఎవరికీ ప్రయోజనం కలిగించదు' అని చెప్పారు. సాయుధ పోరాటాల పరిస్థితులలో పౌరులు, పౌర మౌలిక సదుపాయాలు లక్ష్యంగా ఉండకుండా చూసేందుకు అంతర్జాతీయ సూత్రాలు, న్యాయశాస్త్రం సంఘర్షణలో పక్షాలపై బాధ్యత వహిస్తుందని కాంబోజ్ తెలిపారు. ఉక్రెయిన్ వివాదానికి సంబంధించి భారతదేశం అనుసరిస్తున్న విధానం ప్రజల కేంద్రంగా కొనసాగుతుందని ఆమె అన్నారు. భారతదేశం ఉక్రెయిన్‌కు మానవతా సహాయం, గ్లోబల్ సౌత్‌లోని పొరుగువారిలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కొందరికి ఆర్థిక సహాయం రెండింటినీ అందిస్తోందన్నారు. ఉక్రేనియన్ ప్రెసిడెంట్ వోలోడిమిర్ జెలెన్స్కి అధ్యక్ష కార్యాలయ అధిపతి ఆండ్రి యెర్మాక్, భారతదేశ జాతీయ భద్రతా సలహాదారుతో ఐక్యరాజ్యసమితి తీర్మానం గురించి మాట్లాడారు. తమ తీర్మానానికి మద్దతు ఇవ్వాలని కోరారు. కానీ భారత్ జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ ఓటింగ్‌కు దూరంగా ఉంది. భారత్, రష్యాకు ఎప్పటి నుంచి మంచి సత్సంబంధాలు ఉన్నాయి.

## గుజరాత్ అమృత్‌కాల్ బడ్జెట్

## 916.87 కోట్ల మిగులుతో రాష్ట్ర బడ్జెట్

**గాంధీనగర్, ఫిబ్రవరి 24:** గుజరాత్‌ప్రభుత్వం 3.01 లక్షలకోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించింది. 2023:24 సంవత్సరానికి సంబంధించి కొత్త కొత్త ప్రాజెక్టులు కూడా బడ్జెట్‌లోప్రకటించింది. 2022 ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగానే బిజెపి ప్రభుత్వం తమ బడ్జెట్‌ను రూపొందించినట్లుప్రకటించింది. గుజరాత్ ఆర్థిక మంత్రి కనుదేశాయి రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం బడ్జెట్‌నుప్రవేవపెట్టారు. ముఖ్యమంత్రి భూపేంద్రపటేల్ ఆధ్వర్యంలో మొట్టమొదటి బిజెపి ప్రభుత్వ బడ్జెట్‌గా ప్రభుత్వం ప్రకటించింది. గత ఏడాది డిసెంబరులోనే వెల్లువలాంటి అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాషాయదళంనుంచి భూపేంద్రపటేల్‌ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య పథకం కింద బీమా కవరేజిని ఐదునుంచి పదిలక్షలకు పెంచింది. అంతేకాకుండా ఉజ్వల స్కీం లబ్ధిదారులకు ఏడాదికి రెండు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. 916.87 కోట్ల మిగులుతో బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టారు. వచ్చే 25 ఏళ్ల వరకూ రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలోపెట్టుకుని ఈ అమృత్‌కాల్ బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు తెలిపారు. మొత్తం రాష్ట్ర బడ్జెట్ 3,01,021 కోట్లుగా ఉన్నట్లు ఆయన తెలి పారు. బడ్జెట్‌కేటాయింపులు ముందు సంవత్సరం కంటే 23.38 శాతం అదనపు కేటాయింపులు ఉన్నట్లు తేలింది. రాష్ట్ర స్థూలు త్పత్తిని 42 లక్షలకోట్ల వరకూ పెరుగుతుందని ప్రభుత్వం అంచనావేసింది. ఎలాంటి కొత్త పన్నులను బడ్జెట్‌లోప్రతిపాదించలేదు. కరోనా మహమ్మారికాలంలోసమాంలోని వివిధ వర్గాలకు వెయ్యికోట్లవరకూ పన్నులు తగ్గించడంద్వారా అనేక ప్రయోజనాలు కల్పించినట్లు ఆర్థిక మంత్రి వివరించారు. రాష్ట్రంలో రానున్న ఐదేళ్లకు మౌలికవనరుల వృద్ధికోసం ఐదు లక్షలకోట్లవరకూ వ్యయం చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఐదు రాష్ట్ర హైవేలను 1500 కోట్లతో హైస్పీడ్ కారిడార్లుగా అభివృద్ధిచేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా ప్రతి జిల్లాలోను క్రీడా కాంప్లెక్స్‌లు ఏర్పాటుచేస్తామని, తాలూకా, రాష్ట్రస్థాయిలో కూడా వీటిని నిర్మించనున్నట్లు తెలిపారు. 1066 కోట్లతో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద వచ్చే ఏడాది పక్కాగృహాలునిర్మించనున్నట్లు తెలిపారు.



## ఒక్కరోజులో కరోనా కేసులు 169, మృతి ఒకరు

## దేశంలో మొత్తం కరోనా బాధితులు 4,46,85,619

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి24: భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 169 కేసులు నమోదయ్యాయి. మృతి ఒక్కరు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,46,85,619కి చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,41,52,839 మంది కోలుకోగా 2016 మంది దేశంలోని వివిద ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,30,764కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.81 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,37,485కి చేరగా, 79,88,933 మంది వరకు కోలుకున్నారు.

# రాష్ట్రంలో అరాచక పాలన

- పోలీసు వ్యవస్థ అధికార పార్టీ నాయకులకు దాసోహం
- త్వరలో ప్రజలే బిఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారు
- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాలనా యంత్రాంగం నిర్వీర్యం అయిపోయిందనీ, ఒక్క పోలీస్ వ్యవస్థ మాత్రమే పనిచేస్తూ అధికార పార్టీ నాయకులను దాసోహం అంటుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇటీవల మున్సిపల్ చెర్‌పర్సన్ పదవికి, దాంతో పాటుగా బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, కౌన్సిల్ పదవికి రాజీనామా చేసిన డా. భోగ శ్రావణిని బిజెపి నాయకులు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేంధర్ శుక్రవారం జగిత్యాలలోని ఆమె స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట జిల్లా బిజెపి అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ రావుతో పాటు మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క, మాజీ జెడ్పి చైర్‌పర్సన్ తుల ఉమ, బిజెపి నియోజకవర్గ ఇంచార్జ్ ముదిగంటి రవీంధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్‌కుమార్, పన్నాల తిరుపతిరెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు, పార్టీ నాయకులు పడాల తిరుపతి తదితర పార్టీ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పని చేయకుండా పోయిందని, ప్రభుత్వ పాలనా యంత్రాంగం నిర్వీర్యం అయిపోయిందని, కేవలం రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ మాత్రమే పనిచేస్తూ అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో నడుస్తూ దాసోహం అంటుందని ఈటల రాజేంధర్ ఘాటుగా విమర్శించారు. అంతే కాకుండా ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించకుండా, ప్రతిపక్ష పార్టీలే ఉండరాదన్న ధ్యేయంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇంకా ఎమ్మెల్యే వేధింపులు భరించలేక మున్సిపల్ చైర్‌పర్సన్ పదవితో పాటు కౌన్సిల్‌కు బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన శ్రావణిని బిజెపిలోకి ఆహ్వానిస్తున్నామన్నారు. తమతో కలిసి పనిచేయాలని శ్రావణిని, ఆమె కుటుంబానికి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని, ఈ సందర్భంగా ఈటల రాజేంధర్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రజాప్రతినిధులుగా కాకుండా రైతులను మహిళలను ఉద్యోగులను విద్యార్థులను వేధించడం పాటు కేసులు బనాయించడం ఎంత వరకు సమంజసం అని అన్నారు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.



చైర్‌పర్సన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

## వెల్దుర్తి మండలం ఉప్పు లింగాపూర్‌లో దారుణం

### పోలీసుల వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం మత్తులో ఉన్న వ్యక్తితో వాగ్వాదం అనంతరం విద్యుత్ స్తంభం ఎక్కి తీగలను పట్టుకోవడంతో అక్కడికక్కడే మృతి...

### మృతుడు తూప్రాన్ ఏరియా హాస్పిటల్‌కు తరలింపు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** జిల్లాల్లో పోలీసుల ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. అకారణంగా ఒక యుకుకున్ని దొంగతనం కేసులో అనుమానించి ఇంటరాగేషన్ పేరుతో విచక్షణా రహితంగా కొట్టి అతని మృతికి కారణం అయ్యారు. ఇటీవల జరిగిన ఆ సంఘటన మరువక ముందే జిల్లాలో మరో సంఘటన జరగడంతో ప్రజలు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.... మెదక్ జిల్లా వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పులింగాపూర్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా చిన్నశంకరంపేట మండలం ఎస్. కొండాపూర్ గ్రామానికి చెందిన యాట సాయిరాం (25) అనే వ్యక్తి మద్యం సేవించి ఉప్పులింగాపూర్ నుండి వెల్దుర్తి వైపు నడుచుకుంటూ వాహనాలకు అడ్డంగా వెళ్లడంతో అక్కడే వాహానాలు తనిఖీ చేస్తున్న ఏఎస్ఐ వసురాం నాయక్ మందలించడంతో మద్యం మత్తులో ఉన్న సాయిరాం హల్‌చల్ చేస్తూ విద్యుత్ సరఫరా ఉన్న స్తంభంపై ఎక్కుతుండగా అక్కడే ఉన్న పోలీసులు లాగేశారు. మళ్లీ తిరిగి మరో స్తంభం ఎక్కి విద్యుత్ వైర్లు పట్టుకోవడంతో కాలిపోయాడు. వెంటనే పోలీసులు అప్రమత్తమై తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు పరీక్షించగా అప్పటికే చనిపోయినట్లు వెల్లడించారు. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురికి తరలించారు. ఇతను గత వారం రోజుల క్రితం చిన్న శంకరంపేట్ పోలీసులు తనిఖీ చేస్తుండగా కూడా ఇదే విధంగా ప్రవర్తించారని తెలిసింది. కాగా ఈ సంఘటనలో మృతి చెందిన యువకుడు మద్యం సేవించడంతోనే ఇలా జరిగిందని పోలీసులు చెప్తున్నప్పటికీ, రోజు తనిఖీల పేరుతో ఫైన్‌లు వేస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని మరి కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఖదీర్‌ఖాన్ సంఘటన మరువక ముందే ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరం.



## ఎస్‌బిఐ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఎస్‌బిఐ ఆధ్వర్యంలో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో కవి ప్రవీణ్‌రాహి, రజనీచౌహాన్, మంజుకర్మోర్, ముఖేష్‌శ్రీవాత్సవ్, రాహుల్‌శర్మ వంటి వారు తమ కవితలను పఠించారు. ఈ కవిసమ్మేళనంలో వివిధ బ్యాంకులకు చెందిన సిజిఎంలు అమిత్‌ఝింగ్రాన్, పట్నాయక్, సురేశ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన మంత్రి కెటిఆర్

### బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోతుందన్న వాస్తవాన్ని గ్రహించిన పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ ప్రధాని నరేంద్రమోడిని, బిజెపిని కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తున్నారని బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి. సుభాష్ ఆరోపించారు. భూపాలపల్లిలో మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. బిజెపికి ప్రజలు వస్తున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేకపోతున్నారని, మోడి ప్రభుత్వంపై అభ్యంతరకర పదజాలంలో బురదజల్లుతున్నారని సుభాష్ ఆరోపించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై బహిరంగ చర్చకు రావాలని మా పార్టీ నేతలు సవాల్ చేసినా బిఆర్ఎస్ మంత్రి నాయకులు ఎవరూ ముందుకు రావడం లేదని సుభాష్ మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను కించపరిచే మాటలతో పోలుస్తుంటే, ప్రతిపక్ష పార్టీ నేతలకు సంబంధించిన వివిధ కేసుల్లో దర్యాప్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ బలగాల సంగతేమిటని ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో బిఆర్ఎస్ నేతలకు సంబంధం లేకుండా మీరు ఎందుకు హడిలిపోతున్నారని, దేశంలో ఎక్కడ మోసాలు జరిగినా అన్ని ప్రగతి భవన్‌కు చేరుస్తున్నారయని, సిఎం కెసిఆర్‌న కుటుంబ సభ్యులు, బిఆర్ఎస్ నాయకుల ప్రమేయం ఉందన్నారు.

## కొండగట్టు అంజన్న ఆలయంలో

# అర్ధరాత్రి ఆగంతకులు చోరబాటు

### 15 కిలోల వెండి మకరతోరణం, తొడుగులు, కిరీటాలు, రామరక్షా దోపిడీ

### ముగ్గురు దుండగుల కోసం గాలింపు

**మల్యాల (జగిత్యాల జిల్లా), ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో భారీ చోరీ జరిగింది. ముగ్గురు ఆగంతకులు ముసుగులు ధరించి గురువారం అర్ధరాత్రి 1.20 ప్రాంతంలో గుడి వెనకాల బేతాల స్వామివారి ఆలయం సమీపంలో గల ఆలయ ద్వారం తాళాలు పగలగొట్టి ఆలయంలోకి ప్రవేశించి గర్భగుడిలోని సుమారు 15 కిలోల వెండి అభరణాలను ఎత్తుకెళ్ళారు. ఆగంతకులు గర్భగుడిలో శ్రీ స్వామివారి వెండి మకర తోరణం, వెండి తొడుగులు, కిరీటాలు, శటగోపాలు, రామ పాదుకలు వంటి సుమారు 09 లక్షల విలువ గల వెండి ఆభరణాలను దోచుకెళ్ళారు. అయితే దుండగులు పక్కా రెక్కి నిర్వహించి ఈ దారుణానికి పాల్పడట్టు భావిస్తున్నారు. శుక్రవారం ఉదయం 5 గంటలకి ఆలయంలో శ్రీ స్వామివారికి సుప్రభాత సేవ ప్రారంభించేందుకు ఆలయ తలుపులు తెరవడానికి వెళ్ళిన అర్చకులకు సమాచారం అందించారు. దీంతో జగిత్యాల డిఎస్‌పి ప్రకాష్ మల్యాల సిఐ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగి వెంటనే ఆలయం తమ స్వాధీనం చేసుకుని, విచారణ చేపట్టి ఆలయంలో దర్శనాలు నిలిపివేశారు. దీంతో కొండగట్టుకు దర్శనాలకు వచ్చిన భక్తులు గంటల తరబడి పడి కాపులు కాశారు. పోలీస్ డాగ్ స్క్వాడ్ క్లూస్ టీం ఇన్వెస్ట్‌గేట్ టీంలను రప్పించి దుండగుల ఆచూకికై గాలింపు చేపట్టారు. ఆలయంలో జరిగిన చోరిపై పూర్తిస్థాయి విచారణ చేసిన అనంతరం మధ్యాహ్నం తిరిగి భక్తులకు ఆలయంలోకి ప్రవేశం కల్పించారు. కాగా ఈ దారుణానికి పాల్పడిన ఆగంతకులు 30 - 35 వయసులో ఉంటారని, ఆలయంలోని సిసి ఫుటేజీల ఆధారంగా నిర్ధారించారు. శ్రీ స్వామి ఆలయంలో భారీ చోరి జరిగిందన్నా విషయం తెలుసుకున్న భక్తులు తమ ఇలవేల్పు కొండగట్టు అంజన్న స్వామికి భద్రత లేకుంటే సామాన్య మానవుల సంగతేమిటని ఆందోళన చెందారు. కాగా ఆలయంలో 60 చోట్ల సిసి కెమెరాలతో నిఘా, ఒక ఏఎస్ఐ నలుగురు హోంగార్డులు, ఎనిమిది మంది సెక్యూరిటి సిబ్బంది వంతుల వారీగా ఇక్కడ విధులు నిర్వహిస్తుండగా దుండగులు పక్క వ్యూహంతో ఆలయ వెనుక వైపు గల ద్వారం నుండి దోపిడికి పాల్పడ్డ దుండగులను గాలింపు తీవ్రతరం చేశామని తొందరలోనే పట్టుకుని తీరుతామని జగిత్యాల డిఎస్‌పి ప్రకాష్ వెల్లడించారు. సంఘటన తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆలయంలో ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ భద్రతపై అధికారులు, పోలీసులు కలిసి చర్చించారు.



ఆలయంలోని దొంగతనాల దృశ్యం

## సంత్ నిరంకారి ఆధ్వర్యంలో జల వనరుల సంరక్షణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** సంత్ నిరంకారి మిషన్ సద్గురువు మాతా సుదీక్షా జీ మహారాజ్, రాజపిత జీ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ అమృత్‌లో భాగంగా స్వచ్ఛమైన జలం స్వచ్ఛమైన మనసు కార్యక్రమాన్ని ఈనెల 26న ప్రారంభించనున్నారు. జల వనరుల సంరక్షణ ఈ ప్రాజెక్టు ఉద్దేశమని నీటి వనరుల సరైన వినియోగ పద్దతులను రూపకల్పన చేసేందుకు వివిధ కార్యక్రమాలను మిషన్ నిర్వహిస్తుంది. నీటి వనరుల వినియోగ పద్దతులకు క్రియా రూపాన్ని ఇచ్చేందుకు గాను అవగాహన ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ఈ మేరకు సంత్ నిరంకారి మిషన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. బాబా హరదేవ్ సింగ్‌జీ తమ జీవిత పర్యంతం సమాజ కళ్యాణార్థం ఎన్నోన్నో కార్యక్రమాలు చేపట్టారు. వీటిలో స్వచ్ఛత, వృక్షారోహణ అభియాన్ చెప్పుకోదగినది. తెలంగాణతో సహా దేశ వ్యాప్తంగా 1000 స్థానాలో 730 నగరాల్లో 27 రాష్ట్రాలలో కేంద్ర పాలిత ప్రాంతాలలో విశాల రూపంలో ప్రాజెక్టు అమృత్ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

సముద్ర, నది ఒడ్లు, ఏటిగట్లు, కాలువలు తదితర నీటి వనరులను శుభ్రపరుస్తారు. జలాశయాల్లో పేర్కొన్న చెత్తాచెదారం, ఘన, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను తొలగిస్తారు. రహదారుల వెంబడి సుందరీకరణ చేస్తారు. అలాగే నీటి సంరక్షణకు సంబంధించి బ్యానర్లు వంటి వాటి ద్వారా జాగృత పరుస్తారని చెప్పారు.



# మహోన్నత వ్యక్తి ఈశ్వరీబాయి: మామిడి

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** 1969లోనే ప్రత్యేక తెలంగాణపై అసెంబ్లీలో గళం విప్పిన మహోన్నతమైన మహిళామూర్తి ఈశ్వరిబాయి అని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. ఈశ్వరిబాయి సేవలను గుర్తించిన సిఎం కెసిఆర్ ప్రతి ఏడాది ఆమె జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారపూర్వకంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఈశ్వరిబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో జరిగిన ఆమె 32వ వర్ధంతి కార్యక్రమంలో హరికృష్ణ ప్రసంగించారు. ఆమె ఎమ్మెల్యేగా, మహిళా ఉద్యమ నాయకురాలిగా, పేదల పాలిట పక్షపాతిగా పనిచేసిన ఈశ్వరిబాయి సేవలు మరువలేనివని కొనియాడారు. ఆత్మగౌరవంతో జీవించిన ఆమె అందరికి ఆత్మగౌరపై మక్కువ పెంచిన గొప్ప స్ఫూర్తి ప్రదాత అని ప్రసంసించారు. దళిత సేన జాతీయ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు జె.బి.రాజు మాట్లాడుతూ ఆమె అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని దళితుల అభ్యున్నతి కోసం శివంగిలా పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆమె గొప్ప పోరాట యోధురాలని కొనియాడారు. అనంతరం గాంధీ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు, ప్రముఖ సామాజిక కార్యకర్త నర్ర వనజాక్షి , ప్రొఫెసర్ వెంకటరాజు, ప్రొఫెసర్ కరుణాదేవి తదితరులకు మామిడి హరికృష్ణ ఈశ్వరిబాయి స్మారక అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్-చైర్మన్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వివిధ దళిత సంఘాల నేతలు జి.చెన్నయ్య, గోల్లపల్లి దయానందరావు, సి.హెచ్.బాలకృష్ణ, మహేశ్వర్‌రాజ్, జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.





అవార్డు గ్రహీతలతో మామిడి హరికృష్ణ

## బషీర్‌బాగ్‌లో భారీ వృక్షాలు నరికివేత

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** బషీర్‌బాగ్‌లోని ఒక భవనంలో భారీ వృక్షాలను నరికివేయడం జరిగింది. అటవీ శాఖ అధికారుల అనుమతి లేకుండా భారీ వృక్షాలను సిబ్బంది నరికివేశారు. సమాచారాన్ని తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఆ భవనం వద్దకు చేరుకుని సిబ్బందిపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. నరికివేతకు పాల్పడ్డ సిబ్బందిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే జెసిబీతోపాటు, కట్టింగ్ మిషన్స్ స్వాదీనం చేసుకున్నారు.

## వామపక్ష, ప్రగతిశీలశక్తులతోనే ప్రపంచ శాంతి, అభివృద్ధి సాధ్యం

### అఖిలభారత ఫార్వర్డ్‌బ్లాక్ జాతీయ మహాసభలో చైనా, కొరియా, వియత్నాం విదేశీ ప్రతినిధుల ప్రసంగాలు





సభలో పాల్గొన్న చైనా, కోరియా, నేపాల్, వియత్నాం దేశాల కమ్యూనిస్ట్ పార్టీ ప్రతినిధులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** విప్లవాత్మక పోరాటాలతో సామ్రాజ్యవాద దురాక్రమణలను అడ్డుకునే వామపక్ష, ప్రగతిశీల శక్తులతోనే ప్రపంచ శాంతి, అభివృద్ధి సాధ్యం అని వామపక్ష, సోషలిస్ట్ పార్టీల విదేశీ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రపంచంలో మానవ, రాజకీయ, ఆర్థిక, ప్రజాస్వామ్య హక్కులు సామ్రాజ్యవాదులచే కాలరాయబడుతున్నాయని, ప్రజలకు ఉపాధి, ఉచిత ఆరోగ్యసంరక్షణ అందుబాటులోకి విద్య, చవకైన గృహాలు లభించడం లేదని, వీటి కోసం ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష, ప్రగతిశీల శక్తులు ఏకమై బలమైన పోరాటాలు నిర్వహించవలసిన అవసరముందని అన్నారు. అఃలభారత ఫార్వర్డ్‌బ్లాక్ 19వ జాతీయ మహాసభల రెండవ రోజు విదేశీ ప్రతినిధుల సందేశాలతో ప్రారంభమైనాయి. చైనా కమ్యునిస్ట్ పార్టీ ఆఫ్ చైనా నుంచి చెన్ జియాన్చున్, వియత్నాం కమ్యునిస్ట్ పార్టీ ఆఫ్ వియత్నాం నుంచి నుయెన్ థాన్ హై, క్యూబా నుంచి కమ్యునిస్ట్ పార్టీ ఆఫ్ క్యుబా నుంచి రోజాస్ మేడిన మలేనా కోరియానుంచి వర్కర్స్ ఆర్టీ ఆఫ్ కోరియా నుంచి హుయ్ చోల్, కిమ్ మయోంగ్ చోల్,, నేపాల్ నుంచి కమ్యునిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ ప్రతినిధి ఉదయ్‌రాజ్ పాండే, యువరాజ్ బాస్కోట, బంగ్లాదేశ్ నుంచి రివొల్యుషనరీ వర్కర్స్ పార్టీ ఆఫ్ బంగ్లాదేశ్ ప్రతినిధి బాహ్యానిషిక జమళి, లోవోస్ నుంచి వర్మనీ బౌంమి(లా ఓ ప్యూపిల్స్ రివొల్యుషనరీ పార్టీ), శ్రీలంక ప్యూపిల్స్ లిబరేషన్ ఫ్రంట్ నుంచి బిమల్ రత్నాయకే, డీబీలోక్ సింగ్, అప్రాఫుల్ ఆలం(కమ్యునిస్ట్ పార్టీ ఆఫ్ బంగ్లాదేశ్)లు తమ ప్రసంగాలను చేశారు. దేశంలో ఫార్వర్డ్ బ్లాక్ ముఖ్యమైన రాజకీయ శక్తిగా ముందుకు సాగుతోందని, దేశ, జాతీయపరిస్థితులకు అనువైన సోషలిస్ట్‌మార్గాన్ని రూపొందించడానికి, దేశంలోని సామాజిక పురోగతిని ముందుకు తీసుకెళ్ళడానికి చాలాకాలం కట్టుబడి పరివర్తనలో ఉందని అన్నారు. చైనా, భారతదేశం ఒకదానికొకటి ముఖ్యమైన పొరుగు దేశాలు అని, రెండు ప్రాచీన నాగరికత, ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశాలు, ఈ రెండు ఆర్థికవ్యవస్థలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. దేశంలోని సోషలిస్ట్ ఉద్యమానికి సంబంధించి ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కార్యదర్శి జి.దేవరాజన్ తీర్మాణం ప్రవేశపెట్టగా, ప్రారంభోపన్యాసాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి దేబబ్రత బిస్వాస్ చేశారు. పి.వి.కతిరవన్(తమిళనాడు), జిఆర్.శివశంకర్(కర్ణాటక), నరేన్ చటర్జీ(బెంగాల్), గోబిందరాయ్(బెంగాల్, జ్యోతి రంజన్ మహాపాత్ర(ఒడిశా), అమ్రేశ్‌కుమార్(బిహార్) అధ్యక్షవర్గంగా వ్యవహరించగా సభలలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి, మహాసభల ఆహ్వానసంఘం సభ్యులు సుందరమహారాజు, కె.తేజ్‌దీప్‌రెడ్డి, బి.రాములుయాదవ్, జి.వంశీధర్‌రెడ్డి, కొమ్మూరి వెంకటేశ్‌యాదవ్, ఎస్కే తౌఫిక్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన హెల్దీ బేబీషో భేష్

### చాలా చక్కటి కార్యక్రమం: ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రశంస

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** కేంద్ర మంత్ర జి.కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ లోకసభ నియోజకవర్గంలో చిన్నారుల ఆరోగ్యం కోసం చేపట్టిన హెల్దీ బేబీ షోను ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రశంసించారు. ఇదొక అద్భుతమైన ప్రయత్నం, చిన్నారులకుఎంతో మేలు చేస్తుందో అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోడి ట్వీట్ చేశారు. హెల్త్ బేబి షో కార్యక్రమం నిర్వహణ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ట్వీట్ చేశారు. సికింద్రబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, ప్రతి హౌజింగ్ సొసైటీ, ప్రతి బస్తీలోనూ హెల్తీ బేబి షోను సంబంధించిన దరఖాస్తు ఫారాలను పంచడం ద్వారా ఈ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లు అయిన ముషీరాబాద్, అంబర్‌పేట, ఖైరతాబాద్, జుబ్లిహిల్స్, సనత్‌నగర్, నాంపల్లి, సికింద్రాబాద్ ఉన్నాయని, వాటిలో సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇటీవలే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. చిన్నారులకు, వారి కుటుంబ సభ్యులకు సన్మానం చేయడంతో పాటు వారికి సర్టిఫికెట్లు ఇచ్చామని అన్నారు. పోషణ కిట్లు ఇచ్చి పోషకాహారాన్ని లోపాలన్ని నిర్మూలిస్తామంటూ వారి ద్వారా ప్రతిజ్ఞ చేయించామన్నారు. తల్లులకు ఇచ్చిన కిట్లలో ప్రోటాన్ ఫొడర్, ఐరన్ ఫోలిక్ ఆసిడ్, సిరప్, నులి పురుగుల మందులు, ప్రొటీన్ బిస్కట్లు, నెయ్యి, ఖర్జూరాలు, డైపర్లు, టవర్లు, హాండ్ వాషల్‌లు, ఫోటోన ఫ్రేమ్‌లతో పాటు ఓ టెడ్డీపేర్‌లు ఉన్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ట్విట్టర్‌లో వెల్లడించారు.

# ఆత్మహత్యాయత్నం చేసిన వైద్యవిద్యార్థిని పరిస్థితి విషమం



నిమ్స్‌లో మీడియాతో మాట్లాడుతున్న ప్రీతి తండ్రి నరేందర్

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పిజి వైద్యవిద్యార్థిని ధరావత్ ప్రీతి(24) ఆరోగ్యపరిస్థితి అత్యంత విషమంగా ఉందని నిమ్స్ వైద్యులు ప్రకటించారు. వెంటిలేటర్‌తోపాటు ఎక్మో సాయంతో చికిత్స చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే గవర్నర్ తమిళిసైసౌందరరాజన్ ప్రీతిని పరామర్శించి వైద్యులతో మాట్లాడి ఆమె తల్లితండ్రులను ఓదార్చిన విషయం తెలిసిందే. ప్రీతి శరీరంలోని పలు అవయవాలు పనిచేయడం లేదని మూత్రపిండాల పనితీరును మెరుగు పరిచేందుకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు.

### బాధ్యులపై చర్యలు తప్పవు : మంత్రి సత్యవతి రాథోడ్

ధరావత్ ప్రీతి ఆత్మహత్యాయత్నం బాదాకరమని బాద్యులపై కఠిన చర్యలు తీసకుంటామని శ్రీశిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేస్తుందని పేర్కొన్నారు. ప్రీతి తల్లిదండ్రులతో మాట్లాడిన మంత్రి వారికి ధైర్యం చెబుతూ అన్నివిధాల ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

గత రెండు రోజుల కంటే పరిస్థితి మెరుగు పడిందని ఈఘటనపై ఇప్పటికే ప్రభుత్వం ఓకమిటిని నియమించిందన్నారు. భాద్యులు ఎవరైనా ఉపేక్షించేంది లేదు అనీ వారిని త్వరలోనే శిక్షిస్తామన్నారు. ప్రీతి ఆరోగ్యంపై గంట గంటకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు సమీక్షిస్తున్నారన్నారు. వైద్యంతో పాటు భగవంతుడి ఆశీస్సులతో ఆమె త్వరగా కోలుకోవాలన్నారు. కోలుకున్నాక ప్రీతి స్టేట్‌మెంట్‌ను పోలీసులు తీసుకుంటారని రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ మెరుగ్గా ఉందని మంత్రి తెలిపారు.

### ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వైద్యవిద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుగుతుందని బాధ్యులు ఎవరైనాసరే వదిలేది లేదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రీతి ఆరోగ్య పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీతి ఆత్మహత్యాయత్నం దురదృష్టకరమనీ విద్యార్థులు వారిలో ఉన్న ధైర్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో కోల్పోవద్దని అన్నారు. ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

### ప్రీతిలో ఎలాంటి చలనం లేదు: బాధితురాలి తండ్రి నరేందర్

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న పిజి వైద్యవిద్యార్థి ప్రీతి ఆరోగ్యం విషమంగానే ఉందని ఆమె తండ్రి నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్మో మీదనే ప్రీతికి వైద్యం అందిస్తున్నారని అయితే డాక్టర్లు, అధికారులు చెప్పేదంతా అబద్ధం అనీ అన్నారు. వేధింపులకు గురిచేస్తున్నారంటూ తాము ఫిర్యాదు చేసినపుడే సీనియర్ విద్యార్థి సైఫ్‌పై పోలీసులు చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఫిర్యాదు చేసిన వారినే వేధిస్తున్నారని నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు.

గట్టిగా తట్టిలేపితేనే చూడని ప్రీతి, స్వతాహాగా శ్వాసతీసుకోవడం లేదని మిషన్‌ల ద్వారా కృత్రిమశ్వాస అందిస్తున్నారని తమకు ఏమాత్రం నమ్మకం లేకుండా ఉందన్నారు. ప్రీతి ఆరోగ్యంపై ఎవరికి వారే మంత్రులు, వైద్యులు తప్పుడు ప్రచారం చేస్తూ వారి పబ్లిసిటీ కోసం వచ్చి ఇష్టానుసారంగా స్టేట్‌మెంట్‌లు ఇస్తున్నారే కానీ తమ కూతురి దయానీయ పరిస్థితిని అర్థం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఆరోగ్యంలో ఎలాంటి మెరుగుదల లేదన్నారు. సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

### ప్రీతికి జరుగుతున్న వైద్యంపై అనుమానాలున్నాయి : ప్రీతి సోదరి దీప్తి

ప్రీతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేంత పిరికిది కాదని ఆమె సోదరి దీప్తి అన్నారు. నిమ్స్‌లో విషమ పరిస్థితుల్లో చికిత్స పొందుతున్న ప్రీతికి జరుగుతున్న వైద్యంపై తమకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. ప్రీతి వైద్యచికిత్సకు నిమ్స్‌లో అవసరమైన వసతులు ఏమాత్రం లేవని పరామర్శలు మాకు వద్దు ఈ ఘటనపై ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటుచేయాలని అన్నారు. అయితే ఓ మహిళ డాక్టర్ అయి ఉండి గవర్నర్ మా అక్కకు పూలదండలు ఎందుకు వేశారని ప్రశ్నించింది. మా అక్క చనిపోకముందే పూలదండలు ఎలా తెస్తారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితుల్లో తమకు పరామర్శలు అవసరం లేదని న్యాయం జరిగేలా ప్రత్యేక కమిటీనీ ఏర్పాటుచేసి తగిన న్యాయం జరిగేలా ప్రభుత్వం తరపున చూడాలని డిమాండ్ చేశారు.

## మార్చి 12న తెలంగాణకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** తెలంగాణలో రాజకీయాలు మళ్లీ వెడెక్కుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా బీజెపి పావులు కదుపుతోంది. వరుస కార్యక్రమాలతో ఇప్పటికే బిజి బిజీగా ఉంది. ఈ క్రమంలో కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. అమిత్‌షా మార్చి 12న తెలంగాణలో పర్యటించనున్నారు. అధికారిక కార్యక్రమాల్లో భాగంగా అమిత్ షా హైదరాబాద్‌కు వస్తున్నట్లు బిజెపి నేతలు తెలిపారు. అయితే, అదే రోజు రాష్ట్రంలో ఏదో ఒక పార్లమెంట్ నియోజకవర్గంలో బహిరంగ సభ ఏర్పాటు చేయాలని రాష్ట్ర బిజెపి పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారిక కార్యక్రమం తర్వాత రాష్ట్ర రాజకీయాలపై బిజెపి నేతలతో షా సమావేశం అవుతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసే దిశగా అమిత్ షా పర్యటన ఉంటుందని అంటున్నాయి.

## పూలదండ ఆరోపణలపై రాజ్‌భవన్ స్పష్టీకరణ

### గవర్నర్ తమిళిసైపై మెడికో ప్రీతి సోదరి ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైద్య విద్యార్థిని ప్రీతిని పరామర్శించేందుకు గవర్నర్ పూలదండతో వచ్చారని జరుగుతున్న ప్రచారాన్ని రాజ్ భవన్ తీవ్రంగా ఖండించింది. ఖైరతాబాద్‌లోని హనుమంతుడి గుడిలో సమర్పించడానికి కారులో పూల దండ ఉంచామని స్పష్టం చేసింది. ఈ మేరకు రాజ్‌భవన్ నుంచి ఓ ప్రకటన వెలువడింది. గవర్నర్ వేరే ప్రదేశాల నుంచి రాజ్‌భవన్‌కు తిరిగి వచ్చేటప్పుడు ఖైరతాబాద్‌లోని హనుమంతుడి గుడికి వెళ్లి రావడం చాలా రోజుల నుంచి ఆనవాయితీగా వస్తోందని వివరించింది. ఈ విషయాన్ని దుష్ప్రచారం చేస్తూ విపరీత అర్థాలు తీయడం సహేతుకం కాదని, అలాగే ప్రీతి త్వరగా కోలుకోవాలని హనుమంతుడి గుడిలో గవర్నర్ ప్రార్థించారని తెలిపింది. ఈ ఘటనపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలు సమగ్రంగా దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గవర్నర్ ఆదేశించినట్లు పేర్కొంది. గవర్నర్ నిమ్స్ పర్యటనను సరైన దృష్టితో అర్థం చేసుకోవాలని గవర్నర్ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. నిమ్స్‌కు గవర్నర్ పర్యటనపై మెడికో ప్రీతి సోదరి తీవ్ర స్థాయిలో స్పందించింది. గవర్నర్ తమిళిసై ఆసుపత్రికి వస్తూ పూలదండ తీసుకురావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. నా సోదరి చనిపోయిందనుకుని పూలదండ తీసుకువచ్చారా? అంటూ మండిపడింది. గవర్నర్ హోదాలో ఉన్న వ్యక్తి ఇలాగేనే వ్యవహరించేది? అని నిలదీసింది. ప్రజల ప్రాణాలు కాపాడే ఒక డాక్టర్ చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతుంటే పూలదండలు వేసేసి వెళ్లిపోవడానికి వచ్చారా? అని ప్రీతి సోదరి ప్రశ్నించింది. మేం ఓదార్పును కోరుకోవడం లేదు. మాకు న్యాయం కావాలి అని డిమాండ్ చేసింది. దీనిపై రాజ్‌భవన్ వర్గాలు స్పందించాయి. గవర్నర్ ఆసుపత్రికి వెళ్లిన సమయంలో ఆమె కారుపై పూలదండ ఉందని, అది ఆంజనేయస్వామి ఆలయంలో సమర్పించేందుకు ఉద్దేశించిన దండ అని స్పష్టం చేశాయి. దీనిని తప్పుగా అర్థం చేసుకున్నారని, ఈ వైఖరి సరికాదని పేర్కొన్నాయి.

## తప్పతాగి బేకరీలో ఇద్దరిపై కత్తితో దాడిచేసిన నిందితుడికి జీవిత ఖైదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** తనను ఉద్యోగం నుంచి తొలగించినందుకు బేకరి యజమానిపై కక్షగట్టిన ఓ వ్యక్తి తప్పతాగిన స్థితిలో బేకరిపై దాడిచేసి అడ్డు వచ్చిన ఇద్దరిని కత్తితో పొడిచిన నిందితుడికి నాంపల్లి కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. దీనికి సంబంధించిన వివరాలను సంజీవరెడ్డి నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు శుక్రవా రం మీడియాకు వెల్లడించారు. 2018 ఏప్రిల్ 13వ తేదీ అర్థరాత్రి సమయంలో సంజీవరెడ్డి నగర్‌లోని హాజీ మస్తాన్ బేకరీపై గతంలో అక్కడ పనిచేసి తొలగించబడ్డ అలావుద్దీన్ (40) అనే వ్యక్తి తప్పతాగినస్థితిలో గొడవకు వచ్చాడు. ఇదే సమయంలో అతన్ని బేకరీలో క్యాషియర్‌గా వున్న నుమాన్ బిన్ సయ్యద్ అడ్డుకోగా అలావుద్దీన్ కత్తితో దాడిచేశాడు. ఈ ఘటనలో నుమాన్ బిన్ సయ్యద్ ఎడవ చేతికి గాయం అయ్యింది. దీంతో అక్కడే వున్న సమీ అనే వ్యక్తి అలావుద్దీన్‌ను పట్టుకునేందుకు యత్ని ంచగా అతనిపైనా దాడి చేశాడు. ఈ ఘటనలో సమి కుడిచేతికి గాయం అయ్యింది. దీని తరువాత అతి కష్టం మీద అలావుద్దీన్‌ను అందరు కలిసి పట్టుకుని పోలీసులకు అప్పగించగా, గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో నిందితుడుగా వున్న అలావుద్దీన్‌ను సంజీవ రెడ్డి నగర్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు అలావుద్దీన్‌ను పరిచి జైలుకు తరలించారు. దీనిపై కోర్టులో పోలీసులు ఛార్జిషీటు దాఖలు చేయగా అప్పటి నుంచి వాదోపవాదాలు జరిగాయి. దీనిపై శుక్రవారం నాడు నాంపల్లి ఎంఎస్‌జె కోర్టు న్యాయమూర్తి కవిత తీర్పు చెబుతూ తప్పతాగిన స్థితిలో ఇద్దరిపై దాడిచేసిన నిందితుడు అలావుద్దీన్‌కు జీవిత ఖైదు శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించారు. ఈ కేసులో విచారణాధికారిగా ఎస్‌ఐ నరేష్ వ్యవహరించారు. పిపిగా రాంరెడ్డి వ్యవహరించారు.

## ఒకేరోజు ఐదుగురు కమిషనర్లు పదవీవిరమణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్(ఆర్టీఐ) ఖాళీ అయింది. ఒకే రోజు ఐదుగురు కమిషనర్లు పదవీ విరమణ చేయడంతో ఆ కమిషన్‌లో సిబ్బంది మాత్రమే మిగిలారు. 2017లో రాష్ట్ర సమాచార కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నేతృత్వంలో ఏర్పాటైన త్రిసభ్య కమిటీ ఈ కమిషనర్లను ఎంపిక చేసింది. ప్రధాన కమిషనర్‌గా బుద్దా మురళిని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆ తర్వాత సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్‌రెడ్డి, మైదా నారాయణరెడ్డి, న్యాయవాదులు సయ్యద్ ఖలీలుల్లా, మహ్మద్ అమీర్ హుస్సే న్, గిరిజన విద్యార్థి శంకర్ నాయక్‌లను కమిషనర్లుగా ఎంపిక చేసింది. వీరి నియామకానికి అప్పటి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఉత్తర్వులు జారీచేయడంతో... అందరినీ ఒకేసారి కమిషనర్లుగా నియమించారు. శుక్రవారం పదవి కాలానికి చివరి రోజు కావడంతో వీరంతా ఒకేరోజు పదవీ విరమణ చేశారు. బుద్దా మురళీ గతంలోనే పదవీ విరమణ చేశారు. ఆయన తర్వాత ఎవరినీ ఇప్పటి వరకు ప్రధాన కమిషనర్‌గా ఎంపిక చేయలేదు.

## సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్‌గా ఎన్నికైన కొల్లి నాగేశ్వరరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా అఃల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు నియమిస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ వారు ఉత్తర్వులు జారీ చేశారు. కొల్లి నాగేశ్వరరావు గత 24 సంవత్సరాలుగా వికలాంగుల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తున్నారు. గతంలో కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రిత్వ శాఖ సభ్యుడుగా, పలు కేంద్ర ప్రభుత్వ కమిటీల్లో రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కోసం పోరాడుతానని, దివ్యాంగుల ప్రయాణికుల కోసం ప్రత్యేక సదుపాయలు ఏర్పాట్లు అయ్యేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## రాష్ట్రంలో కరోనా తాజా కేసులు - 16

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** రాష్ట్రంలో కరోనా పాజటీవ్ కేసులు బాగా తగ్గాయి. శుక్రవారం సాయంత్రం వరకు ఒక్క రోజులో 16 పాజిటీవ్ కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 8,41,642 పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటలో కరోనా వల్ల మృతి చెందినట్లుగా నమోదు కాలేదు. రాష్ట్రంలో ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 4111 వరకు చేరింది. ఒక్క రోజులో 3209 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 3,84,83,301 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు కరోనా నుంచి 8,37,642 మంది కోలుకోగా (99.50శాతం) శుక్రవారం నలుగురు కోలుకున్నారు. మొత్తం యాక్టీవ్ కేసుల సంఖ్య 71కు చేరింది. శుక్రవారం జిహెచ్ఎంసి పరిధిలో 9 పాజిటీవ్ కేసులు నమోదు అయ్యాయి.

# రాష్ట్రంలో రోడ్లన్నీ అద్దంగా మెరవాలి

- వారంలోగా టెండర్లన్ని పూర్తికావాలి
- అధికారుల్లో అలసత్వాన్ని సహించేది లేదు
- నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవు
- సిఎం కెసిఆర్ నమ్మకాన్ని నిలబెట్టాలి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** సిఎం కెసిర్ ఆదేశాల మేరకు ఈ వారంలోగా రహదారులకు సంబంధించిన టెండర్లు పూర్తిచేసి, పనులను గ్రౌండింగ్ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పనులపై సంబంధిత అధికారులతో టిఎస్ఐఆర్‌డిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్లు రావడం లేదని ఏవోవో కబుర్లు, కారణాలు చెప్పవద్దని, అధికారుల్లో అలసత్వాన్ని సహించేది లేదని, అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే సంబందిత నియోజకవర్గాల ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లతో మాట్లాడాలని ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి కావలన్నారు. పనులు పురోగతి, అధికారుల పనితీరును మదింపు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రాష్ట్ర వ్యాప్తంగా రెండు విడతలుగా మనందరి మీద నమ్మకంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు కావాల్సినని నిధులు ఇచ్చారు. రూ.2669.74కోట్ల అంచాన వ్యయంతో 3009 పనులు నిర్ణయించి, మంజూరుచేశామని, ఇందులో ఇప్పటి వరకు 2109 పనులను మాత్రమే టెండర్లు వచ్చాయన్నారు. ఇంకా 900 పనులకు టెండర్లు పిలవాల్సి ఉందని, వీటిని తొందరగా సెటిల్ చేయాలి. వారం రోజుల్లోగా అన్ని పనులకు టెండర్లు పూర్తి కావాలి. అనిన పనులు గ్రౌండ్ అయి ఉండాలి, జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలన్నారు. నాణ్యతలో రాజీవద్దని, నిర్ణీత గడువులోగా పనులు పూర్త చేయడంపై దృష్టి పెట్టండి అంటూ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు ఆయా పనుల్లో కొంత వెసులుబాటును సైతం కల్పించామన్నారు. అయినా పనులకు టెండర్లు రావడం లేదని, దీన్ని ఇంజనీర్ల అసమర్థతతగా భావించాల్సి ఉంటుంది. ఆ అవకాశం ఇవ్వవద్దని, అధికారులు కాంట్రాక్టర్లతో మాట్లాడాలన్నారు. వారి సమస్యలు తెలుసుకుని వాటిపరిష్కారాలు చూపాలన్నారు. మీ నుంచి కానీ సమస్యలు తన దృష్టికి తీసుకుని రావాలన్నారు.

జిల్లాల వారీగా పరిశీలించి, ఆయా జిల్లాల పనితీరును సమీక్షించారు. సంబంధిత అధికారులను మాట్లాడి. ఆయా చోట్ల పనుల వేగవంతంగా అవసరమైన సూచనలు, సలహాలు మంత్రి ఇచ్చారు. ప్రజాప్రతినిధులతో సమన్వయంచేసుకునే అధికారులు కొందరు సమర్ధవంతంగా పనిచేస్తున్నారని, సమన్వయం కాని చోటే పనులు టెండర్లు, గ్రౌండింగ్ ఆలస్యం అవుతుందన్నారు. విజయవంతంగా పని జరుగుతున్న చోట మీ సహచరులైన ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. వారి పద్దతులను అవలంబించాలని, దీని ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఈ ఆరు నెలల్లోనే ఆయా పనులన్నీ పూర్తయ్యే విధంగా చూడాలి. కొంచెం కష్టపడాలన్నారు. మంచి ఫలితాలు వస్తాయని ఆ క్రెడిక్ కూడా మీకే దక్కుతుందన్నారు.

సిఎం కెసిఆర్ మనందరి మీద నమ్మకంతో గ్రామాలను అద్దంగా మార్చే అభివృద్ధి చేసే అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చారని, ఈ అవకాశాన్ని సద్వినియోగాన్ని చేసుకుందామన్నారు. మన విధులను చక్కగా నిర్వర్తిద్దాం, నిధులను సక్రమంగా ఖర్చుచేద్దామన్నారు. కెసిఆర్ ఆలోచన మేరకు ప్రజల ముంగిట్లో అభివృద్ధిని తీసుకుని వెళ్లి చూపిద్దామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఈఎన్‌సి సంజీవరావు, సిఈ సీతారాములుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## వాణిజ్య, వ్యాపార భవనాలన్నింటిలో అగ్నిప్రమాద నివారణ చర్యలను చేపట్టండి



### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు జరిగే అన్ని భవన సముదాయాల్లో అగ్ని ప్రమాదాల నివారణచర్యలను వెంటనేచేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్‌లో జరిగిన అగ్నిప్రమాద నేపథ్యంలో అగ్ని ప్రమాదాల నివారణకు వెంటనేచేపట్టాల్సిన చర్యలపై జిహెచ్ఎంసి చేసిన ప్రతిపాదనలపై సిఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, జిహెచ్ఎంసి కమిషనర్ లోకేష్‌కుమార్, అగ్నిమాపక నివారణ పరికరాలను ప్రమాదాల పట్ల హెచ్చరికలు జారీ చేసే అలారం, తదితర మౌలిక సదుపాయాలను వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కమర్షియల్ కాంప్లెక్స్‌లలో సెల్లార్‌లలో ఆక్రమణలను తొలగించడంతో పాటు, పేలుడుకు ఆస్కారం ఉన్న గ్యాస్ సిలిండర్లు, కెమికల్స్ తదితర పదార్థాలను ఉంచకుండా కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా, ఆసుపత్రులు, రెస్టారెంట్లు తదితర ప్రజా సమూహం గల వాణిజ్య సముదాయాలలో ఈ విధమైన చర్యలను వెంటనే చేపట్టాలన్నారు. ప్రతి వ్యాపార సంస్థ ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్‌ను కలిగి ఉండాలని, భారీ వాణిజ్య భవనాలలో సెల్లార్లల్లో గానీ, భవనం పైభాగంలో కానీ వాటర్ స్టోరేజ్ ట్యాంకులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ జాగ్రత్తలను పాటించేందుకు తగు కాల పరిమితి విధించాలన్నారు.

అగ్ని ప్రమాద నివారణ చర్యలపై తీసుకున్న చర్యలను తెలియజేసే ప్రత్యేక యాప్‌ను రూపొందించి ట్రేడ్‌ల వారీగా అగ్ని ప్రమాద నివారణకై చేపట్టాల్సిన జాగ్రత్తలను ఈ యాప్‌లో పొందుపరచాలని అన్నారు. ప్రతి కమర్షియల్ కాంప్లెక్స్‌లో థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రమాదాలు జరిగితే వెంటనే చేపట్టాల్సిన చర్యలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి ఈవిడిఎం డైరక్టర్ ప్రకాష్‌రెడ్డి, సిసిపి దేవేందర్‌రెడ్డి, ఫైర్ సర్వీస్ డైరక్టర్ లక్ష్మిప్రసాద్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ పాపయ్యలు పాల్గొన్నారు.

## అవినాష్‌ను ప్రశ్నించిన సిబిఐ

≫ ఆదేశాలతో హైదరాబాద్ సిబిఐకి మారడం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా రెండవసారి కోఠిలోని సిబిఐ కార్యాలయానికి శుక్రవారం మధ్యాహ్నం 12.30గంటల సమయంలో వచ్చిన అవినాష్ రెడ్డిని సాయంత్రం ఐదు గంటలవరకు సిబిఐ అధికారులు విచారించారు. అవినాష్ రెడ్డిని సిబిఐ ఎస్‌పి రాంసింగ్ నేతృత్వంలోని బృందం విచారించింది. ఈ విచారణలో వివేకానంద రెడ్డి హత్యకు సంబంధించి అనేక ప్రశ్నలను సిబిఐ బృందం అవినాష్ రెడ్డిని సంధించింది. విచారణ సమయంలో న్యాయవాదులతో అవినాష్ రెడ్డి రాగా విచారణ గదిలోకి వారిని సిబిఐ అధికారులు అనుమతించలేదు. ఈ విషయంలో అవినాష్ రెడ్డి విజ్ఞప్తిని సిబిఐ అధికారులు తిరస్కరించారు. ఇందుకు నిబంధనలు అంగీకరించవని చెప్పడంతో ఆయన ఒక్కరే విచారణ గదిలో వెళ్లారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో అవినాష్ రెడ్డి విచారణ తరువాత బయటకు వచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ అధికారులు తనకు 160 సిఆర్‌పిసి నోటీసు ఇవ్వడంతో విచారణకు వచ్చానని, ఈ క్రమంలో అధికారులు అనేక అంశాలపై ప్రశ్నించారని, ఇందులో అన్ని అంశాలపై సమాధానాలు చెప్పానని తెలిపారు. వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణ పారదర్శకంగా జరగడం లేదని, వాస్తవాల ఆధారంగా కాకుండా వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని సాగుతున్నట్లుగా వుందని ఆయన తెలిపారు. ఈ కేసులో తనకు తెలిసిన అన్ని అంశాలతో కూడిన ఒక విజ్ఞాపన పత్రాన్ని సిబిఐకి ఇచ్చానని, దీనిని కులంకుశంగా పరిశీలించాలని కోరినట్లు ఆయన చెప్పారు. ఈ కేసులో నిజాన్ని 100 శాతం నుంచి సున్నాకు తెచ్చే ప్రయత్నం జరుగుతోందని, అబద్ధాన్ని సున్నా నుంచి వందకు తెచ్చే ప్రయత్నం జరుగుతోందని అవినాష్ రెడ్డి అన్నారు. వివేకా హత్య జరిగిన రోజున మార్చురీ వద్ద తాను మీడియాతో మాట్లాడానని, ఆ తరువాత రెండు రోజులకు మళ్లీ మాట్లాడనని, అప్పుడు ఏం మాట్లాడానో ఇప్పుడు అదే మాట్లాడుతున్నానని, ఎలాంటి కొత్తవిషయాలు, మార్పులు, చేర్పులు లేవని ఆయన వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మీడియాలో వస్తున్న వార్తల వల్ల విచారణ పక్కదారి పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో తనపై కొన్ని మీడియా సంస్థలు దుష్ప్రచారం చేస్తుండడం సరైందని కాదని ఆయన అన్నారు. ఈకేసు విచారణకు భయపడి తాను దుబాయ్‌కు పారిపోయి నట్లుగా మరోచోటుకు వెళ్లినట్లుగా తప్పుడు ప్రచారం చేశారని, ఇదంతా సరైంది కాదని ఆయన తెలిపారు. ఇంతకు ముందు జరిగిన విచారణకు ముందు తాను విజయమ్మను కలిసిన మాట నిజమేనని, అయితే ఈ సందర్భంగా తాను ఆమెను బెదిరించినట్లుగా ప్రచారం చేశారని, ఇది కూడా సరైంది కాదని ఆయన తెలిపారు. సిబిఐ విచారణ సందర్భంగా న్యాయవాదుల సమక్షంలో ఆడియో, వీడియోలతో రికార్డింగ్ చేయాలని తాను కోరగా అందుకు అధికారులు అంగీకరించలేదని అవినాష్ రెడ్డి చెప్పారు. తనను మరోసారి విచారణకు రావాల్సి వుంటుందని సిబిఐ అధికారులు కోరలేదని ఆయన తెలిపారు. సిబిఐ అధికారుల అన్ని ప్రశ్నలకు తాను సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను తాను నివృత్తి చేశానని ఆయన తెలిపారు. వివేకాంద రెడ్డి హత్య కేసును కొందరు కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నారని, వాస్తవాలను వక్రీకరిస్తున్నారని అవినాష్‌రెడ్డి తెలిపారు. తెలుగుదేశం నాయకులు గూగుల్ టేకవుట్ అని అంటున్నారని, ఇందులో ఏముందనేది కాలమే చెబుతుందని, గూగుల్ టేకవుటా? టిడిపి టేకవుటా?అనేది చూడాల్సి వుందన్నారు. 2019 మార్చి నెలలో జరిగిన వివేకానందరెడ్డి హత్య అప్పట్లో సంచలనంరేపింది. మొదట ఈ కేసును ఎపి పోలీసులు విచారించగా ఆ తరువాత సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిబిఐ చేబట్టింది. ఈ కేసులో అవినాష్ రెడ్డిపై ఆరోపణలు వచ్చినా ఆయనను విచారణకు పిలువలేదు. ఈ విచారణ హైదరాబాద్ సిబిఐకి బదిలీ అయిన తరువాత నెల రోజుల వ్యవధిలో రెండుసార్లు ఆయన్ను విచారించారు. మరోవైపు అవినాష్ రెడ్డి విచారణ సందర్భంగా వైఎస్సార్సీ కార్యకర్తలు సిబిఐ కార్యాలయానికి రావడంతో అక్కడ ఎలాంటి ఉద్రిక్తలు తలెత్తకుండా వుండేందుకు పోలీసులను మోహరించారు. స్థానిక పోలీసులతోపాటు కేంద్రబలగాలను కూడా మోహరించారు.

## బిజెపికి వ్యతిరేకంగా విముక్త చిరుతల పార్టీ ఉద్యమం

### బిఆర్ఎస్‌తో స్నేహపూర్వబంధం : తోల్ తిరుమవళవన్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి వ్యతిరేకంగా విముక్త చిరుతల(కక్షి) పార్టీ ముందుకు సాగు తుందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, చిదంబరం లోకసభ సభ్యుడు తోల్ తిరుమవళవన్ అన్నారు. తమ విముక్త చిరుతల(కక్షి) పార్టీకి తమిళనాడు లోని డిఎంకె కూటమిలో ముఖ్యమైన భాగస్వామి విసికె పార్టీకి ఇద్దరు ఎంపిలు, నలుగురు ఎమ్మెల్యేలున్నారని అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విముక్త చిరుతల పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీని ప్రకటించడంతో పాటు మీడియా సమావేశం జరి గింది. మతతత్వాన్ని, ఫాసీజాన్ని రుద్దే బిజెపి పార్టీ రోజురోజుకు బలపడుతోందని, బిజెపిని తిప్పికొట్టేందుకు సమస్య లను బట్టి వివిధ పార్టీలతో పొత్తులపై ఆలోచిస్తుందని అన్నా రు. బిజెపిని తిప్పికొట్టేందుకు సమస్యలనుబట్టి బిఆర్ఎస్, వామపక్ష పార్టీల మిత్రులతో ముందుకు వెళ్తామని అన్నారు. బిఆర్ఎస్ పార్టీతో స్నేహపూర్వకబంధం ఉందని స్పష్టం చేశారు. విముక్త చిరుతల(కక్షి) పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ 2024లో బిజెపికి తిరిగి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందని, దేశాన్ని హిందూ రాష్ట్రంగా ప్రకటించి ఆర్ఎస్ఎస్ సిద్దాంతాలు తేవాలని చూస్తోందని, ఆ పార్టీ అంబేద్కర్ వాదాన్ని దూరం చేయాలని కుట్రలు పన్నుతోందని, ఈ వాదానికి రక్షణగా ఉండడం తమ పార్టీ ముందుకు ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి చోట తెలంగాణలో ఏదో ఒక గ్రామంలో దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, గడచిన సంవత్సరంలో 12వేల మంది ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదయ్యాయని, ఇంకా నమోదు కాని కేసులు ఎన్నో ఉన్నాయన్నారు.



పాల్గొన్న విముక్త చిరుతల పార్టీ జాతీయ అధ్యక్షుడు, చిదంబరం లోకసభ సభ్యుడు తోల్ తిరుమవళవన్, డాక్టర్ జిలుకర శ్రీనివాస్ తదితరులు

### పార్టీ రాష్ట్ర కమిటీ ఏర్పాటు

విముక్త చిరుతల పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా డాక్టర్ జిలుకల శ్రీనివాస్ నియమితులయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మచ్చ దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా ఏ.ఎం.షోయబ్, కార్యదర్శులుగా వేణుయాదవ్, సాహుమహరాజ్, బొట్టు శ్రీధర్, అంజయ్య సంజీవ, అబ్దుల్, అక్బర్‌హుస్సే న్, ఎస్.కె.నబి, రామకృష్ణ, ప్రచార కార్యదర్శిగా ఆనంద్ చెరిపల్లి, కోశాధికారిగా దానబోయిన రవి, ఉప కోశాధికారిగా ఇర్ఫాన్ ముజాహిద్దీన్, అధికార ప్రతినిధిగా పగిడిపల్లి శ్యామ్, ఉస్మాన్‌ఖాన్, కార్యవర్గ సభ్యులఉుగా అయిరబోయిన బిక్షపతి, గంగారపు శ్రీనివాస్, శంకర్, వెంకటేశ్, ముర్తుజా, నదీమ్, ఖలీద్ నవీద్, సలీమ్, అక్బర్, అబ్దుల్ ఖదీర్, అబ్దుల్ మజీద్ ఉన్నారు.

## కరెంటు కోతలు ఉండవ్

### విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** తెలంగాణలో అన్ని రంగావకు ఎటువంటి కరెంటు కోతలు ఉండవని విద్యుత్ శాఖ మంత్రి జి జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయంతో పాటు, వాణిజ్యం, వ్యాపార, గృహ వినియోగదారుకలు నిరంతర విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం ఉండబోదన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌తో ఒక ప్రకటనలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ కొనుగోలు చేసి సరఫరా చేసేందుకు అవసరమైన ట్రాన్స్‌మిషన్ లైన్స్, ట్రాన్స్ఫార్మర్లు, డిస్ట్రిబ్యూటరీ లైన్లు సిద్ధం చేసిన్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే 15 వేల మెగావాట్లకు డిమాండ్ చేరిందన్నారు. ఎన్టీపీసీ, కేంద్రం నిర్లక్ష్యంతో పాటు, రాష్ట్రంలోని రెండు ప్లాంట్లు నిలిచిపోవడంతో విద్యుత్ సరఫరాలో ఇటీవల కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. అధిక ధరలతో కొనుగోలు చేసి సమస్యను అధిగమించినట్లు తెలిపారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేసేందుకు రూట్ మ్యాప్ చేసిందని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు బిగించాలని తమపై వత్తిడి తెస్తుందని తెలిపారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ మీటర్లు బిగించబోమన్నారు.

## దోషులను ఎంతటి వారినైనా కఠినంగా శిక్షిస్తాం

### నిమ్స్‌లో ప్రీతిని పరామర్శించిన మంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వైద్య విద్యార్థిని ప్రీతిని ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. రెండు రోజుల జిల్లా పర్యటన ముగించుకొని శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు వచ్చిన మంత్రి నేరుగా నిమ్స్‌కు వెళ్లి ప్రీతి ఆరోగ్యంపై సమీక్ష చేశారు. ఆమెకు అందిస్తున్న వైద్యం గురించి, నిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్, చికిత్స అందిస్తున్న ప్రత్యేక వైద్య బృందాన్ని అడిగి తెలుసుకన్నారు. అత్యుత్తమ వైద్యం అందించాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. ప్రీతి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చి, ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విచారణ పూర్తి నిష్పాక్షికంగా జరుగుతుందని, దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం గెలుపు లాంఛనమే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక లేనట్టేనని తేలింది. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో స్వతంత్ర అభ్యర్థి మహమ్మద్ రహీంఖాన్ ఒకరు. అయితే ఆయన నామినేషన్ పరిశీలనలో రిజెక్ట్ అయింది. రహీంఖాన్‌ను బలపరిచిన వారు ఓటర్లు కానందున ఎన్నికల అధికారులు తిరస్కరించారు. ఎంఐఎం పార్టీ తరఫున మీర్జా రహమత్ బేగ్ నామినేషన్ సరిగానే ఉందని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఇక ఎంఐఎం పార్టీ తరఫున మీర్జా రహమత్ బేగ్ నామినేషన్ సరిగానే ఉందని రటర్నింగ్ అధికారి తెలిపారు. దీంతో ఎంఐఎం పార్టీకి లైన్ క్లియర్ అయింది. ఇక గెలుపు లాంఛనమే కానుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఎంఐఎం ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపును ఖరారు చేయనున్నారు.

## పరీక్షల విధులను అంకితభావంతో నిర్వహిస్తాం: ఇంటర్ విద్య జెఎసి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మార్చి 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఇంటర్ బోర్డుకు, ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తామని ఇంటర్ విద్య జేఏసీ ప్రకటించింది. ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణలో చిత్తుశుద్ధితో పనిచేసి ఇంటర్ బోర్డు ప్రతిష్టను, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను.. అంతకుమించి 10 లక్షల మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు హితోధికంగా శ్రమించి పరీక్షల విదుల్లో పాల్గొంటామని ఇంటర్ విద్య జేఏసీ ఛైర్మన్ పి మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

## టిడిపి ద్వారానే బిసిలకు రాజకీయ అధికారం

### చేతివృత్తుల వారికి చట్టసభల్లో పోటీచేసే అవకాశం: కాసాని జ్ఞానేశ్వర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** టిడిపి ద్వారానే బీసీలకు రాజకీయ అధికారం లభిస్తుందని తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ స్పష్టం చేశారు. చేతివృత్తుల వారికి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ వేదికగా తయారు చేశారని అన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను శుక్రవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు, మెట్టుకాని శ్రీనివాస్ అధ్వర్యంలో వాల్మీకి హక్కుల పోరాట సమితి, బేడ బుడగ జంగం హక్కుల సాధన సమితి, సంచార జాతుల జేఏసీ నాయకులు కలిశారు. తెలుగుదేశం పార్టీకి వారు తమ సంఘీభావాన్ని, సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లను మొట్టమొదటిగా కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. దీని ద్వారా సామాన్యులు కూడా మండల అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారని చెప్పారు. ఎస్సీలకు 14శాతం నుంచి 15శాతం వరకు, ఎస్టీలకు 4 శాతం నుంచి 6 శాతం వరకు రిజర్వేషన్లను జీవో ద్వారా పెంచిన ఘనత ఎన్టీఆర్, తెలుగుదేశం పార్టీదే అని అన్నారు. బడుగు, బలహీన వర్గాలు, పేదలు, మహిళలు, మైనారిటీలు అందరికీ సామాజిక న్యాయం జరగాలన్నా రాజకీయ న్యాయం జరగాలన్నా తిరిగి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్త కంభంపాటి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. వివిధ సంఘాల నేతలు మీనుగ గోపి బోయ, గగనం వెంకట స్వామి, చింతల సంపత్, కె.శీలా తదితరులు పాల్గొన్నారు.



## నాజీర్ కామెంట్‌కు హర్మన్‌ప్రీత్ కౌంటర్!

**కేప్‌టౌన్:** దక్షిణాఫ్రికాలో జరుగుతున్న మహిళా టి20 ప్రపంచకప్‌నుంచి భారత్‌జట్టు గురువారం నిష్క్ర మించింది. కేప్‌టౌన్‌లో జరిగిన సెమీఫైనల్ మొదటిమ్యాచ్‌లో ఐదుపరుగులతేడాతో ఓటమి చవిచూసిన భారత్‌జట్టు రెండోసారి ఫైనల్‌కి చేరే అవకాశం చేజార్చుకుంది. జట్టు విజయానికి 33 బంతుల్లో 41పరుగులుచేయాల్సిన స్థితిలో హర్మన్ ప్రీత్ రనౌట్‌కాగానే అక్కడినుంచి టీమ్ ఒత్తిడికి గురయింది. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాజీర్ హుస్సేన్‌మాత్రం హర్మన్‌రనౌట్‌ను స్కూలు పిల్లల తప్పిదంగా వర్ణించాడు. నిర్లక్ష్యంగాపరుగెత్తి బ్యాట్‌ని సరిగా క్రీజులో పెట్టలేక పోయిందని వ్యాఖ్యలు చేసాడు. నాజిర్ హుస్సేన్ వ్యాఖ్యలకి హర్మన్‌ప్రీత్ కౌంటర్ ఇచ్చింది. క్రికెట్‌లో బ్యాటర్లు అలా రనౌటవడం చాలాసార్లు నేను చూసాను. కొన్ని సార్లు క్రీజుదగ్గర బ్యాట్‌స్టక్ అవుతుంటుంది. సెమీస్‌లో నాకు స్టక్ అవడం మా దురదృష్టం. నేను అది స్కూల్‌గర్ల్ తప్పిదంగా భావించడంలేదు. మేం ఇంటర్నేషనల్‌స్థాయిలో మ్యాచ్ ఆడుతున్నాం. ఓవరాల్‌గా ఆరనౌట్ బ్యాట్‌లక్ అంతే అని హర్మన్ ప్రీత్‌చెప్పింది.

## ఆరుకోట్లతో ఆవాస్ ప్రాజెక్టులో కోహ్లీ ఇల్లు కొనుగోలు

**ముంబయి:** టీమిండియా స్టార్ బ్యాటర్‌విరాట్‌కోహ్లీ భారీ ఖర్చుతో ఒక కొత్త ఇల్లుకొన్నాడు. ముంబయి లోని ఆలీబాగ్‌లో ఈ ఇంటిని కొన్నట్లు తెలుస్తోంది. ఇక్కడచేపట్టిన లగ్జరీ బంగ్లాప్రాజెక్టు ఆవాస్ విలేజ్‌లో ఒక ఇంటిని కొన్నాడు. మొత్తం రెండువేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ ఇంటిని ఆరుకోట్లకు కోహ్లీ కొనుగోలుచేసినట్లు సమాచారం. ఈ ఇళ్లకు సెలబ్రిటీల్లో మంచి డిమాండ్ ఉన్నట్లు ప్రాజెక్టునిర్వాహకులు చెపుతున్నారు. ఆవాస్ ప్రాజెక్టుకు కేవలం ఐదునిమిషా ల్లోనే మాండ్వాజెట్టికి వెళ్లవచ్చు. ఇక్కడినుంచి స్పీడ్ బోట్లపైముంబయి వెళ్లడానికి కేవలం 15 నిమిషాలు పడుతుందని ఆవాస్ లివింగ్‌ప్రాజెక్టు లీగల్ కన్సల్టెంట్ మహేష్ మాత్రే త ఎలిపారు. ప్రస్తుతం ఆసీస్ టూర్‌వల్ల కోహ్లీ బిజీగా ఉన్నాడని, ఆతని సోదరుడు వికాస కోహ్లీ ఈ ఇంటి రిజిస్ట్రేషన్‌ప్రక్రియ పూర్తిచేసాడని మాత్రే వివరించాడు. స్టాంప్‌డ్యూటీకింద రూ.36 లక్షలు చెల్లించారు.

# సెమీస్ ఓటమిపై హర్మన్‌ప్రీత్ భావోద్వేగం



**కేప్‌టౌన్:** ప్రపంచకప్‌ట్రోఫీని ముద్దాడాలన్న లక్ష్యంతో ధీటుగా ఆడినప్పటికీ సెమీస్ మ్యాచ్ ఓటమి పాలవడంపై భారత మహిళా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ తీవ్ర భావోద్వేగానికి లోనయింది. గత ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత్ ఈసారి సెమీస్‌లోనే ఇంటిబాటపట్టింది. ఈక్రమంలోనే హర్మన్ కన్నీటిపర్యంతం అయింది. అక్కడే ఉన్న భారత మాజీ సారథి అంజుమ్‌చోప్రా హర్మన్‌ను అక్కున చేర్చుకుని ఓదార్చింది. ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని హర్మన్‌కు ఓదార్పుమాటలు చెప్పింది. ఇందుకుసంబంధించిన దృశ్యాలు ఇపుడు వైరల్ అయ్యాయి.

మ్యాచ్‌ప్రెజెంటేషన్‌సమయంలో సన్‌గ్లాసెస్‌ధరించిన హర్మన్ తన కన్నీటిని మాతృదేశం చూడకూడదన్న లక్ష్యంతోనే వాటిని ధరించినట్లు చెప్పింది. దక్షిణాఫ్రికాలో అండర్19 టీమ్ ప్రపంచకప్ సాధించి ఐసిసి టైటిల్‌గెలిచారు. అదేజోష్‌తో అదేగడ్డపై ట్రోఫీని ముద్దాడాలన్న హర్మన్‌ప్రీత్‌సేన కల కలగానే మిగిలిపోయింది. ఈటోర్నీలో సెమీస్‌కు దూసుకువెళ్లినా పరాజయం తప్పలేదు. కీలక మ్యాచ్‌ముందు కెప్టెన్ కౌర్ అస్వస్థతకు గురయిందన్న వార్త కలవరపెట్టింది. అయినా ఆస్ట్రేలియాను ఎదుర్కొనే క్రమంలో బరిలోకి దిగిన హర్మన్ అద్భుత ఇన్నింగ్స్ 34 బంతుల్లో 52 పరుగులు చేసింది. 173 పరుగుల లక్ష్యఛేదనలో భాగంగా జెమీమారోడ్రిగ్స్ 24 బంతుల్లో 43పరుగులతో చెలరేగింది. హర్మన్ అర్ధశతకంతో మెరిసింది. ఆమె రనౌట్ కావడంతో టీమిండియా అవకాశాలు దెబ్బతిన్నాయి.

# గాయంతో వెళ్లడం ఎంతోబాధగా ఉంది



## ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్

**న్యూఢిల్లీ:** బోర్డర్ గవాస్కర్‌ట్రోఫీలో ఆస్ట్రేలియా టీమ్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. వివిధ కారణాలవల్ల ఇప్పటికే ఆరుగురు ఆటగాళ్లు స్వదేశానికి తిరిగి వెళ్లిపోయారు. టీమిండియాతో వరుసగా రెండు టెస్టుల్లో ఓడిన ఆసీస్ మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో అయినా రాణించాలని ఉవ్విళ్లూరుతున్నవేళ వ్యక్తిగత కారణాలు,గాయాల బెడద వల్ల వీరుజట్టుకు దూరం అయ్యాడు. మిచెల్ స్వెప్సన్ తన తొలి సంతానం చూసుకునేందుకు స్వదేశం వెళ్లిపోగా జోష్‌హేజిల్‌వుడ్ మడమనొప్పి, వార్నర్‌మోచేతిగాయం, మ్యాట్‌రెన్షా మోకాలి గాయంతో ఆసీస్‌కువెళ్లిపోయారు. ఇక తొలిరెండు మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం రాని ఆస్టన్ ఆగర్ దేశవాళీక్రికెట్‌పై ఫోకస్‌పెట్టి వెళ్లాడు. ప్యాట్‌కమిన్స్ తన కుటుంబంకోసం సొంతదేశానికి చేరుకున్నాడు.

తన తల్లి ఆరోగ్యం మెరుగుపడని కారణంగా కెప్టెన్ కమిన్స్ మూడో టెస్టుకు దూరం అవుతుండగా స్టీవ్‌స్మిత్ పగ్గాలుచేపట్టే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో టీమిండియాతో తొలిరెండు టెస్టులో విఫలమై జట్టుకు దూరం అయిన ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఎమోషనల్‌పోస్టుతో అభిమానుల ముందుకువచ్చాడు. గాయం కారణంగా జట్టును వీడటం ఎంతోబాధగా ఉంది. ఇలాంటి చేదుజ్ఞాపకాలను కోరుకోలేదని, నాకు మద్దతిచ్చిన ప్రతి ఒక్క ఫ్యాన్‌కు ధన్యవాదాలని, ఢిల్లీమ్యాచ్‌మేం అనుకున్నటున లసాగలేదని,మిగిలిన రెండుమ్యాచ్‌ల్లో జట్టు పుంజుకుని మెరుగైన ప్రదర్శన చూపుతుందని ఆశిస్తున్నా అంటూ వార్నర్ ఉద్వేగానికి లోనయ్యాడు. టీమిండియాతో నాగ్‌పూర్ టెస్టులో 11 పరుగులుచేసిన వార్నర్, రెండో టెస్టులో 15పరుగులుమాత్రమేచేసాడు. ఢిల్లీ టెస్టుమధ్యలోనే మ్యాచ్‌నుంచి నిష్క్రమించాడు. తర్వాత భార్యాపిల్లలతోకలిసి హుమాయూన్‌సమాధి దర్శించిన వార్నర్ తిరిగి వెళ్లిపోయాడు. ఇన్‌స్టాలో తనఫోటోలు పంచుకుంటూ తనకు అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞ తలుతెలిపాడు.




## ఆసీస్ ఆల్‌రౌండర్ రీఎంట్రీ

**న్యూఢిల్లీ:** భారత్‌తోమూడో టెస్టు ఆడనున్న పర్యాటక ఆస్ట్రేలియా జట్టులోకి స్టార్ ఆల్‌రౌండర్ కామెరూన్‌గ్రీన్ రీఎంట్రీ ఇస్తున్నాడు. గాయాలపాలయిన ఆతడు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్‌సాధించాడు. ఇండోర్‌లోని హోల్కర్‌స్టేడియంలో మార్చి ఒకటినుంచి మూడోటెస్టుమ్యాచ్‌ప్రారంబం కానుంది. ఇప్పటికే నాగ్‌పూర్,ఢిల్లీ వేదికగాజరిగిన రెండు టెస్టుమ్యాచ్‌ల్లో చిత్తుగా ఓడిపోయిన ఆస్ట్రేలియా టీమ్ నాలుగు టెస్టుల సిరీస్‌లో 0:2తో వెనకబడింది. మూడో టెస్టుకి కెప్టెన్ పాట్‌కమిన్స్, సీనియర్ ఓపెనర్ డేవిడ్ వార్నర్,ఫాస్ట్‌బౌలర్ జోష్ హేజిల్‌వుడ్,స్పిన్నర్ ఆస్టన్ ఆగర్ తదితరులు దూరమయ్యారు. వారు స్వదేశానికి వెళ్లిపోయారు ఈక్రమంలో కామెరూన్‌గ్రీన్ రీఎంట్రీ ఆస్ట్రేలియా టీమ్‌కి గొప్ప ఊరటగా నిలిచింది. భారత్‌ఆసీస్‌మధ్య జరుగుతున్న ఈ బోర్డర్ గావాస్కర్‌ట్రోఫీలో కామెరూన్ గ్రీన్ ఇంకా ఒక్కమ్యాచ్‌కూడా ఆడలేదు. ట్రోఫీ ఆరంభానికిముందే చేతివేలి గాయం కారణంగా ఆతడు మొదట నాగ్‌పూర్‌టెస్టుకు దూరంగా ఉన్నాడు. తర్వాత ఢిల్లీ టెస్టులో ఆడేలా కనిపించినా మ్యాచ్ టైమ్‌కి ఫిట్‌నెస్ సాధించలేకపోయాడు. దాంతో పక్కనపెట్టారు. ఆల్‌రౌండర్ ఇపుడు తాను పూర్తి స్థాయిలోఫిట్‌గా ఉన్నట్లు ప్రకటించాడు. రెండేళ్లనుంచి ఆసీస్ జట్టులో ఆడుతున్న కామెరూన్‌గ్రీన్ ఇప్పటివరకూ 18 టెస్టులు ఆడి 806 పరుగులుచేసాడు. వీటిలో ఆరు అర్థశతకాలున్నాయి. అలాగే 23 వికెట్లుకూడా ఉన్నాయి. బౌలింగ్‌లో ఆతని అత్యుతమ ప్రదర్శన 5/27కావడం విశేషం.

## హాసన్‌ఆలీని కొట్టబోయిన బాబర్ ఆజమ్!



**కరాచి:** పాకిస్థాన్‌ప్రీమియర్‌లీగ్‌లో ఓ సరదా సన్నివేశం జరిగింది. ఈ టోర్నీలో పెషావర్‌టీమ్‌కి కెప్టెన్‌గా బాబర్ ఆజమ్ ఆడుతుండగా ఇస్లామాబాద్ యునైటెడ్ టీమ్‌కి ఫాస్ట్‌బౌలర్ హసన్ ఆలీ ఆడుతున్నాడు. తాజాగా ఈ రెండుజట్లమధ్య జరిగిన మ్యాచ్‌లో హసన్ ఆలీని కొట్టేందుకు బాబర్ అజామ్ సరదాగా ప్రయత్నించాడు. హసన్ ఆలీ బౌలింగ్‌లో బంతిని హిట్‌చేసిన బాబర్ అజామ్ సింగిల్‌కోసం నాన్‌స్ట్రైక్ ఎండ్‌లో పరుగెత్తాడు. అదేసమయంలో అప్పటికే బంతి విసిరిన హసన్ ఆలీ కాలుజారి పిచ్‌మధ్యలో కూర్చుని కనిపించాడు. దాంతో ఆతని వెనుకవైపు పరుగెత్తుకుంటూ వచ్చిన బాబర్ ఆజమ్ బ్యాట్‌ని పైకెత్తి హసన్ ఆలీని కొట్టేలాకనిపించాడు. హసన్‌ఆలీ వేగంగాపైకిలేచి బాబర్ ఆజమ్‌కి అందకుండా పరుగెత్తాడు. దాంతో మైదానంలోని ఆటగాళ్లతోపాటు కామెంట్రీ బాక్స్‌లోని మాజీ క్రికెటర్లుసైతం గట్టిగా నవ్వేసారు. ఈమ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్‌చేసిన పెషావర్‌టీమ్ ఎనిమిది వికెట్ల నష్టానికి 156 పరుగులుచేసింది. కెప్టెన్ బాబర్ ఆజమ్ 58 బంతుల్లో ఏడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 75 పరుగులుచేసాడు. కానీ లక్ష్యాన్ని 14.5 ఓవర్లలోనే ఇస్లామాబాద్ టీమ్‌ఛేదించింది. హసన్ ఆలీ నాలుగు ఓవర్లు బౌలింగ్‌చేసి 35 పరుగులిచ్చి మూడు వికెట్లుతీసాడు.

# స్పైస్‌జెట్ నికర లాభం రూ.110 కోట్లు

**ముంబై, ఫిబ్రవరి 24:** దేశంలోని బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తన డిసెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను విడుదల చేసింది. ఈ క్రమంలో కంపెనీ మంచి లాభాలను నమోదు చేసింది. ఏకీకృత నికర లాభంలో 160 శాతం పెరిగి రూ.110 కోట్లుగా నమోదైంది. క్రితం యేడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం కేవలం రూ.42 కోట్లుగా ఉంది. కంపెనీ తన ఫలితాల వివరాలను ప్రకటించడంతో స్పైస్‌జెట్ కంపెనీ షేర్లు 10శాతానికిపైగా లాభపడ్డాయి. ఈ క్రమంలో స్టాక్ 11.72 శాతం మేర పుంజుకొని రూ.39.55 వద్ద ట్రేడవుతోంది. కార్యకలాపాల ద్వారా కంపెనీఆదాయం రూ.2,316.8కోట్లకు చేరుకుంది. కంపెనీ రెండవ త్రైమాసికంలో రూ.1,954 కోట్ల ఆదాయంపై రూ.833 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. తాము నిర్ధేశించుకున్న కార్యాచరణ లక్ష్యాలను అధిగమించామని స్పైస్‌జెట్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ సింగ్ వెల్లడించారు. సాటిలేని పనితీరుతో 2022లో ప్రతి ఒక్క నెలలో అత్యధిక లోడ్ ఫ్యాక్టరీతో కొనసాగినట్లు ఆయన వెల్లడించారు. ప్యాసింజర్, కార్గో వ్యాపారాల్లో బలమైన పనితీరు కారణంగా లాభాలను నమోదు చేయగలిగినట్లు ఈ సందర్భంగా తెలిపారు.




## అదానీ సంక్షోభంతో ఎల్ఐసికి నష్టాలు

**ముంబై, ఫిబ్రవరి 24:** అదానీ గ్రూపు సంక్షోభం కారణంగా ఆ కంపెనీల్లో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) పెట్టుబడిగా పెట్టిన ప్రజా ధనం విలువ కోల్పోయింది. దాని ఇన్వెస్ట్ మెంట్ నెగిటివ్ గా మారింది. పోర్టుల దగ్గర నుంచి పవర్ వరకు ఆ గ్రూపులో ఇప్పటి వరకు రూ.30,127 కోట్లను ఎల్ఐసి ఇన్వెస్ట్ చేసింది. అయితే దాని విలువ రూ.30 వేల కోట్లకు పడిపోయింది. గతేడాది డిసెంబరు నాటికి ఈ పెట్టుబడి విలువ రూ.62,550 కోట్లు ఉండగా, హిండెన్‌బర్గ్ నివేదిక అనంతరం జనవరి 27 నాటికి రూ.56,142 కోట్లకు పడిపోయింది. అప్పటి నుంచి ఏకధాటిగా పడుతూనే ఉంది. మార్కెట్లో లిస్ట్ కాబడిన 10 అదానీ గ్రూపు సంస్థలు 50 శాతాన్ని మించి నష్టాలు మూటగట్టుకున్నాయి. వికీపీడియా ఆర్టికల్స్‌ని తారుమారు చేశారన్న వార్త రావడంతో మరో రూ.50 వేల కోట్లు కోల్పోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఇప్పటికే ఆ సంస్థలు రూ.11 లక్షల కోట్లకుపైగా నష్టపోగా, పరిస్థితి మరింత దుర్భరంగా తయారవుతోంది. ఎల్ఐసితో పాటు భారతీయ బ్యాంకులు, ఆస్ట్రేలియన్ రిటైర్‌మెంట్ ఫండ్స్‌కు సంబంధించిన ఎక్స్‌పోజర్ ఇప్పుడు మరింత ఆందోళన కలిగిస్తోంది. హిండెన్‌బెర్గ్ ఆరోపణలను ఎదుర్కోవడానికి అదానీ గ్రూప్ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా మార్కెట్ ఫాల్ మీద ఎటువంటి ప్రభావం చూపలేకపోతున్నాయి. ఆయా కంపెనీల రుణ వ్యవహారాలపై సెబి కూడా దర్యాప్తు జరుపుతోంది. ప్రపంచ ధనవంతుల జాబితాలో టాప్ 3 స్థానం నుంచి గౌతమ్ అదానీ 29కి పడిపోయారు. ఈ భారీ కుదుపు కారణంగా ప్రపంచంలోని మొదటి 5 స్థానాల్లో ఉండాల్సిన భారతీయ సూచీలు కూడా తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటున్నాయి.

भारतीय जीवन बीमा निगम
LIC
LIFE INSURANCE CORPORATION OF INDIA

## 300 మంది 'శాప్‌ల్యాబ్స్' ఉద్యోగుల కోత

**బెంగళూరు, ఫిబ్రవరి 24:** శాప్ ల్యాబ్స్ భారతదేశ కేంద్రాలలో పని చేస్తున్న సుమారు 300 మంది ఉద్యోగులను తొలగించింది. గ్లోబల్ డెలివరీ సెంటర్ మూసివేయడం వల్ల ఈ తొలగింపు జరిగిందని సంస్థ తెలిపింది. ఇందులో ఎక్కువ మంది బెంగళూరు, గురుగావ్ కార్యాలయాల్లో పనిచేసేవారు ఉండడం విశేషం. నివేదికల ప్రకారం, కంపెనీ తొలగించిన ఉద్యోగులలో దాదాపు 10 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల అనుభవం ఉన్నవారు కూడా ఉన్నారు. రిట్రెంచ్ మెంట్ తర్వాత వీరందరికి కంపెనీ మంచి ప్యాకేజీ, ఇతర ప్రయోజనాలను అందిస్తూ మార్గం చూపుతుంది. ఉద్యోగుల తొలగింపు రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించిన వ్యూహాత్మకపరివర్తన, ఇది ప్రస్తుతం తొలగింపుకి గురైన ఉద్యోగులపైన తీవ్రప్రభావం చూపుతుంది. కొత్త ఉద్యోగుల నైపుణ్యాలను ఉపయోగించుకోవడానికి కంపెనీ ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని కొంతమంది చెబుతున్నారు. గతనెలలో శాప్‌ల్యాబ్స్ యొక్క మాతృసంస్థ సాప్ ప్రపంచవ్యాప్తంగా దాని కోర్ బిజినెస్‌పై దృష్టిపెట్టడానికి తొలగింపులను ప్రకటించింది. దీనివల్ల 3వేల మంది ఉద్యోగులను తొలగించింది. డిసెంబరు 2022తో ముగిసిన నాల్గవ త్రైమాసికంలో కంపెనీ తొలగింపులు ప్రకటించింది.




## వాణిజ్యం

# స్టాక్ సూచీలకు వారం మొత్తం నష్టాలే..

**ముంబై, ఫిబ్రవరి 24:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఆరో రోజూ నష్టాలను చవిచూశాయి. శుక్రవారం ఉదయం లాభాలతో ప్రారంభమైన సూచీలు మధ్యాహ్నం తర్వాత పూర్తిగా నష్టాల్లోకి జారుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు దేశీయ సూచీలపై ప్రభావం చూపాయి. మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్ల అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్ చివరికి 141.87 పాయింట్లు క్షీణించి 59,463.93 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 45.45 పాయింట్లు క్షీణించి 17,465.80 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.82.68 వద్ద నిలిచింది. ఏసియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టిపిసి, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, రిలయన్స్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంకు, అల్ట్రాటెక్ సిమెంట్స్, బజాజ్ ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, టైటాన్ కంపెనీ షేర్లు పుంజుకున్నాయి. ఎంఅండ్ఎం, టాటా స్టీల్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టి, మారుతి సుజుకీ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి, టెక్ మహీంద్రా, భారతీఎయిర్‌టెల్, ఐటిసి, కోటక్ మహీంద్రా బ్యాంకు వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. మ్యాక్రోటెక్ డెవలపర్స్ ఇంట్రాడేలో రూ.711 వద్ద యేడాది కనిష్టానికిచేరింది. చివరికి 10.59 శాతం నష్టపోయి రూ.720.50 వద్ద నిలిచింది. డెలివరీలో టైగర్ గ్లోబల్ తన వాటాను 2.55 శాతానికి తగ్గించుకుంది. డెలివరీ షేరు శుక్రవారం ఒక శాతం పుంజుకొని రూ.349.15 వద్ద నిలిచింది. అదానీ గ్రూప్ కంపెనీల స్టాక్స్‌లో పతనం శుక్రవారం కూడా కొనసాగింది. అదానీ గ్రీన్, అదానీ టోటల్ గ్యాస్, అదానీ పవర్, అదానీ ట్రాన్స్‌మిషన్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు అత్యధికంగా 5.11 శాతం క్షీణించింది.




# బోయింగ్ డ్రీమ్ లైనర్ల తయారీకి బ్రేక్!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 24:** బోయింగ్ సంస్థ 787 డ్రీమ్ లైనర్ విమానాల తయారీని తాత్కాలికంగా నిలిపివేసింది. కీలక పరికరాల సామర్థ్యాన్ని పరీక్షించేందుకు అదనపు పరీక్షలు నిర్వహించనుంది. ఈ విషయాన్ని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) వెల్లడించింది. ఎఫ్ఎఎ ఆ పరికరాల పనితీరుతో సంతృప్తి చెందేవరకు డ్రీమ్ లైనర్ల సరఫరాలు జరగవు. ఇటీవల సరఫరా చేసిన విమానాలకు అవసరమైన మార్పులు చేయడం కోసం ఎఫ్ఎఎ బోయింగ్‌తో కలిసి పనిచేస్తోంది అని ఏజెన్సీ వెల్లడించింది. దీనిపై బోయింగ్ కూడా స్పందించింది. మా సరఫరాదారులు పంపిణీ చేసిన బల్క్ హెడ్ సామర్థ్యం విశ్లేషణలో తప్పు జరిగినట్లు గుర్తించాం. దీంతో సరఫరాలను నిలిపివేశాం. అవసరమైన విశ్లేషణలు, డాక్యుమెంటేషన్ పూర్తి చేసిన తర్వాత వీటిని పునరుద్ధరిస్తాం. ప్రస్తుతం సర్వీసులో ఉన్న విమానాల భద్రతకు ఎటువంటి ఇబ్బంది లేదు. కాకపోతే త్వరలో పూర్తి చేయాల్సిన డెలివరీలు ప్రభావితం అవుతాయి. ఈ యేడాది మా సరఫరా లక్ష్యాల్లో ఎటువంటి మార్పులు చేయడం లేదు అని ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ యేడాది దాదాపు 80 విమానాలను సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రతినెలా ఐదు 787 విమానాలను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొంది.



## ఒకే డెస్క్ స్పేస్‌లో ఇద్దరు ఉద్యోగులు: గూగుల్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 24:** టెక్ దిగ్గజం గూగుల్ పలు ఆఫీసులను మూసేస్తోంది. అమెరికాలోని పలు చోట్ల ఉన్న కంపెనీకార్యాలయాలను మూసేసి, ఉద్యోగులను మరోచోట సర్దుబాటుచేస్తోంది. ఇప్పటికే ఉన్న ఆఫీసులలో డెస్క్ స్పేస్ సర్దుబాటు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో, సియాటెల్, కాలిఫోర్నియా తదితర నగరాల్లోని కంపెనీ ఉద్యోగులకు అంతర్గత మెమో జారీచేసినట్లు సమాచారం. ఈ మేరకు సిఎన్‌బిసి ఓ నివేదిక వెల్లడించింది. రోజూ ఆఫీసుకు వచ్చి పనిచేసే ఉద్యోగులు ఇకపై తమ డెస్క్ స్పేస్‌ను మరో ఉద్యోగితో పంచుకోవాలని గూగుల్ సూచించింది. ఒకే డెస్క్ స్పేస్‌లో ఇద్దరు ఉద్యోగులు సర్దుకోవాలని ఆదేశించింది. కంపెనీ అనవసరమని భావిస్తున్న పలు ఆఫీసులను మూసేసి, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను మరోచోట సర్దుబాటు చేస్తోంది. ఇందుకోసం ఆయా ఉద్యోగులు మెమో జారీచేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అద్దె భవనాలలో నడుస్తున్న గూగుల్ కార్యాలయాల్లో కొన్నింటిని ఖాళీ చేయనున్నట్లు గూగుల్ వర్గాలు తెలిపాయి.




## ఒలెక్ట్రా గ్రీన్ టెక్ షేరు రయ్..రయ్..

**ముంబై, ఫిబ్రవరి 24:** యేడాదిలోనే హైడ్రోజన్ బస్సు వాణిజ్యపరంగా ప్రారభించబడుతుందనే వార్తలు ఇన్వెస్టర్లలో జోష్ ఇచ్చాయి. భవిష్యత్తులో ప్రజా రవాణాకు సమర్ధవంతమైన పరిష్కారంగా హైడ్రోజన్ ఆధారిత వాహనాలు వస్తున్నందున కంపెనీ భాగస్వామ్యం వార్తలతో స్టాక్ దాదాపు 18.36 శాతం మేర పెరిగాయి. ఈ క్రమంలో స్టాక్ ధర రూ.476.15 వద్ద మార్కెట్లో ట్రేడవుతోంది. కేవలం శుక్రవారం ఒక్కరోజే ఏకంగా రూ.74 వరకు లాభపడింది. కార్బన్ రహిత ప్రజా రవాణా వ్యవస్థ ఏర్పాటు కోసం కంపెనీ చేస్తున్న ప్రయత్నం భారతదేశ పర్యావరణ లక్ష్యాలకు దోహదపడుతోంది. సాంప్రదాయ ప్రజా రవాణాకు హైడ్రోజన్ బస్సు పూర్తిగా కార్బన్ రహిత ప్రత్యామ్నాయం అని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ల అనుబంధ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్ టెక్ తెలిపింది.

aa Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at thire printing Press and Warangal cross Road, Edulapuram, Khammam-507003, Ponees:253535, RNI No. 10685/02, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.H/SD/337/12-14 **postal liance :L/R NP KHM-8/12-14.**